www.andhrajyothy.com
పేజీలు: 12
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 199
మంగళవారం | 4-11-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి రా.10:36 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: రేవతి మ.12:34 తదుపరి అశ్వని, వర్జ్యం: తె.6.09 మొదలు, దుర్ముహూర్తం: ఉ.8.34-9.19, రా.9.48-10.37, అమృతఘడియలు: ఉ.10.25-11.51, తె 3.20-4.44, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.18, సూర్యాస్తమయం: 5.38
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


అయినవారిని కోల్పోయి.. కన్నీరుమున్నీరవుతూ..


బస్సులో కంకర కింద కూరుకుపోయి బాధతో విలపిస్తున్న ఓ మహిళ


సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలతో హిందూజా గ్రూప్ ప్రతినిధులు, అధికారులు

20 వేల కోట్ల పెట్టుబడులకు
హిందూజా సై

విశాఖలో విద్యుత్తు కేంద్రం విస్తరణ.. మరో 1600 మెగావాట్ల పెంపు

రాయలసీమలో సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు

మల్లవల్లిలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్

లండన్‌లో ఫలించిన ముఖ్యమంత్రి ప్రయత్నాలు

చంద్రబాబు సమక్షంలో హిందూజా ఒప్పందం

రోల్స్ రాయిస్ గ్రూప్, ఆక్టోపస్ ఎనర్జీ, శామ్కో హోల్డింగ్ ప్రతినిధులతోనూ సీఎం సమావేశం

పారిశ్రామికవేత్తలతో రౌండ్ టేబుల్ భేటీ

విశాఖ భాగస్వామ్య సదస్సుకు రావాలని ఆహ్వానం

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించేందుకు లండన్‌లో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు పారిశ్రామిక దిగ్గజాలతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం లండన్‌లోని ది లాంగ్లీ, బకింగ్‌హామ్ షైర్‌లో హిందూజా గ్రూప్ చైర్మన్ అశోక్ హిందూజా, యూరప్ వింగ్ చైర్మన్ ప్రకాశ్ హిందూజాతో సీఎం భేటీ అయ్యారు. ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలను వారికి వివరించారు. ఈ భేటీలో హిందూజా గ్రూప్‌తో కీలక ఒప్పందం కుదిరింది. దశలవారీగా రాష్ట్రంలో రూ.20 వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టాలని హిందూజా గ్రూప్ నిర్ణయించింది. ఒప్పందంలో

మిగతా 10వ పేజీలో...

ఓవర్ లోడ్ కంకరతో ఆర్టీసీ బస్సును ఢీకొన్న వాహనం
తెలంగాణలో ఘోర ప్రమాదం
19 మంది దుర్మరణం
టిప్పర్.. టెర్రర్!

మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్

హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు బోల్తా

ఒకరు మృతి, 10 మందికి గాయాలు

ఏలూరు జిల్లాలో ప్రమాదం

11


బాపట్ల జిల్లా కర్లపాలెం హైవేపై ప్రమాదానికి గురైన కారు

రెప్పపాటులో నలుగురు బలి

బాపట్లలో అర్ధరాత్రి లారీని ఢీకొన్న కారు

ఎయిర్ బ్యాగులున్నా నిలవని ప్రాణాలు

మృతులంతా ఒకే కుటుంబ సభ్యులు

రాజస్థాన్‌లో ట్రక్కు బీభత్సం..
19 మంది మృతి

మద్యం మత్తులో మునిగిన డ్రైవర్

వాహనాలను ఢీకొడుతూ.. తొక్కేస్తూ 5 కి.మీ.ల మేర సాగిన విధ్వంసం

2

వికారాబాద్-హైదరాబాద్ రోడ్డులో గుంతను తప్పించబోయి బస్సు మీదకు నేరుగా..



డ్రైవర్ వెనుక ఉన్న బస్సు భాగం నుజ్జునుజ్జు

టిప్పర్ ఒరిగిపడి కంకర కుప్పలా మారిన బస్సు

కంకర కిందపడి ఊపిరాడక ఎక్కువ మంది మృతి

అరగంటలోపే వెలికితీసినా దక్కని ప్రాణాలు

8 మృతదేహాలపై ఎలాంటి గాయాలూ లేవు

టిప్పర్ ఇలా బస్సుపై పడటంతో.. దానికింద నలిగిపోయి కొందరు, కంకరలో కూరుకుపోయి మరికొందరు మరణించారు

సమగ్ర కథనాలు 11వ పేజీలో...

ఆర్టీసీ బస్సు తాండూరు నుంచి హైదరాబాద్ వెళుతోంది. టిప్పర్ చేవెళ్ల నుంచి వికారాబాద్ వెళుతోంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద రోడ్డు మూల మలుపులో రెండూ ఎదురెదురుగా వచ్చాయి. 40 టన్నుల సామర్థ్యం కలిగిన టిప్పర్‌లో 55 టన్నుల కంకర వేశారు. లారీ బాడీని మించి కంకరను ఓవర్ లోడ్ చేశారు. దానికితోడు టిప్పర్ అతి వేగంగా దూసుకొచ్చింది. మూల మలుపులో ఓ చిన్న గుంతను డ్రైవర్ చూశాడు. దానిని తప్పించడానికి ప్రయత్నించాడు. అంతే.. అతి వేగంగా ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. అతి వేగం కారణంగా టిప్పర్ బ్యాలెన్స్ తప్పింది. దాని బాడీ మొత్తం బస్సువైపు ఒరిగింది. అందులోని కంకర బస్సులో కుప్పగా పడిపోయింది. దాదాపు 20-30 టన్నుల కంకర మీద పడడంతో బస్సులో కుడివైపు ముందు భాగంలో కూర్చున్నవాళ్లు దాని కింద కూరుకుపోయి సజీవ సమాధి అయిపోయారు. ప్రమాదం కంటే కంకర కారణంగా ఎక్కువమంది దుర్మరణం పాలయ్యారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో సోమవారం జరిగిన ఘోర విషాదమిది!!

‘ఫేక్’ చిచ్చుకు పోలీస్ ఉచ్చు!



సోషల్ పోస్టుల ద్వారా కుల ఘర్షణలను రెచ్చగొట్టేవారిపై సీరియస్

మూడు నెలల్లో ఏరివేసేందుకు పక్కా ప్రణాళిక

విష సంస్కృతి వ్యాప్తి చేస్తున్న వ్యక్తులపై నిఘా

వారి 698 సోషల్ మీడియా ఖాతాల గుర్తింపు

పొరుగు రాష్ట్రాల్లో ఫేక్ కంటెంట్ సృష్టించి విదేశాల నుంచి సోషల్ మీడియాలో పోస్టు

వైరల్ అవగానే మొదటి ఖాతాల్లో డిలీట్

ఏఐ ద్వారా పసిగట్టిన పోలీసులు.. చర్యలకు సిద్ధం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

‘ఆ రెండు కులాలు ఏకమైనందునే ఎన్నికల్లో ఓడిపోయాం. వచ్చే ఎన్నికల్లో ఓట్లు చీలిపోవాలి. అందుకే... ఆ కులాల మధ్య చిచ్చు పెట్టాలి. ఏ చిన్న ఘటన జరిగినా కులం రంగు పులిమి... విద్వేష పూరిత కంటెంట్ క్రియేట్ చేసి సోషల్ మీడియాలో వదలాలి’... ఇదో విష వ్యూహం! దీని కోసం దేశ, విదేశాల్లోని వారినీ వాడుకుంటున్నారు. అసలు కులం ఏదైనప్పటికీ... ఫలానా కులాన్ని స్ఫురింప చేసే ఇంటి పేరుతో ఫేక్ అకౌంట్లు సృష్టిస్తున్నారు. వారి చేత మరో కులాన్ని నిందిస్తూ పోస్టులు పెడుతున్నారు. ఇలాంటి ‘ఫేక్’ వ్యక్తులపై పోలీసులు దృష్టి సారించారు. ఏ కారణంతో ఏ చిన్న ఘటన జరిగినా కులాలు, మతాలు, ప్రాంతాలమధ్య చిచ్చుపెట్టే కుట్రలకు చెక్ చెప్పేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అధికారం కోల్పోయిన అసహనంతో వైసీపీ తప్పుడు వార్తలు సృష్టించి తన సోషల్ మీడియా ద్వారా నేరుగా

మిగతా 12వ పేజీలో...



అధిష్ఠానం డైరెక్షన్ మేరకే మాట్లాడా!

కర్నూలు బస్సు ప్రమాదంపై దుష్ప్రచారం కేసులో విచారణకు వైసీపీ నేత, యాంకర్ శ్యామల హాజరు

ఆరోపణలకు ఆధారాలు అడిగిన పోలీసులు



కఠిన చర్యలు తప్పవు

కుల, మత, ప్రాంత విద్వేషాలు పెంచేవారిని సహించం.. ఏ దేశంలో దాక్కున్నా వదలం

3 నెలల్లో అంతా సరిదిద్దుతాం: డీజీపీ

ఆధారాలున్నాయ్

అందుకే జోగి అరెస్ట్.. కులాన్ని రాజకీయం కోసం వాడతారా?

మద్యం ముడుపులు తీసుకోలేదని ఏ దేవుడి ముందైనా ప్రమాణం చేస్తా

అలాగే జగన్ ప్రమాణం చేస్తారా?

విపత్తులు, ప్రమాదాలపై వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాం

జగన్ బెంగళూరులో ఉంటూ విమర్శలా?.. శ్రీకాకుళం రాలేదేం?: లోకేశ్



అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో ఆధారాలు ఉన్నందునే వైసీపీ నేత జోగి రమేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారని మంత్రి లోకేశ్ స్పష్టంచేశారు. తప్పు చేశారో లేదో చెప్పకుండా కులాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకునేందుకు వైసీపీ ప్రయత్నించడం ఏమిటని నిలదీశారు. సోమవారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్‌తో కలసి లోకేశ్ మీడియాతో మాట్లాడారు. ‘మా రాజకీయ జీవితంలో మద్యం ముడుపులు

మిగతా 10వ పేజీలో...

410 ఒప్పందాలు.. 9,80,000 కోట్ల పెట్టుబడులు

ఈ నెలంతా వరుస శంకుస్థాపనలు, ఎంవోయూలు

రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకునేందుకు వైసీపీ విద్వేషాలు రెచ్చగొడుతోంది: లోకేశ్

దొనకొండలో అంతర్జాతీయ క్యాన్సర్ సెంటర్

4,800 కోట్లతో ఏర్పాటు.. వరల్డ్ స్మార్ట్ సిటీ ఫోరం అధ్యక్షుడు పీటర్ చున్ వెల్లడి

హైబ్రిడ్ ఎనర్జీ ప్రాజెక్టుకు ఆర్ఈసీ నుంచి 7,500 కోట్లు

కర్నూలులో 1,040 మెగావాట్ల ప్రాజెక్టుకు మార్గం సుగమం


3

హాయ్‌ల్యాండ్‌కు పంపాలన్న
నిర్ణయం ఎవరిది?

గ్రూప్-1 జవాబు పత్రాలను తిరిగి ఎప్పుడు ఏపీపీఎస్సీకి తరలించారు?

బిల్లుల చెల్లింపు వివరాలను కోర్టు ముందుంచండి

అభ్యర్థుల జవాబుపత్రాలను సీల్డ్ కవర్‌లో ఇవ్వండి

ఏపీపీఎస్సీకి హైకోర్టు ఆదేశం.. తీర్పు రిజర్వ్

విద్యార్థులే లక్ష్యంగా కొండారెడ్డి డ్రగ్స్ దందా! 10

పక్కా ప్లాన్‌తో విశాఖకు మాదకద్రవ్యాలు

వైసీపీ విద్యార్థి నేతకు భారీ నెట్‌వర్క్

బెంగళూరు వ్యక్తితో వ్యాపార లావాదేవీలు

తాను చెడి.. ఇతరులనూ చెడగొట్టిన వైనం

డబ్బు ఆశతో రవాణా చేస్తున్న గుడివాడ విద్యార్థి

48 ఎల్ఎస్‌డీ బోల్ట్స్ స్వాధీనం: డీసీపీ ప్రశాంతి

భక్తితో రండి.. భద్రంగా వెళ్లండి! 12

క్యూలైన్లలో క్రమశిక్షణగా వ్యవహరించాలి

తోటి భక్తులకు ఇబ్బంది కలిగించవద్దు

రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి

అవసరమైతే పోలీసు సాయం తీసుకోవాలి

ఆలయంలో సమాచార ప్రకటనలు తప్పనిసరి

భక్తుల భద్రత నిమిత్తం ప్రత్యేక మార్గదర్శకాలు

వరుస ఘటనల నేపథ్యంలో సర్కారు చర్యలు

కార్మికుల పని గంటల్లో మార్పులు 10

రోజుకు 8 నుంచి 10 గంటలకు పెంపు

వారానికి 48 గంటలకు మించకూడదని రూల్

మహిళా ఉద్యోగుల నైట్ డ్యూటీల్లోనూ మార్పు

అమెరికా నుంచి భారీగా చమురు

అక్టోబరులో రోజుకు సగటున 5.75 లక్షల బ్యారెళ్లు దిగుమతి

2022 తర్వాత గరిష్ఠ స్థాయిలో

బ్రెంట్‌తో పోలిస్తే తక్కువ ధరకు లభించడమే కారణం 2



పాక్ అణు పరీక్షలు చేస్తోంది

రష్యా, ఉత్తర కొరియా, చైనా కూడా చేస్తున్నాయి

ఆ విషయాన్ని గుట్టుగా ఉంచుతున్నాయి

మేం అలాకాదు.. బహిరంగంగా చెబుతాం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్య

వాషింగ్టన్, బీజింగ్, నవంబరు 3: దాదాపు మూడు దశాబ్దాల తర్వాత అణ్వాయుధ పరీక్షలను తిరిగి ప్రారంభిస్తున్నామని ఇటీవలే ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలకు షాకిచ్చిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఆయన ఈ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. తామే కాదు.. చాలా దేశాలు అణ్వాయుధాలను

మిగతా 2వ పేజీలో...

పాక్‌కు 8 చైనా జలాంతర్గాములు

భారత నేవీకి చెక్ పెట్టే వ్యూహం

2026లో మొదటిది అందే చాన్స్

అనిల్ అంబానీ
ఆస్తుల జప్తు

వాటి ముఖ విలువ 7,500 కోట్లు

అనిల్ నివాసముండే ముంబై ఇల్లు సహా దేశవ్యాప్తంగా ఆస్తులు స్వాధీనం

మనీలాండరింగ్ కేసులో జప్తు చేస్తున్నట్లు ప్రకటించిన ఈడీ

మంచిరేవులలోని 76 ఎకరాలూ?

న్యూఢిల్లీ, నవంబరు 3: అనిల్ అంబానీ రిలయన్స్ గ్రూప్ సంస్థలకు సంబంధించిన రూ.7,500 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. మనీలాండరింగ్ కేసులో ఈ ఆస్తులను జప్తు చేస్తున్నట్లు అక్టోబరు 31న ఈడీ ప్రకటించింది. ఈ ఆస్తుల్లో అనిల్ అంబానీ నివాసం ఉంటున్న పాలీ హిల్స్ నివాసం, అతని గ్రూపు సంస్థల

మిగతా 2వ పేజీలో...


మాజీ మంత్రి జోగి రమేశ్‌ను బెజవాడ జైలుకు తరలిస్తున్న పోలీసులు

జైలుకు జోగి బ్రదర్స్

రమేశ్, రాముకు 13 వరకు రిమాండ్

మద్యం స్కామ్‌లో మరో మలుపు! 12

మనీ లాండరింగ్ లింకు లాగిన సిట్.. డొల్ల కంపెనీల ద్వారా నిధులు

ముంబై వ్యాపారి అనిల్ చోఖ్రా సాయం.. ఇప్పటికే ఆధారాలు లభ్యం

విచారణలో నోరు తెరిచిన చోఖ్రా.. 49వ నిందితుడిగా చేరుస్తూ మెమో

త్వరలో అరెస్టు చేసే అవకాశం.. ఇప్పటికే 2 కేసుల్లో అరెస్టు చేసిన ఈడీ

భారత్‌కు తొలి మహిళా ప్రపంచ కప్
లక్షలాది మంది యువతకు స్ఫూర్తి



» ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల జల్లు

న్యూఢిల్లీ, నవంబరు 3: క్రీడల నుంచి స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) విద్య వరకు మహిళలు సత్తా చాటుతున్నారని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. తాజాగా జరిగిన ప్రపంచ కప్ పోటీల్లో భారత మహిళా జట్టు అద్భుత విజయం దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ విజయం దేశంలోని లక్షలాది మంది యువతకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీలో తొలిసారి నిర్వహించిన సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్(ఈఎస్‌టీఐసీ) సదస్సు-2025లో ప్రధాని ప్రసంగించారు. "ఈ సదస్సు పూర్తిగా సైన్స్‌కు సంబంధించిందే. అయినా, ముందుగా.. టీమిండియా మహిళలు సాధించిన అద్భుత విజయాన్ని ప్రస్తావించాలి. ఇది భారతకు దక్కిన తొలి మహిళా ప్రపంచ కప్. మహిళా జట్టులోని ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నా." అని అన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనూ మహిళలు విశేషంగా రాణిస్తున్నారని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా నూతన ఆవిష్కరణల విషయంలో దూసుకుపోతున్నారని, ఈ క్రమంలో "పేటెంట్‌ల కోసం దరఖాస్తు చేస్తున్నవారి సంఖ్య పెరుగుతోందన్నారు. "పదేళ్ల కిందటి వరకు పేటెంట్ల కోసం దరఖాస్తు చేసుకున్న మహిళల సంఖ్య ఏడాదికి 100లోపే ఉండేది. కానీ, ఇప్పుడు ఏటా 5 వేల మందికి పైగా తమ ఆవిష్కరణల పేటెంట్ల కోసం దరఖాస్తు చేస్తున్నారు." అని మోదీ తెలిపారు. కాగా, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు, వాటిని ప్రోత్సహించే లక్ష్యంతో రూ.లక్ష కోట్లతో రిసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్(ఆర్డీఐ) పథకానికి మోదీ శ్రీకారం చుట్టారు.

శబరిమల బంగారం చోరీపై రెండో కేసులో ఉన్నికృష్ణన్ అరెస్టు

» ద్వారాల పుత్తడి కూడా అపహరించినట్టు ఆరోపణ

పథనంథిట్ట, నవంబరు 3: శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో బంగారం చోరీ సంఘటనకు సంబంధించి నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టిని సోమవారం పోలీసులు మరో కేసులో అరెస్టు చేశారు. గతంలో ద్వారపాలక విగ్రహాల తొడుగులకు ఉన్న బంగారాన్ని మాయం చేశారన్న కేసులో అరెస్టు చేయగా, ప్రస్తుతం ద్వారబంధాలకు ఉన్న పుత్తడినీ అపహరించారన్న కేసులో అరెస్టు చేశారు. శ్రీకోవిల్‌లో ఉన్న బంగారం రేకులకు మరమ్మతులు చేయిస్తానని, అందుకు ప్రాయోజకుడిగా వ్యవహరిస్తానని చెప్పి పుత్తడిని అపహరించినట్టు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ఉన్నికృష్ణన్‌ను సోమవారం రన్నీలోని కోర్టులో హాజరు పరచగా, న్యాయస్థానం పది రోజుల కస్టడీకి పంపించింది.

ఎన్నికల్లో తాయిలాలుగా డ్రగ్స్

» రూ.24.61 కోట్ల విలువైన మాదకద్రవ్యాల పట్టివేత

న్యూఢిల్లీ, నవంబరు 3: ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రాజకీయ పార్టీలు తాయిలాలుగా నగదు, మద్యం, గృహోపకరణాలు వంటివి ఇవ్వడం ఇప్పటివరకు చూశాం. తాజాగా వీటి జాబితాలో డ్రగ్స్ చేరడం విస్మయం కలిగిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికలు జరగనున్న బిహార్ తదితర రాష్ట్రాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు రూ.24.61 కోట్ల విలువైన మాదకద్రవాలను స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం వెల్లడించింది. సీజ్ చేసిన తాయిలాల మొత్తం విలువ రూ.108.19 కోట్లకు పైగా ఉంటుందని పేర్కొంది. వీటిలో రూ.9.62 కోట్ల నగదు, రూ.42.14 కోట్ల మద్యం, రూ.5.8 కోట్ల బంగారం, వెండి, రూ.26 కోట్ల విలువైన ఉచిత వస్తువులు తదితరాలున్నాయని తెలిపింది.

మృత్యుంజయుడు కాదు.. జీవచ్ఛవం

» విశ్వకుమార్ రమేశ్‌ను ఆదుకోని ఎయిర్ ఇండియా



లండన్, నవంబరు 3: విశ్వకుమార్ రమేష్..ఎంతో అదృష్టవంతుడని అప్పట్లో అందరూ అనుకున్నారు. అహ్మదాబాద్‌లో జూన్ 21న జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డ ఏకైక వ్యక్తి అతడే కావడంతో అందరూ ఆయన ప్రశంసించారు. గాలిలోకి ఎగిరిన కొద్ది క్షణాల్లోనే విమానం కూలడంతో 241 మంది మరణించగా, 11ఏ సీటు వద్ద కూర్చొన్న ఒక్క రమేష్ మాత్రం తప్పించుకున్నాడు. అయితే, ప్రస్తుతం ఆయన పరిస్థితి చూస్తే దారుణంగా ఉంది. ప్రమాదానికి బాధ్యత వహించాల్సిన ఎయిర్ ఇండియా ఆదుకోవడం లేదని కుటుంబ సభ్యులు వాపోయారు. బ్రిటిష్ పౌరుడైన ఆయనకు అహ్మదాబాద్‌లో చికిత్స చేసిన అనంతరం తిరిగి బ్రిటన్‌లోని లీసెస్టర్‌కు పంపించారు. ఆయన ప్రస్తుతం పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీఎస్‌డీ) బాధపడుతున్నా పట్టించుకునే వారే లేరు. అతడు రోజంతా మౌనంగా ఉండిపోతూ భార్య, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడడం లేదు.

రష్యా సాయంతో ఇరాన్‌లో 8 అణు విద్యుత్ ప్లాంట్లు

టెహ్రాన్, నవంబరు 3: అణువిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా ఇరాన్ చర్యలు తీసుకుంది. రష్యా సాయంతో తమ దేశంలో కొత్తగా ఎనిమిది అణు విద్యుత్ ప్లాంట్లను నిర్మించనున్నామని వెల్లడించింది. స్వచ్ఛమైన, స్థిరమైన ఇంధన ఉత్పత్తిని విస్తరించుకునే చర్యల్లో భాగంగా ఈ ప్లాంట్లు నిర్మిస్తామని ఇరాన్ అణుశక్తి సంస్థ (ఏఈవోఐ) చీఫ్ మొహమ్మద్ ఇస్లామి ఆదివారం ప్రకటించారు. బుషెహర్ ప్రావిన్స్‌లో నాలుగు, ఉత్తర, దక్షిణ తీర ప్రాంతాల్లో మరో నాలుగు అణు విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి రష్యాతో ఒప్పందం కుదిరిందని ఆయన వెల్లడించారు. ఆ ప్లాంట్ల ద్వారా 20 వేల మెగావాట్ల అణువిద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టు లక్ష్యం అణ్వాయుధాలను తయారు చేయడం కాదని.. అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునేందుకేనని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్పష్టం చేశారు.

ఈడీ కేసులో అనిల్ అంబానీ ఆస్తుల జప్తు





ఈడీ స్వాధీనం చేసుకున్న ముంబైలోని అనిల్ అంబానీ ఇల్లు


(మొదటి పేజీ తరువాయి)

పేరు మీద ఉన్న భవనాలు ఉన్నాయి. ఢిల్లీలోని మహారాజా రంజిత్‌సింగ్ మార్గ్‌లో ఉన్న పెద్ద ప్లాట్‌తో పాటు ఢిల్లీ, నోయిడా, గాజియాబాద్, ముంబై, పూణె, థానె, హైదరాబాద్, చెన్నై, తూర్పు గోదావరి ప్రాంతాల్లో రిలయన్స్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ పేరుతో ఉన్న రియల్ ఎస్టేట్ భూములను జప్తు చేసినట్లు ఈడీ ప్రకటించింది. నవీ ముంబైలోని ధీరూబాయ్ అంబానీ నాలెడ్జి సిటీలో ఉన్న 132 ఎకరాల భూమి విలువే రూ.4,462 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈడీ చర్యపై రిలయన్స్ ఇన్‌ఫ్రా స్పందిస్తూ, ఆస్తులు తాత్కాలికంగా జప్తు చేసిన విషయం నిజమేనని, అయితే తమ కార్యకలాపాల మీద, ఉద్యోగుల మీద ఈ చర్య ప్రభావం ఏ మాత్రం ఉండబోదని తెలిపింది. ప్రజల నుంచి సేకరించిన సొమ్మును రిలయన్స్ హోంఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా సొంత అవసరాలకు మళ్లించారన్నది ఆరోపణ. 2017-19 మధ్యకాలంలో ఎస్‌బ్యాంక్ రూ.2,965 కోట్లు రిలయన్స్ హోంఫైనాన్స్ లిమిటెడ్‌లో, రూ.2,045 కోట్లు రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో పెట్టుబడి పెట్టింది. 2019 డిసెంబరు కల్లా ఈ రెండు సంస్థల నుంచి రావాల్సిన మొత్తాలను నిరర్థక ఆస్తులుగా ప్రకటించింది. అప్పటికి రిలయన్స్ హోంఫైనాన్స్ నుంచి రూ.1353.5 కోట్లు, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ నుంచి రూ.1,984 కోట్లు తిరిగి చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయి. నిజానికి ఇవి ఎస్ బ్యాంకు సొమ్ము కూడా కాదు. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ నిప్పన్ మ్యూచువల్ ఫండ్స్‌కు చెందినవి. ప్రజల నుంచి సేకరించిన సొమ్ము అది. సెబీ నిబంధనల ప్రకారం మ్యూచువల్ ఫండ్స్ సొమ్మును అనిల్ అంబానీ సంస్థల్లో పెట్టుబడి పెట్టడం కుదరదు. కానీ, దానికి ఎస్ బ్యాంకు ముసుగు వేసి అనిల్ అంబానీకి చెందిన రెండు సంస్థల్లో పెట్టుబడులు పెట్టించారు. వాటి ద్వారా అనిల్ అంబానీ ఇతర కంపెనీలకు సాధారణ అవసరాల కార్పొరేట్ రుణాలు ఇచ్చారు. దరఖాస్తు ఇచ్చిన రోజే వందల కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేసినట్లు ఈడీ గ్రహించింది. దరఖాస్తు, మంజూరు, ఒప్పందం, నిధుల బదిలీ ఒకేరోజు జరిగాయి. కొన్నిసార్లు రుణం మంజూరు కాక ముందే నిధుల బదిలీ జరిగిపోయింది. క్షేత్ర తనిఖీని పూర్తిగా ఎత్తేశారు. రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్) కుంభకోణంపై దర్యాప్తు జరుపుతున్నపుడు గ్రూప్ సంస్థల్లో అవకతవకలు బయటకు వచ్చాయి. 2010-12 మధ్య కాలంలో ఆర్‌కామ్ దేశీయ, విదేశీ సంస్థల నుంచి రూ.40,000 కోట్ల అప్పులను తీసుకుంది. వాటిని తీర్చేక్రమంలో ఎక్కడా డీఫాల్ట్ కాకుండా చూసేందుకు అనిల్ రిలయన్స్ గ్రూపునకు సంబంధించిన కంపెనీల నుంచి రూ.13,600 కోట్లను మళ్లించారు. అందులో 12,600 చెల్లింపులకే ఖర్చు పెట్టారు. ఒక రూ.800 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా ఉంచారు. పలు దఫాలుగా రూ.600 కోట్లను అక్రమ పద్ధతుల్లో విదేశాలకు తరలించారు.

మంచిరేవులలో 76 ఎకరాలు కూడా?

హైదరాబాద్‌లోని మంచిరేవులలో 76.2 ఎకరాలను 2007లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం రిలయన్స్ ఇన్‌ఫ్రాకు కేటాయించింది. అప్పట్లో ఈ సంస్థ ఆ భూమి కోసం రూ.517 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. అయితే, కేవలం రూ.250 కోట్లు చెల్లించింది. 2014లో ఇక్కడే వంద అంతస్తుల భవనం కడుతున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు రిలయన్స్ ఇన్‌ఫ్రా ఆస్తులను జప్తు చేసిన వాటిలో హైదరాబాద్ ఆస్తులు కూడా ఉండటంతో మంచిరేవుల 76.2 ఎకరాల భూములే జప్తు చేసినట్లు భావిస్తున్నారు.

లోకం తీరు



చేవెళ్ల, ఏపీ, రాజస్థాన్‌లలో ఘోర రోడ్డు ప్రమాదాలు

రాజస్థాన్‌లో ట్రక్కు బీభత్సం.. 19 మంది మృతి!

జైపూర్, నవంబరు 3 : రాజస్థాన్‌లోని జైపూర్‌లో మద్యం మత్తులో ఉన్న ఒక డంపర్ ట్రక్కు డ్రైవర్ సోమవారం రహదారిపై బీభత్సం సృష్టించాడు. వరుసగా 5కి.మీ దూరం పలు వాహనాలపైకి దూసుకుపోవడంతో 19 మంది మృతి చెందగా.. 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. జైపూర్‌లోని లోహమండి రోడ్డుపై వేగంగా వచ్చిన ట్రక్కు అదుపు తప్పి ఎదురుగా వస్తోన్న పలు వాహనాలపైకి దూసుకుపోయింది. ట్రక్కు డ్రైవర్ బాగా మద్యం మత్తులో ఉన్నాడని, 5కి.మీ. వరకు ఎదురుగా వచ్చిన ప్రతి వాహనాన్ని ఢీకొట్టుకుంటూ వెళ్లాడని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. పోలీసులు ట్రక్కు డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని మద్యం మత్తులో ఉన్న విషయాన్ని నిర్ధారించేందుకు వైద్య పరీక్షలకు తరలించారు. ప్రధాని మోదీ ఈ దుర్ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మరణించిన వారికి రూ.2,00,000, గాయపడిన వారికి రూ.50,000 ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

9 రాష్ట్రాలు, 3 యూటీల్లో నేటి నుంచే 'సర్'

న్యూఢిల్లీ/చెన్నై, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఓటరు సమగ్ర సవరణ(సర్) ప్రక్రియకు భారత ఎన్నికల సంఘం(ఈసీ) మంగళవారం నుంచి శ్రీకారం చుట్టనుంది. 9 రాష్ట్రాలు, 3యూటీల్లో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి ఏడో తేదీ వరకు కొనసాగే ఈ ప్రక్రియలో 51 కోట్ల మంది ఓటర్లు పాలుపంచుకోనున్నారు. ఈ రెండో దశ 'సర్' ప్రక్రియ కిందకు వచ్చే యూటీలు, రాష్ట్రాలు ఏవనేది ఈసీ వర్గాలు వెల్లడించాయి. అండమాన్ అండ్ నికోబార్, లక్షద్వీప్, పాండిచ్చేరి యూటీ జాబితాలో, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లు రాష్ట్రాల జాబితాలో ఉన్నాయి. సర్ ప్రక్రియ అనేక దశల్లో కొనసాగనుంది. ఎన్యుమరేషన్ ప్రక్రియ మంగళవారం మొదలై డిసెంబరు 4వ తేదీ వరకు కొనసాగుతుంది. అనంతరం ముసాయిదా ఓటరు జాబితాను డిసెంబరు 9వ తేదీన, తుది జాబితాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న ఈసీ విడుదల చేస్తుంది. స్వాతంత్ర్య భారతంలో 'సర్' ప్రక్రియను ఈసీ చేపట్టడం ఇది తొమ్మిదోసారి. చివరిగా 2002-04 మధ్య చేపట్టింది. మరోవైపు, తమిళనాడులో 'సర్' ప్రక్రియను అడ్డుకోవాలంటూ అధికార డీఎంకే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు ఆ పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి ఆర్‌ఎస్ భారతి సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమిళనాట ఆరుమాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పరిస్థితుల్లో అత్యవసరంగా సర్ ప్రక్రియను చేపట్టడం ప్రజాప్రాతినిధ్య చట్టానికి వ్యతిరేకమని ఆ పిటిషన్‌లో భారతి తెలిపారు.

పారదర్శకంగా 'సర్': ఈసీ

'సర్' ప్రక్రియను పారదర్శకంగా చేపడతామని, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని ఈసీ మద్రాస్ హైకోర్టుకు నివేదించింది. మృతులు, నివాసం మారినవారు, అర్హతలేనివారు, రెండు ప్రాంతాల్లో ఓటుహక్కు కలిగిన వారి పేర్లను తొలగించేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలంటూ టీ నగర్‌కు చెందిన అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, తాంబరం అన్నాడీఎంకే న్యాయవాది వినాయగం వేర్వేరుగా దాఖలు చేసిన పిల్‌పై ఇటీవల విచారణ చేపట్టిన హైకోర్టు.. ఈసీని వివరణ అడిగిన విషయం తెలిసిందే. భారత ఎన్నికలసంఘం తరఫున స్టాండింగ్ కౌన్సిల్ నిరంజన్ రాజగోపాలన్ హాజరయి దీనిపై వివరణ ఇచ్చారు.

ఆ నిబంధన వద్దే వద్దు

న్యాయ విద్యార్థులకు కనీస హాజరుపై ఢిల్లీ హైకోర్టు తీర్పు

న్యూఢిల్లీ, నవంబరు 3: కనీస హాజరుశాతం లేదన్న సాకుతో పరీక్షలు రాయకుండా న్యాయ విద్యార్థులకు అనుమతి నిరాకరించొద్దని దేశంలోని న్యాయ కళాశాలలకు ఢిల్లీ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. విద్యార్థులకు తప్పనిసరి హాజరుశాతం నిబంధనపై ఆందోళన వ్యక్తం చేసిన జస్టిస్‌లు ప్రతిభా ఎం సింగ్, అమిత్ శర్మలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం తీర్పు చెబుతూ.. ఈ హాజరుశాతం నిబంధనను సవరించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ)కి సూచించింది. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి కానివ్వవద్దని పేర్కొంది. కనీస హాజరు శాతం లేనందున 2016 ఆగస్టులో పరీక్షలు రాసేందుకు కళాశాల యాజమాన్యం అనుమతి నిరాకరించడంతో అదేనెల 10న సుశాంత్ రోహిల్లా ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో సుమోటో పిటిషన్‌పై హైకోర్టు ఈ తీర్పునిచ్చింది.

నిషేధాల వల్ల నేపాల్‌లో ఏమైందో చూడండి!

» పోర్న్ వీడియోలు చూడటంపై నిషేధం విధించాలన్న పిటిషన్‌పై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ, నవంబరు 3: దేశంలో పోర్న్ వీడియోలు చూడటంపై నిషేధం విధించేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. నేపాల్‌లో జెన్-జీ ఉద్యమాన్ని పరోక్షంగా ప్రస్తావించింది. "నిషేధాల వల్ల నేపాల్‌లో ఏం జరిగిందో చూడండి" అని పిటిషనర్‌కు సూచించింది. సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మొదట ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి ఒప్పుకోలేదు. అయితే, తర్వాత నాలుగు వారాలయ్యాక విచారిస్తామని తెలిపింది.

అమెరికా నుంచి భారీగా ముడిచమురు

న్యూఢిల్లీ, నవంబరు 3: పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో రష్యా నుంచి చవగ్గా వస్తున్న చమురునే పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్న భారతదేశం.. కిందటి నెలలో (అక్టోబరు) అమెరికా నుంచి భారీగా ముడిచమురును దిగుమతి చేసుకుంది. అక్టోబరు 27వ తేదీనాటికి సగటున రోజుకు 5,75,000 బ్యారెళ్ల చొప్పున కొనుగోలు చేసింది! ప్రముఖ డేటా అండ్ అనలిటిక్స్ సంస్థ కెప్లర్ గణాంకాల ప్రకారం 2022 తర్వాత భారత్ అమెరికా నుంచి ఈ స్థాయిలో చమురు దిగుమతి చేసుకోవడం ఇదే. నవంబరులో కూడా ఈ జోరు కొనసాగుతుందని.. రోజుకు 4 లక్షల నుంచి 4.75 లక్షల బ్యారెళ్ల క్రూడాయిల్‌ను భారత్ దిగుమతి చేసుకుంటుందని మార్కెట్ నిపుణుల అంచనా. అక్టోబరుకు ముందు అమెరికా నుంచి చమురు కొనుగోళ్లు.. సగటున రోజుకు 3 లక్షల బ్యారెళ్ల దాకా ఉండేవి. అయితే.. రష్యా నుంచి చమురు కొనొద్దంటూ ట్రంప్ మనదేశంపై తెస్తున్న ఒత్తిడి ఈ పెరుగుదలకు కారణం కాదని.. ఆర్థిక పరిస్థితులే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు. వారు చెబుతున్నదాని ప్రకారం.. అమెరికా ముడిచమురు (డబ్ల్యూటీఐ-వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడాయిల్) ధర బ్రెంట్ ముడిచమురు ధర కన్నా తక్కువగా ఉండడం, చైనాలో చమురు డిమాండ్ తగ్గిపోవడంతో భారత రిఫైనరీలు అమెరికా నుంచి ముడిచమురు దిగుమతులను పెంచాయి. అలాగని రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు ఏమీ తగ్గలేదు. సెప్టెంబరుతో పోలిస్తే అక్టోబరులో రష్యా నుంచి చమురు దిగుమతులు పెరిగాయి.

అమెరికా దాడి చేసేలా ఉంది.. ఆయుధాలు ఇవ్వండి

» రష్యా, చైనా, ఇరాన్‌లకు వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో లేఖలు

వాషింగ్టన్, నవంబరు 3: తమ దేశానికి సమీపంలో, కరీబియన్ సముద్రంలో అమెరికా యుద్ధ నౌకలను మోహరించిన నేపథ్యంలో రష్యా, చైనా, ఇరాన్‌ల సాయం కోరుతూ నికోలస్ మదురో లేఖలు రాశారు. అమెరికా తమపై దాడి చేయవచ్చని అందులో ఆందోళన వ్యక్తం చేశారు. క్షిపణులు, రాడార్లు అందజేయాలని, తమ యుద్ధ విమానాలకు మరమ్మతులు చేయాలని పుతిన్, జిన్‌పింగ్‌లను కోరారు. ఇటీవల ఇరాన్‌లో పర్యటించిన వెనెజువెలా మంత్రి సెలెస్టినో.. ఆ దేశం నుంచి సాయుధ డ్రోన్లు, ఆయుధాల సరఫరాపై చర్చించారు. మరోవైపు సైన్యాన్ని, ఆయుధాలను తరలించేందుకు వీలు కల్పించే 'ఇల్యుషిన్ ఐఎల్-76' రవాణా విమానాన్ని రష్యా తాజాగా వెనెజువెలాకు అందజేసిందని ఫ్లైట్ రాడార్24 వెబ్‌సైట్ తెలిపింది. అయితే, ఇప్పటికిప్పుడు వెనెజువెలాపై యుద్ధం చేసే ఆలోచనేదీ లేదని, కాకపోతే మదురోకు రోజులు దగ్గరపడ్డాయని ట్రంప్ వ్యాఖ్యానించారు.

పాక్ అణు పరీక్షలు చేస్తోంది



(మొదటి పేజీ తరువాయి)

పరీక్షిస్తున్నాయని.. ఆ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని సంచలన ప్రకటన చేశారు. రష్యా, చైనా, ఉత్తర కొరియా, పాకిస్థాన్ సహా ప్రపంచంలో అనేక దేశాలు రహస్యంగా అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయని సీబీఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ వెల్లడించారు. 'కానీ.. ఆయా దేశాలు వాటి గురించి మాట్లాడడం లేదు. మేం మాత్రం అలాకాదు. ఏదైనా బహిరంగంగానే చెబుతాం' అని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా, చైనా వద్ద ఉన్న అణ్వాయుధాల కంటే తమ వద్ద ఎక్కువే ఉన్నాయని ట్రంప్ తెలిపారు. తమ వద్ద ఉన్న అణ్వాయుధాలతో ఈ ప్రపంచాన్ని 150 సార్లు పేల్చేయవచ్చన్నారు. అయితే.. అణ్వస్త్రాల నిరాయుధీకరణ గురించి తాను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మాట్లాడానని ట్రంప్ తెలిపారు. అణ్వాయుధ పరీక్షలు ప్రారంభించాలంటూ ట్రంప్ తాజాగా జారీచేసిన ఆదేశాలపై అమెరికా ఇంధనశాఖ కార్యదర్శి క్రిస్ రైట్ వివరణ ఇచ్చారు. తాము జరపబోయే అణుపరీక్షల్లో ఎలాంటి విస్ఫోటాలు ఉండవని స్పష్టం చేశారు. అణ్వాయుధాలకు సంబంధించి ఇతర వ్యవస్థలన్నీ నిర్దేశిత లక్ష్యం మేరకు పనిచేస్తున్నాయో లేదో తెలుసుకునేందుకే ఈ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా, చైనా రహస్యంగా అణ్వాయుధాలను పరీక్షిస్తోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఆ దేశం తీవ్రంగా ఖండించింది. తమ దేశం ఎల్లప్పుడూ శాంతియుత అభివృద్ధి మార్గానికి కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది. అణ్వాయుధాల విషయంలో 'ముందుగా వినియోగించకూడదు' అనే విధానానికి కట్టుబడి ఉన్నామని, చైనా అణు వ్యూహం పూర్తిగా రక్షణాత్మకమైనదని పేర్కొంది.

చైనా నుంచి పాక్‌కు 8 జలాంతర్గాములు

ఆపరేషన్ సిందూర్ తర్వాత తన నౌకాదళ సామర్థ్యాన్ని పెంచుకోవాలని పాకిస్థాన్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో భారత నౌకాదళానికి పోటీనిచ్చేలా తమకు దాడి సామర్థ్యం కలిగిన 8అత్యాధునిక హ్యాంగోర్ క్లాస్ జలాంతర్గాములను సరఫరా చేయాలని చైనాను పాక్ కోరింది. వాటిలో మొదటిది వచ్చే ఏడాది పాక్ నేవీకి అందుతుందని ఇరు దేశాల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. భారత నేవీకి పోటీగా చైనా నుంచి ఎనిమిది దాడి జలాంతర్గాములను కొనుగోలు చేయాలనే నిర్ణయాన్ని 2015లోనే పాకిస్థాన్ రక్షణ మంత్రిత్వ శాఖ పార్లమెంటరీ కమిటీకి తెలిపింది. ఈ ఒప్పందం విలువ 5 బిలియన్ డాలర్ల వరకూ ఉంటుందని, 2028 నాటికి ఈ సబ్‌మెరైన్ల అప్పగింత పూర్తవుతుందని భావిస్తున్నట్టు తెలిపింది.

బిజినెస్

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	580
చిత్తూరు	593	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	115
వరంగల్	107	గుంటూరు	121
కరీంనగర్	107	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	118
కర్నూలు	107	నెల్లూరు	123
విశాఖపట్నం	111	అనంతపురం	123
గోదావరి	115		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,23,170 ▲	1,12,900 ▲	1,68,000 ▲
విజయవాడ	1,25,000 ▲	1,17,000 ▼	1,53,000 ▲
విశాఖపట్నం	1,24,510 ▲	1,13,000 ▲	1,68,000 ▲
రాజమండ్రి	1,23,160 ▲	1,12,900 ▲	1,51,000 ▲
ప్రొద్దుటూరు	1,21,400 ▲	1,11,690 ▲	1,53,000 ▲
ముంబై	1,20,780 ▲	1,10,630 ▲	1,49,300 ▲

ఎయిర్‌టెల్ లాభం రెండింతలు

25.7 శాతం పెరిగిన ఆదాయం



న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ సెప్టెంబరు 30వ తేదీతో ముగిసిన వర్తమాన ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి అద్భుతమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. అనుబంధ సంస్థలతో కలిసి (కన్సాలిడేటెడ్) ఈ కాలానికి కంపెనీ రూ.52,145 కోట్ల ఆదాయంపై రూ.8,651 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఎయిర్‌టెల్ ఆదాయం 25.7 శాతం పెరగ్గా, నికర లాభం మాత్రం రెండింతలకు పైగా పెరిగింది. జూన్ త్రైమాసికంతో పోలిస్తే మాత్రం కంపెనీ ఆదాయ వృద్ధిరేటు 5.4 శాతానికే పరిమితం అయింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ దేశీయ ఆదాయం 22.6 శాతం వృద్ధితో రూ.38,690 కోట్లకు చేరింది. ఇదే సమయంలో ఒక్కో ఖాతాదారుడి నుంచి లభించే సగటు ఆదాయం (ఆర్పు) 9.9 శాతం వృద్ధితో రూ.233 నుంచి రూ.256కు పెరిగింది. దేశీయ ఆదాయంతో పాటు ఆఫ్రికాలోని అనుబంధ సంస్థల పనితీరు మెరుగుపడడం క్యూ2లో మంచి పనితీరు కనబరిచినట్టు ఎయిర్‌టెల్ వైస్ చైర్మన్, ఎండీ గోపాల్ విఠల్ చెప్పారు.

62.4 కోట్ల మంది ఖాతాదారులు : సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి దేశ, ఆఫ్రికా దేశాల్లోని ఎయిర్‌టెల్ ఖాతాదారుల సంఖ్య 62.4 కోట్లకు చేరింది. ఇందులో 45 కోట్ల మంది దేశీయ ఖాతాదారులు కాగా, మిగతా 17.4 కోట్ల మంది ఆఫ్రికా దేశాల్లోని ఖాతాదారులు. రెండో త్రైమాసికంలో అదనంగా 9.5 లక్షల మంది పోస్టు పెయిడ్ ఖాతాదారులు చేరడంతో వారి సంఖ్య 2.75 కోట్లకు చేరింది. గత ఏడాది కాలంలో స్మార్ట్‌ఫోన్ డేటా ఖాతాదారుల సంఖ్య కూడా 2.22 కోట్ల మేర పెరిగినట్టు తెలిపింది.

సెన్సెక్స్ 40 పాయింట్లు అప్

ముంబై: స్తబ్దుగా సాగిన ట్రేడింగ్‌లో ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం అతి స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. సెన్సెక్స్ 39.78 పాయింట్లు పెరిగి 83,978.49 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 41.25 పాయింట్ల వృద్ధితో 25,763.35 వద్ద ముగిసింది.

ఫ్యాబెక్స్ స్టీల్ రెండో ప్లాంట్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక ఫ్యాబెక్స్ స్టీల్ స్ట్రక్చర్స్ కంపెనీ తెలంగాణలోని చిట్యాల వద్ద తన రెండో ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసింది. రూ.120 కోట్ల పెట్టుబడితో 40 ఎకరాల్లో 50,000 టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి కూడా ప్రారంభించినట్టు తెలిపింది.

భారత్ బయోటెక్ సీఆర్‌డీఎంఓ యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ సెల్ అండ్ జీన్ థెరపీ ఆధారిత ఔషధాల కాంట్రాక్టు రీసెర్చి డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ (సీఆర్‌డీఎంఓ) రంగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం జినోమ్ వ్యాలీలో 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అనుబంధ సంస్థ 'నూసిలియాన్ థెరాపెటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించింది.

వొడాఫోన్ ఐడియాపై టీజీహెచ్ ఆసక్తి!

రూ.52,800 కోట్ల వరకు పెట్టుబడులు?
ఇరువర్గాల మధ్య పురోగతిలో చర్చలు

న్యూఢిల్లీ: భారీ అప్పులు, నష్టాలతో సతమతం అవుతున్న వొడాఫోన్ ఐడియాలో వాటా కొనుగోలుకు న్యూయార్క్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ (టీజీహెచ్) ఆసక్తిగా ఉన్నట్లు తెలిసింది. 400-600 కోట్ల డాలర్ల (సుమారు రూ.35,000-52,800 కోట్లు) పెట్టుబడుల ద్వారా వీఐ యాజమాన్య, నిర్వహణ హక్కులు చేజిక్కించుకోవాలని టీజీహెచ్ భావిస్తున్నట్లు ఓ ఆంగ్లమీడియా కథనం వెల్లడించింది. ఇందుకు సంబంధించి ఇరువర్గాల మధ్య చర్చలు పురోగతిలో ఉన్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఆదిత్య బిర్లా క్యాపిటల్, వొడాఫోన్ పీఎల్‌సీ వీఐ ప్రమోటర్లుగా ఉన్నాయి. ప్రతిపాదిత పెట్టుబడుల ద్వారా వీఐ ప్రమోటర్‌గా ఈ రెండు గ్రూపుల స్థానాన్ని టీజీహెచ్ భర్తీ చేయాలనుకుంటోంది. ప్రస్తుతం వీఐలో ఆదిత్య బిర్లా క్యాపిటల్ 9.50%, వొడాఫోన్ పీఎల్‌సీ 16.07% వాటాలు కలిగి ఉన్నాయి. కంపెనీ చెల్లించాల్సిన స్పెక్ట్రమ్ రుసుము, ఏజీఆర్ బకాయిలను ఈక్విటీగా మార్చుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కంపెనీలో అతి పెద్ద (48.99 శాతం) వాటాదారుగా అవతరించింది. వీఐకి ప్రభుత్వం నుంచి మరింత ఊరట లభించడంపై టీజీహెచ్‌తో ఒప్పందం ఆధారపడి ఉన్నట్లు తెలిసింది.

వొడాఫోన్ ఐడియా షేరు 10 శాతం అప్

బీఎస్‌ఈలో వొడాఫోన్ ఐడియా షేరు ధర సోమవారం ఒకదశలో 14.20% ఎగబాకి రూ.9.97 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 9.28 శాతం లాభంతో రూ.9.54 వద్ద ముగిసింది. పెట్టుబడుల కోసం టీజీహెచ్‌తో వీఐ చర్చలు జరుపుతోందన్న వార్తలతోపాటు ఏజీఆర్ బకాయిలకు మరింత ఊరట కల్పించే విషయంలో కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టతనివ్వడంతో షేరు భారీగా ర్యాలీ తీసింది.

గ్లాండ్ ఫార్మా లాభం రూ.184 కోట్లు

హైదరాబాద్: సెప్టెంబరు త్రైమాసికంలో గ్లాండ్ ఫార్మా రూ.1,487 కోట్ల ఆదాయంపై రూ.184 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ నికర లాభం 12 శాతం పెరిగింది. సీడీఎంఓ విభాగం సినెక్సీ అద్భుత పనితీరు ఇందుకు ప్రధాన కారణమని కంపెనీ తెలిపింది. కొత్త ఉత్పత్తులతో అక్టోబరు నుంచి 2026 మార్చి మధ్య మరింత మెరుగైన పనితీరు కనబరుస్తామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీనివాస్ సాదు అన్నారు.

నేడు టీడీపీ కేంద్ర కార్యాలయానికి లోకేశ్

» క్రమశిక్షణ కమిటీ ముందు హాజరుకానున్న చిన్ని, కొలికిపూడి

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు ఆయన పార్టీ కార్యాలయంలోనే ఉండనున్నారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఆయన స్వీకరిస్తారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడతారు. మరోవైపు విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మంగళవారమే పార్టీ క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరుకానున్నారు. ఈ అంశంపైనా లోకేశ్ దృష్టి సారించే అవకాశం ఉంది. ప్రజాదర్బార్‌కు వచ్చే వారి కోసం కార్యాలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

తప్పుచేసి కులం కార్డు వాడతారా!

» పక్కా ఆధారాలతోనే జోగి అరెస్ట్: కొల్లు రవీంద్ర

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం కేసులో జోగి రమేశ్‌ను పూర్తి సాక్ష్యాలతో పోలీసులు అరెస్టు చేశారని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నకిలీ మద్యాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు జోగి రమేశ్ కుట్ర పన్నారని చెప్పారు. ఆయనకు జనార్దన్‌రావుకు మధ్య బంధం అందరికీ తెలిసిందేనని, జనార్ధన్‌రావు.. రమేశ్ ఇంటికి వెళ్లిన సీసీ కెమెరా ఫుటేజీ కూడా ఉందని తెలిపారు. తప్పులు చేసి కులం కార్డు వాడుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. అధికారం అండతో వైసీపీ బీసీలపై దమనకాండ సాగించినప్పుడు జోగి ఏమయ్యారని ప్రశ్నించారు. కేసును డైవర్ట్ చేసేందుకే అల్లరి మూకలతో ఇంటి వద్ద, ఆస్పత్రి వద్ద నానా యాగీ చేయించాడన్నారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా పోలీసులు జోగికి అనుకూలంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్ర ఆర్యవైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

» నూతన కమిటీ నియామకం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసరావు, రామ్మోహనరావుకు నియామకపత్రాన్ని అందజేసిన అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా

ముషీరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్య వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆర్య వైశ్య భవనంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐ.వి.ఎఫ్) నూతన కమిటీ ఏర్పాటైంది. అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వారికి నియామకపత్రాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐ.వి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసరావు, రామ్మోహనరావు, కోశాధికారిగా సుబ్బారాయిలు, యువజన సంఘం అధ్యక్షుడిగా అభినయ్, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివకుమార్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా నాగసుప్రజ, చీఫ్ కోఆర్డినేటర్‌గా అజయ్ చంద్ర, కోఆర్డినేటర్‌గా సూర్యప్రకాష్, యువజన విభాగం కోశాధికారిగా రవిచంద్ర నియమితులయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారిని శ్రీనివాస్ గుప్తా, అంతర్జాతీయ ఐ.వి.ఎఫ్ సలహాదారులు గంజి రాజమౌళి గుప్తా సన్మానించారు.

స్వచ్ఛత-పరిశుభ్రతలో రోల్ మోడల్‌గా ఏపీ

» స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం

కుప్పం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత, పరిశుభ్రత నిర్వహణలో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే రోల్ మోడల్‌గా చేస్తామని స్వచ్ఛ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం చెప్పారు. చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం కుప్పం పురపాలక సంఘంలో ఆయన పర్యటించారు. డంపింగ్ యార్డును పరిశీలించాక కుప్పం పురపాలక సంఘంలో అమలవుతున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అధికారులతో సమీక్ష జరిపారు. తర్వాత కడా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పట్టాభిరాం మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి త్వరలోనే స్వచ్ఛ సేవక్ దళ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు స్వచ్ఛ బడులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్తను పోగేసి, మళ్లీ దానిపై చెత్త పన్ను విధించిందని విమర్శించారు. కుప్పం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బొజ్జి రెడ్డి

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా రంపచోడవరానికి చెందిన సొల్లా బొజ్జి రెడ్డిని ప్రభుత్వం నియమించింది. సభ్యులుగా గొర్ల సునీత(రంపచోడవరం నియోజకవర్గం), కద్రక మల్లేశ్వరరావు(కురుపాం), కాకి లక్ష్మి(పోలవరం), కిల్లో సాయిరామ్(అరకులోయ), పి.వెంకటప్ప (గుంతకల్)లను నియమించింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీచేసింది.

గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్లకు పదోన్నతులు!

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్లకు స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ల పదోన్నతి ప్యానెల్‌లో పేరు చేర్చేందుకు ప్రభుత్వం సవరణ ఉత్తర్వులను జారీ చేసింది. కె.మేరీ గోల్డ్ డైమండ్, పి.నరసింహ ప్రసాద్, జి.సృజన, బి.శ్రీకాంత్, డి.రవీంద్ర, ఎ.దాదా బాషా, బి.విజయ్‌సారధి, ఎం.ఏసుబాబులకు స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లుగా పదోన్నతి కల్పించేందుకు అవకాశం కల్పిస్తూ ఆదేశాలిచ్చింది.

గ్రూప్-1 జవాబు పత్రాలను హాయ్‌ల్యాండ్‌కు పంపాలన్న

నిర్ణయం ఎవరిది?

» తిరిగి వాటిని ఎప్పుడు ఏపీపీఎస్సీకి తరలించారు?

» బిల్లుల చెల్లింపు వివరాలను కోర్టు ముందుంచండి

» అభ్యర్థుల జవాబుపత్రాలను సీల్డ్ కవర్‌లో ఇవ్వండి

» ఏపీపీఎస్సీకి హైకోర్టు ఆదేశం... తీర్పు రిజర్వ్



అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలను మూల్యాంకనం నిమిత్తం హాయ్‌ల్యాండ్‌కు తరలించాలని ఎవరు నిర్ణయించారని హైకోర్టు ప్రశ్నించింది. "ఏపీపీఎస్సీనే ఈ నిర్ణయం తీసుకుందా?. అప్పటి చైర్మన్, సెక్రెటరీ సూచనలకు అనుగుణంగా వాటిని తరలించారా?. దీనికి సంబంధించి ఏమైనా ఉత్తర్వులు ఉన్నాయా?. అనే విషయంపై స్పష్టత ఇవ్వండి." అని ఏపీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. హాయ్‌ల్యాండ్‌కు తరలించిన జవాబు పత్రాలను ఏపీపీఎస్సీ కార్యాలయానికి తిరిగి ఎప్పుడు తీసుకొచ్చారనే వివరాలను కూడా తమ ముందు ఉంచాలని స్పష్టం చేసింది. హాయ్‌ల్యాండ్‌లో మొదటిసారి మాన్యువల్ మూల్యాంకనం జరిగిందని, దీనికోసం ఏపీపీఎస్సీ సొమ్ము చెల్లించిందని అభ్యర్థులు సదరు చెక్కు వివరాలతో సహా చెబుతున్న నేపథ్యంలో చెల్లింపులు ఏమైనా జరిగాయా?. దేని నిమిత్తం ఆ సొమ్ము చెల్లించారనే విషయంపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. 2022, జూన్ 24న హైకోర్టు డివిజనల్ బెంచ్ ఉత్తర్వులకు అనుగుణంగా అభ్యర్థుల జవాబు పత్రాలను సీల్డ్ కవర్‌లో ధర్మాసనం ముందు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నామని అడ్వొకేట్ జనరల్(ఏజీ) చెప్పిన వివరాలను నమోదు చేసింది. ధర్మాసనం అడిగిన ఇతర వివరాలు సమర్పించేందుకు ఏజీ సమయం కోరడంతో అప్పీళ్లపై తదుపరి విచారణను ఈ నెల 11కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

తీర్పు ప్రతి సిద్ధం చేస్తుండగా..

2018 నాటి నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని గతంలో హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం నిర్ధారించింది. ఈ నేపథ్యంలో 2022, మే 26న ఏపీపీఎస్సీ ఇచ్చిన అర్హుల జాబితాను హైకోర్టు సింగిల్ జడ్జి రద్దు చేశారు. మరోసారి పరీక్ష నిర్వహించి ఎంపిక ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశిస్తూ 2024, మార్చి 13న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ సహా ఉద్యోగాలు పొందిన వారు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. అలాగే తీర్పులోని కొంతభాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మరికొందరు అప్పీల్ వేశారు. ఈ అప్పీళ్లపై ఇటీవల తుది విచారణ జరిపిన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. అయితే, తీర్పు ప్రతి సిద్ధం చేస్తుండగా 2022, జూన్ 24న కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల అమలులో లోపాలను గుర్తించిన ధర్మాసనం.. వాటిని నివృత్తి చేసుకునేందుకు మరోసారి విచారణ చేపట్టింది. విచారణ ప్రారంభమైన వెంటనే ధర్మాసనం స్పందిస్తూ.. గ్రూప్-1 ప్రధాన పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు షెడ్యూల్ ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక ప్రక్రియను కొనసాగించేందుకు అనుమతిస్తూ 2022, జూన్ 24న డివిజన్ బెంచ్ పలు షరతులు విధించిందని గుర్తు చేసింది. "ఫలితాల ప్రకటన, పోస్టింగ్ ఆర్డర్స్ కోర్టు ఇచ్చే తుది తీర్పుకి లోబడి ఉంటాయని, ఈ విషయాన్ని పోస్టింగ్ ఆర్డర్స్‌లో ప్రస్తావించాలని, అలాగే కోర్టు ఇచ్చే తుది తీర్పుకి కట్టుబడి ఉంటామని, భవిష్యత్తులో చట్టబద్ధమైన హక్కు కోరబోమని పోస్టింగ్ తీసుకున్న అభ్యర్థుల నుంచి హామీపత్రం తీసుకోవాలని ఏపీపీఎస్సీని డివిజన్ బెంచ్ ఆదేశించింది. సింగిల్ జడ్జి వద్ద ఉన్న వ్యాజ్యాలలో ప్రతివాదులుగా చేరాలంటే ఎంపికైన అభ్యర్థులు చేరవచ్చని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఏపీపీఎస్సీకి స్పష్టం చేసింది. అవసరమైతే పరిశీలించేందుకు వీలుగా డిజిటల్ మూల్యాంకనంలో ఇంటర్వ్యూకు అర్హత సాధించిన అభ్యర్థుల జవాబు పత్రాలతో పాటు మాన్యువల్ విధానంలో వారు సాధించిన మార్కుల వివరాలు, అలాగే మాన్యువల్ మూల్యాంకనం ద్వారా ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల జవాబు పత్రాలను సీల్డ్ కవర్‌లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అందజేయాలని ఏపీపీఎస్సీని ఆదేశించింది. ఈ ఆదేశాలు అమలు చేశారా?." అని ఏపీపీఎస్సీని ప్రశ్నించింది. డిజిటల్ మూల్యాంకనం జరిపినప్పుడు జబాబుపత్రాలకు ఉన్న ఓఎంఆర్ షీట్లు, బార్‌కోడ్‌లు వినియోగించలేదని అభ్యర్థులు చెబుతున్న నేపథ్యంలో జవాబు పత్రాలకు అవి జత చేసి ఉన్నాయా? అనే విషయాన్ని పరిశీలించాల్సి ఉందని పేర్కొంది.

హామీ పత్రాలు తీసుకున్నాం: ఏజీ

ఏపీపీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ బదులిస్తూ.. "డివిజన్ బెంచ్ ఉత్తర్వులకు అనుగుణంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల నుంచి హామీపత్రం తీసుకున్నాం. ఏకసభ్య ధర్మాసనం వద్ద ఉన్న వ్యాజ్యాలలో ఇంప్లీడ్ అవుతామని కూడా ఎంపికైన అభ్యర్థులు హామీ ఇచ్చారు. అభ్యర్థుల జవాబుపత్రాలు, మార్కుల వివరాలను సీల్డ్ కవర్‌లో రిజిస్ట్రార్(జ్యుడీషియల్) వద్ద ఉంచలేదు. రిట్ అప్పీళ్ల తుది విచారణ సందర్భంగా వాటిని కోర్టు ముందు ఉంచితే సరిపోతుందని ఏపీపీఎస్సీ తరఫున అప్పటి సీనియర్ న్యాయవాది సలహా ఇచ్చినట్లు తెలిసింది. ఈ నెల 5 నాటికి జవాబు పత్రాలను సీల్డ్ కవర్‌లో కోర్టు ముందు ఉంచుతాం. హాయ్‌ల్యాండ్‌లో మాన్యువల్ మూల్యాంకనం జరిపారు. దీనికిగాను సొమ్ము చెల్లించారని పిటిషనర్లు చేస్తున్న ఆరోపణలకు సంబంధించిన బిల్లులు అందుబాటులో ఉంటే, వాటిని కూడా కోర్టు ముందు ఉంచుతాం. దీనికి కొంత సమయం కావాలి." అని ఏజీ అభ్యర్థించారు.

కూచిపూడి, ఏటికొప్పాక గ్రామాలకు మహర్దశ!

» ఆర్‌జీఎస్‌ఏ ఆధ్వర్యంలో ఆదాయ పెంపు ప్రాజెక్టులు మంజూరు

» అరకులోనూ ఐకానిక్ వెదురు క్యాంపస్ ఏర్పాటుకు అనుమతి



అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ యోజన(ఆర్‌జీఎస్‌ఏ) పథకం ద్వారా రాష్ట్రంలోని హెరిటేజ్ గ్రామాలైన కూచిపూడి, ఏటికొప్పాకతోపాటు అరకులోనూ ఆదాయ పెంపు ప్రాజెక్టులను మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆర్‌జీఎస్‌ఏ ద్వారా వినూత్నమైన ఆదాయ వనరుల పథకాలను గ్రామాల్లో అమలు చేసేందుకు ప్రతిపాదనలు కోరింది. మన రాష్ట్రం నుంచి ప్రతిపాదించిన నాలుగు ప్రాజెక్టుల అమలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అరకులో రూ.5 కోట్లతో క్యాంపింగ్ అండ్ కార్వాన్ గ్రామాలు, వెదురుతో ఐకానిక్ నిర్మాణాలు చేపట్టే ప్రతిపాదనలను కేంద్రం అంగీకరించింది. కూచిపూడిలో సంస్కృతిని పరిరక్షించేందుకు, స్థానికులకు సుస్థిరమైన జీవనోపాధులు కల్పించేందుకు, అక్కడ మౌలిక వసతులను కల్పించడంతోపాటు స్వయం సహాయక సంఘాలు, యువత, స్థానిక కళాకారుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు రూ.3 కోట్లు ఖర్చు చేయనున్నారు. బొమ్మలకు ప్రసిద్ధి గాంచిన ఏటికొప్పాక గ్రామంలో సంప్రదాయమైన బొమ్మల తయారీని ప్రోత్సహిస్తారు. వారికి మార్కెట్ సౌకర్యంతోపాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించేందుకు మరో రూ.3 కోట్లు ఖర్చు చేసేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మూడు ప్రాజెక్టుల అమలు బాధ్యతలను ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థకు అప్పగిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతోపాటు గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం 60 లక్షల కుటుంబాల్లో పరివర్తన తెచ్చేందుకు ప్రచారం నిమిత్తం 6 వేల మంది కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ)లను నియమించుకునేందుకు ప్రతిపాదించగా, 5.5 వేలమందిని నియమించుకునేందుకు కేంద్రం రూ.5.50 కోట్లు మంజూరుచేసింది. ఈ ప్రాజెక్టును పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిర్వహించనుంది.

బీసీలకు వెన్నుదన్నుగా ఆదరణ 3.0

» మంత్రి సవిత

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'ఆదరణ 3.0' బీసీలకు వెన్నుదన్నుగా నిలవనుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. సోమవారం గొల్లపూడి బీసీ సంక్షేమ భవన్‌లో బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, కుల సంఘాల డైరెక్టర్లతో ఆదరణ 3.0 పథకం అమలుపై మూడు రోజుల వర్క్‌షాపును మంత్రి ప్రారంభించారు. ఆదరణ 3.0 పథకానికి రూ.1000 కోట్ల బడ్జెట్‌లో కేటాయించామన్నారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా.. ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు బడ్జెట్‌లో అత్యధికంగా నిధులు కేటాయించారన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఎక్కువగా లబ్ధి పొందింది బీసీలేనని, మెగా డీఎస్సీలో బీసీ వర్గాలకు చెందిన వారే ఎక్కువగా ఎంపికయ్యారని మంత్రి గుర్తు చేశారు.

24 గంటల్లోనే రైతులకు నగదు: మంత్రి నాదెండ్ల

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు వేల కొనుగోలు కేంద్రాల ద్వారా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, పక్కన రేణు చెల్లు, కె.రవి

ప్రభుత్వ ఆధీనంలోనే విశాఖ ఉక్కు!

» ప్రజల సెంటిమెంటును గౌరవించికొనసాగిస్తున్నాం

» వచ్చే నెలలో నక్కపల్లిలో మిట్టల్ స్టీల్‌కు శంకుస్థాపన

» కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ వెల్లడి

» తాళ్లపాలెంలో నాగార్జున సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ప్రారంభం

కశింకోట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వ్యవస్థలో పరిశ్రమలు చాలా కీలకమని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. సోమవారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద నాగార్జున సిమెంటు గ్రైండింగ్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల సెంటిమెంటును గౌరవించి విశాఖ స్టీల్‌ప్లాంటును ప్రైవేటు పరం చేయకుండా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగిస్తున్నామన్నారు. ఉక్కు కర్మాగారాన్ని గాడిలో పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.11,440 కోట్ల ప్యాకేజీ అందించిందని చెప్పారు. అలాగే, నక్కపల్లిలో మిట్టల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు డిసెంబరులో భూమిపూజ చేయనున్నట్టు తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో ప్రపంచస్థాయి సమ్మిట్ జరగనుందని చెప్పారు.

వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసింది..

నాగార్జున సిమెంటు గ్రైండింగ్ యూనిట్ చైర్‌పర్సన్ రేణు చెల్లు, వైస్ చైర్మన్ కె.రవి మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఏర్పాటుకు గత వైసీపీ ప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. అందువల్లే ప్రారంభం ఆలస్యమైందని చెప్పారు.

రాష్ట్రంలో వాతావరణ అనిశ్చితి

» పెరిగిన ఉష్ణోగ్రతలు.. నేడు కోస్తా, సీమల్లో వర్షాలు

» మయన్మార్‌లో స్థిరంగా అల్పపీడనం

అమరావతి, విశాఖపట్నం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనిశ్చిత వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో మంగళవారం కోస్తా, రాయలసీమలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ముఖ్యంగా కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. సోమవారం అనకాపల్లి జిల్లా గంధవరంలో 54, బుచ్చెయ్యపేటలో 29.75, రాజాంలో 28.5 మి.మీ.వర్షపాతం నమోదైంది.

పెరిగిన ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు బలహీనంగా ఉన్నాయి. సముద్రం నుంచి తేమగాలులు భూ ఉపరితలంపైకి రావడం లేదు. ఇంకా ఆకాశం నిర్మలంగా మారడంతో పగటిపూట ఎండతీవ్రత పెరిగి వేడి వాతావరణం నెలకొంది. సోమవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. నెల్లూరులో 36.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

అండమాన్‌లో అప్రమత్తం

తూర్పు మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని మయన్మార్ తీరంలో అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. ఇది ఉత్తర వాయవ్యంగా పయనించి మంగళవారానికి మయన్మార్, బంగ్లాదేశ్ తీరాల వైపు వెళ్లనుందని విశాఖ వాతావరణ శాఖ తెలిపింది. ఈ క్రమంలో అల్పపీడనం బలపడుతుందని, దీంతో అండమాన్ దీవుల్లో సముద్రం అల్లకల్లోలంగా మారి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో అండమాన్‌లో అధికారులను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు.

అమ్మో.. ఎంత ఎత్తో!

» తిరుమలలో శ్రీలంక మహిళను ఆసక్తిగా చూసిన భక్తులు



తిరుమల ఆలయం ముందు థర్షినీ శివలింగం

శ్రీలంక జాతీయ నెట్ బాల్ క్రీడాకారిణి, మాజీ కెప్టెన్ థర్షినీ శివలింగం సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. క్యూలైన్‌లోనూ, ఆలయంలోనూ, బయటా ఆమె నడుస్తూ ఉంటే అందరూ ఆశ్చర్యంగా తలలు పైకెత్తి చూశారు. అందుకు కారణం ఆమె దాదాపు ఏడు అడుగుల పొడవు (6 అడుగుల 10.5 అంగుళాలు) ఉండటమే. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు కొందరు పోటీపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో జస్టిస్ జ్యోతిర్మయి



తిరుమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్న ఆమెకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు

» బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ పాలకవర్గం తీర్మానం

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణ పొందిన మహిళలందరికీ ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ పాలకవర్గం తీర్మానించింది. సోమవారం తాడేపల్లిలోని బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ 138వ బోర్డు సమావేశం చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఆదరణ పథకం, సబ్సిడీపై రుణాలు, బీసీ హాస్టళ్లలో వాటర్ ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటుతో పాటు కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేసేందుకు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. అంతకుముందు బీసీ సంక్షేమశాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి సత్యనారాయణ నూతన బోర్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

దివ్యాంగులకు ఉచిత త్రీవీలర్ బైక్‌లు

» 25లోగా దరఖాస్తులు: మంత్రి డోలా

దివ్యాంగుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగా రాష్ట్రంలోని దివ్యాంగులకు ఉచితంగా 1750 రెట్రోఫిటెడ్ త్రీవీలర్ మోటార్ సైకిళ్లు అందజేయనున్నట్లు దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 25 తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిని వివరాలకు www.apdascac. ap.gov.in వెబ్‌సైట్‌ని సంప్రదించాలని కోరారు.

ఫిషరీష్ వర్సిటీ క్యాంప్ ఆఫీస్ మార్పు

విజయవాడ తాడిగడపలోని ఏపీ ఫిషరీష్ యూనివర్సిటీ క్యాంప్ ఆఫీస్‌ను ఎనికేపాడులోని ఏపీబీటీ గ్లోబల్ టవర్స్‌లోకి తరలించేందుకు ప్రభుత్వం అనుమతిస్తూ సోమవారం ఉత్తర్వుఉ జారీ చేసింది. జీఎస్టీతో కలిపి, చదరపు అడుగుకు రూ.30 చొప్పున ఏపీబీటీ గ్లోబల్ టవర్స్‌లోని 3,273చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఫ్లాట్‌లోకి మార్చేందుకు ఆమోదం తెలిపింది.

ఐటీడీఏల్లో పాల ఉత్పత్తి ప్రాజెక్టులకు నిధులు మంజూరు

గిరిజన ప్రాంతాల్లో ఎస్టీ కాంపోనెంట్ నిధులతో మంజూరైన 76 పశువుల హాస్టళ్లకు నిధులు మంజూరుచేస్తూ గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2019-20 సంవత్సరంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ పాల అభివృద్ధి ప్రాజెక్టు కోసం ప్రత్యేక కేంద్ర సాయం గిరిజన సబ్‌స్కీం కింద సీతంపేట, పార్వతీపురం, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో పశువుల హాస్టళ్లను మంజూరుచేసింది.

మహిళలను కించపర్చడమే వైసీపీ పని: కావలి గ్రీష్మ

మహిళలను అవమానించడం, కించపరిచేలా మాట్లాడటమే వైసీపీ నాయకులు పనిగా పెట్టుకున్నారని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆస్తి కోసం కన్న తల్లిని, చెల్లిని ఇంట్లో నుంచి తరిమేసిన వ్యక్తి జగన్ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఏ విపత్తు వచ్చినా.. అమ్మలా స్పందించే వ్యక్తి నారా భువనేశ్వరి అని, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. అలాంటి ఆమెపై నెల్లూరులో వరస్ట్ రాజకీయ నాయకుడు ప్రసన్నకుమార్ రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం బాధాకరమన్నారు. టీడీపీ నాయకుల గురించి, మహిళల గురించి వైసీపీ నాయకులు నోరుజారి మాట్లాడితే తాట తీస్తామని హెచ్చరించారు. జగన్ వెంటనే ప్రసన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, భువనేశ్వరికి ప్రసన్న క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

క్రికెట్‌లో కొత్త అధ్యాయం

నలభై రెండు సంవత్సరాల క్రితం చరిత్రాత్మక లార్డ్స్ మైదానంలో చోటు చేసుకున్న మహాద్భుతం యావత్ భారత క్రికెట్ రంగం స్థితిగతులనే మార్చివేసింది. 1983 ప్రపంచ కప్ పోటీల్లో అనామక జట్టుగా అడుగుపెట్టిన కపిల్ దేవ్ సారథ్యంలోని టీమిండియా అంతిమ సమరంలో దిగ్గజ ఆటగాళ్లున్న వెస్టిండీస్ జట్టును ఓడించి విశ్వవిజేతగా అవతరించింది. మహిళల క్రికెట్‌లోనూ ఇలాంటి మరపురాని ఘట్టం కోసం ఎదురుచూసిన భారతీయుల స్వప్నం ఇప్పుడు సాకారమైంది. క్రీడా మైదానంలో మన అమ్మాయిలు విజయనాదం చేశారు. నాలుగు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ మహిళల వన్డే ప్రపంచకప్‌లో చాంపియన్లుగా నిలిచారు. ఈ విజయం భారత మహిళా క్రికెట్‌లో ఒక గొప్ప అధ్యాయానికి నాంది కానున్నది.

వన్డే ప్రపంచ కప్‌లో గతంలో రెండు పర్యాయాలు తుది మెట్టుపై పరాజితులుగా మిగిలి వేదనను అనుభవించిన భారత మహిళల జట్టు మూడో ప్రయత్నంలో ఫలితాన్ని రాబట్టి అందరి కళ్లల్లోనూ ఆనందాన్ని నింపింది. ఈసారి జగజ్జేతగా నిలవడంలో సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు జట్టులోని సభ్యులంతా తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించారు. గ్రూప్ దశ పోటీల్లో బ్యాట్‌తో స్మృతీ మంధాన, ప్రతీకా రావల్, అమన్‌జోత్, రిచా ఘోష్, బంతితో దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, రేణుకా సింగ్ అదరగొట్టారు. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో జెమీమా రోడ్రిగ్స్ ఛేదనలో వీరోచిత సెంచరీతో ఆకట్టుకుంటే, అసలైన తుదిపోరులో దక్షిణాఫ్రికాపై షఫాలీ వర్మ సూపర్ ఇన్నింగ్స్, ఆల్‌రౌండర్‌గా దీప్తి శర్మ ప్రతిభ భారత్‌ను విశ్వవిజేతగా నిలబెట్టాయి. జట్టు విజయంలో కడప జిల్లాకు చెందిన బౌలర్ శ్రీచరణి రాణించడం తెలుగువారు గర్వించదగ్గ విశేషం. ఇంతటి అద్భుత ప్రదర్శన కనబరచిన జట్టు సభ్యుల్లో చాలామంది దిగువ మధ్యతరగతి స్థాయి నుంచి వచ్చినవారే. గ్రామీణ నేపథ్యం నుంచి కెప్టెన్ స్థాయికి ఎదిగిన హర్మన్‌ప్రీత్, కార్పెంటర్ అయిన తండ్రి చెక్కిన బ్యాట్‌తో కెరీర్ మొదలుపెట్టిన అమన్ జోత్, మూడేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయి, ఆర్థిక కష్టాలు ఎదుర్కొన్న రేణుక, పోలీస్ కానిస్టేబుల్ కూతురు క్రాంతి గౌడ్...వారిలో కొందరు మాత్రమే. భారతీయుల ప్రపంచ కప్ కలను సాకారం చేసిన టీమిండియా క్రీడాకారిణుల వెనుక ఇలాంటి త్యాగాలు, పోరాటాలు, కన్నీళ్లకు కొదవే లేదు. ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా పట్టుదలతో జట్టుకోసం శ్రమించి ప్రపంచ క్రికెట్‌లో భారత జట్టును నిలబెట్టిన మన అమ్మాయిల ఆట ప్రశంసనీయం.


గతంలో సరైన ఆదరణకు నోచుకోని మహిళా క్రికెట్‌ను బీసీసీఐ తన చేతుల్లోకి తీసుకున్నాక వసతులు, పారితోషికాలు మెరుగయ్యాయి. పురుషుల, మహిళల జట్ల మధ్య వేతన సమానత్వాన్ని బీసీసీఐ ప్రవేశ పెట్టడం మహిళా క్రికెట్‌లో ఓ ముందడుగు. పురుషుల ఇండియన్ ప్రీమియర్ లీగ్ తరహాలో మహిళల ప్రీమియర్ లీగ్‌ను ప్రవేశపెట్టింది. ప్రతిభావంతులైన యువ క్రికెటర్లను వెలుగులోకి తీసుకొచ్చి వారు ఆర్థికంగా కుదురుకునేలా చేసింది. ఈ క్రమంలోనే మిథాలీ రాజ్, జులన్ గోస్వామి లాంటి సీనియర్ల ప్రేరణతో నవతరం క్రీడాకారిణులు సత్తా చాటుతుండడంతో అమ్మాయిల క్రికెట్‌కు అభిమానులూ పెరిగారు. వారి మ్యాచ్‌లు వీక్షించేందుకు స్టేడియాలకు ప్రేక్షకులు పోటెత్తారు. ఈ ఉత్సాహంతో మన క్రికెటర్లు మరింత శ్రమించి ఐసీసీ ఈవెంట్లలో మెరుగైన ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వరుసగా రెండుసార్లు అండర్-19 జట్టు ప్రపంచ కప్పు నెగ్గడం, ఇప్పుడు సీనియర్ జట్టు ప్రపంచ చాంపియన్‌షిప్‌తో క్రికెట్‌లో ఆధిపత్యాన్ని చాటుకోవడం.. మహిళల క్రికెట్‌లో భారత్ ఉజ్వల భవితకు తార్కాణాలు.

ప్రోత్సాహం ఉండాలే కానీ, అద్భుతమైన విజయాలు అందించగలమని కొన్నాళ్లుగా మన అమ్మాయిలు నిరూపిస్తున్నారు. ఇటీవల జరిగిన ఖో ఖో ప్రపంచ కప్‌లో పురుషులతో పాటు భారత మహిళల జట్టు విజేతగా నిలిచింది. నిరుడు పారిస్ ఒలింపిక్స్‌లో షూటర్ మనూ భాకర్ రెండు పతకాలతో విశ్వవేదికపై సత్తా చాటింది. లండన్ విశ్వక్రీడల్లో బాక్సింగ్ దిగ్గజం మేరీ కోమ్ కాంస్యం, టోక్యోలో వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను రజతం, బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ కాంస్యం, బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు వరుస ఒలింపిక్స్‌ల్లో రజత, కాంస్య పతకాలు, ప్రపంచ చెస్ యవనికపై కోనేరు హంపి, దివ్యా దేశ్‌ముఖ్, వైశాలి మెరుపులు.. ఇలా, ఆట ఏదైనా విశ్వ క్రీడావనిలో తమదైన ప్రతిభాప్రదర్శనతో అబ్బురపరుస్తుండడం భారత నారీ శక్తి ప్రభంజనానికి నిదర్శనం. ఆధునిక మహిళ చరిత్రను పునర్లిఖిస్తుందని గురజాడ అన్నారు. మహిళాక్రికెటర్లు క్రికెట్‌క్రీడ భావిచరిత్రను నిర్ణయాత్మకంగా తీర్చిదిద్దుతారని ఆశించడంలో తప్పులేదు.

జొహ్రాన్.. మీరా.. మమ్దానీ.. సంస్కృతీ మథనం!

"సంస్కృతి అనే పదాన్ని నేను విన్నప్పుడు నా పిస్టల్‌ను పేల్చటానికి సిద్ధంచేస్తాను" ఒక నాజీ రచయిత రాసిన నాటకంలో ఒక సైనికుడు అన్న మాటలవి. 1930ల నాటి జర్మనీలో నెలకొంటున్న పరిస్థితులను ఆ మాటలు కళ్లకుకడతాయి. సంస్కృతి అంటే సంప్రదాయాలూ, విశ్వాసాలూ అలవాట్లూ, పండుగలూ, నోములూ, ధర్మాధర్మ ఆలోచనలూ, ఇహలోక-పరలోక చింతనలుగా ఆ రచయిత భావించలేదు. అసలు అట్లాంటి సంస్కృతితో నాజీలకు ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ 1930ల నాటికి సంస్కృతికి ఆ అర్థం మారింది. పరిధి విస్తృతమైంది. భిన్న భావాలు సంఘర్షించే క్షేత్రంగా, హేతుబద్ధ ఆలోచనలకు వేదికగా, ప్రజాస్వామ్య చింతనకు కేంద్రంగా, సమానత్వ భావనకు స్ఫూర్తినిచ్చే ఇంధనంగా సంస్కృతి ఉండాలనే భావన ఆలోచనాపరుల్లో అప్పటికే బలపడింది. అట్లాంటి సంస్కృతి గురించి మాట్లాడినా, కోరుకున్నా వేళ్ల పిస్టల్ ట్రిగ్గర్ మీదకు వెళ్లే విధంగా నాజీలు పాలించారు.

ఇప్పుడు అటువంటి భయానక పరిస్థితుల్లేవు. కానీ వాటి ఛాయలూ, ధోరణులూ చాలా చోట్ల కనపడుతున్నాయి. భావప్రకటనా స్వేచ్ఛకు తిరుగులేదనుకునే అమెరికా కూడా వీటి ప్రభావానికి లోనవుతోంది. విశ్వవిద్యాలయాల్లో భావాలపై నిఘాలు పెరుగుతున్నాయి. సోషల్‌మీడియాలో భిన్నాభిప్రాయాలు ప్రకటించే వారి జాబితాలు తయారవుతున్నాయి. ఇజ్రాయెల్ విమర్శకులకు విద్యాలయాల్లో సీట్లు ఇవ్వకూడదనే ఆదేశాలు వెలువడుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకతను కట్టడిచేయలేని విద్యాసంస్థలకు నిధులు నిలిపేసే చర్యలూ మొదలయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంకాస్త ముందుకు వెళ్లి తనతో తీవ్రంగా విభేదించే వారందరినీ వామపక్షవాద పిచ్చివాళ్లుగా ముద్ర వేస్తున్నారు. న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లో డెమొక్రాటిక్ అభ్యర్థిగా పోటీచేస్తున్న భారత సంతతికి చెందిన జొహ్రాన్ మమ్దానీకీ ఈ శాపనార్థాలు తప్పలేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో 34 ఏళ్ల జొహ్రాన్ న్యూయార్క్ ఎన్నికల్లో గెలిస్తే అమెరికాలో అదొక మేలిమలుపు అవుతుంది! మరికొన్ని గంటల్లో అక్కడ పోలింగ్ మొదలవుతుంది. ఫలితం ఎలా ఉన్నా జొహ్రాన్ మాత్రం ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా ఎదురొడ్డి నిలబడ్డారు. తమ శ్రమతో, నైపుణ్యంతో, ఆలోచనలతో అమెరికా గడ్డను సుసంపన్నంచేసే వారందరికీ సమానావకాశాలు ఉండాలనీ, సమానహక్కులు దక్కాలనీ, సంపద వికేంద్రీకరణ జరగాలన్న వాదనతో ప్రచారం చేశారు. డెమొక్రాటిక్ సోషలిస్టుగా చెప్పుకొనే జొహ్రాన్ ఎన్నడూ తన భావాలనూ దాచుకోలేదు. బహుశా తల్లిదండ్రుల ప్రభావం జొహ్రాన్ మీద గాఢంగా ఉండివుండొచ్చు.



> రాజకీయ ప్రమేయాలూ ప్రసక్తీ లేకుండా ఒక మతమంతా, ఒక సంస్కృతి అంతా నిరంకుశానికి అనుకూలమనీ, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమనీ, ఆధునిక జీవితానికి అడ్డంకి అనీ సూత్రీకరణలు చేయటం నిర్హేతుకం. సంస్కృతుల మధ్య సంఘర్షణగా రాజకీయాలనూ, రాజ్యవ్యవస్థలనూ చూడటం అవివేకం అవుతుంది. సంస్కృతిని జడపదార్థంగా పరిగణించటమూ, అవసరాలకు అనుగుణంగా మారలేని అశక్తతలోకి ఒక మతం కూరుకుపోయిందని భావించటమూ మనుషుల మధ్యా, సమూహాల మధ్యా పూడ్చలేని అగాధాన్నే సృష్టిస్తుంది. అదే ఈనాటి అసలైన ముప్పు.

ప్రముఖ దర్శకురాలు మీరానాయర్, ప్రొఫెసర్ మహమూద్ మమ్దానీ.. జొహ్రాన్‌కు తల్లిదండ్రులు. సలాంబాంబే, మిసిసిపి మసాలా, కామసూత్ర, మాన్‌సూన్ వెడ్డింగ్ లాంటి సినిమాలకు మీరా దర్శకత్వం వహించారు. భారతీయ సినిమాకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకుని రావటంలో మీరా పాత్రను విస్మరించలేం. మనల్ని మానవసంబంధాల లోతుల్లోకి తీసుకువెళ్లటమే కాదు.. భిన్న సంస్కృతుల కలయికనూ, దుర్భర పరిస్థితుల్లోనూ మనుషుల్లో తన్నుకుని వచ్చే ఆత్మస్థైర్యాన్నీ, సంప్రదాయ, పాశ్చాత్య ప్రభావాల పరస్పర రాపిడిలో ఎదురయ్యే జీవన సంఘర్షణలనూ మీరా నాయర్ అద్భుతంగా చిత్రీకరించారు. మనుషుల జీవితాల్లోని వ్యక్తావ్యక్త అంశాలపై, అనుభూతులపై, ఆకాంక్షలపై, ఆరాటాలపై, అమానవీయాలపై, అసాంఘిక ప్రవృత్తులపై, పతభ్రష్టత్వాలపై ఎంతోకొంత వెలుతురు ప్రసరింపచేసి, మనలో సహానుభూతినీ, సానుభూతినీ, విశాలతనూ, విచారాన్నీ, అంతర్గత మథనాన్నీ పెంచటమే కళ పరమార్థం అనుకుంటే దానికి మీరానాయర్ ఖచ్చితంగా తోడ్పడ్డారు.

ఇక మహమూద్ మమ్దానీ అయితే మనం ప్రపంచ రాజకీయాలను చూసే తీరుని మార్చివేయటంలో కీలక పాత్రను పోషించారు. బిన్‌లాడెన్ నేతృత్వంలోని ఇస్లామిక్ తీవ్రవాదులు న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ భవనాలను విమానాలతో ఢీకొట్టించి (11-09-2001) వేలమందిని చంపివేసిన తర్వాత.. అమెరికా నుంచి ఆరంభమైన ఉధృత ప్రచారం సంస్కృతులూ, మతాల మధ్య అసంబద్ధ చీలికను తెచ్చింది. ఇస్లాం సంస్కృతిలోనే తీవ్రవాదాన్నీ, నిరంకుశత్వాన్నీ పెంచిపోషించే తత్వం ఉందనీ.. ఆధునిక జీవనాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ పరిరక్షించుకోటానికి ఆ సంస్కృతితో యుద్ధంచేయక తప్పదనే భావాలకు విపరీత ప్రాచుర్యం లభిస్తున్న నేపథ్యంలో మహమూద్ మమ్దానీ 2005లో ప్రభావవంతమైన పుస్తకాన్ని రాశారు. దాని పేరు మంచి ముస్లిం-చెడ్డ ముస్లిం (గుడ్ ముస్లిం, బ్యాడ్ ముస్లిం). ఆ పుస్తకం కలగచేసిన ప్రభావం అంతా ఇంతా కాదు. అమెరికా ప్రయోజనాలను సమర్థించే వారిని మంచి ముస్లింలుగానూ, వ్యతిరేకించే వారందరినీ చెడ్డ ముస్లింలు గానూ వర్గీకరించటంలో ఉన్న ప్రమాదాన్ని ఎత్తిచూపటంతో పాటు అసలు ఇస్లామిక్ టెర్రరిజాన్ని పాలుపోసి పెంచింది అమెరికానేనని గట్టి ఆధారాలతో మమ్దానీ విశ్లేషించారు.



■ రాహుల్ కుమార్

మనిషిలోని బలహీనతలను అధిగమించి అధ్యాత్మిక ఔన్నత్యాన్ని సాధించటానికి నిరంతర పోరాటం చేయాలని చెప్పే జిహాద్ మూల భావనను పెద్ద ఎత్తున రాజకీయాలకు అన్వయించి, రాజకీయ లక్ష్యాల సాధనకు ఉపయోగించటం ప్రచ్ఛన్నయుద్ధకాలంలో (కోల్డ్‌వార్) మొదలైందనీ, అందుకు కావాల్సిన సాధన సంపత్తిని సమకూర్చటంతోపాటు, అవసరమైన ప్రచారమూ అమెరికా సారథ్యంలోనే సాగిందనీ మమ్దానీ వివరించారు. ఏ దేశంలోనైనా ప్రభుత్వానికి కమ్యూనిజం పట్ల ఎంతో కొంత అనుకూలత ఉందన్న నిర్ధారణకు అమెరికాకు వస్తే.. అక్కడ సోవియట్ రష్యా ప్రభావం పెరిగే ప్రమాదం ఉందని అనిపిస్తే మతవాద శక్తులనూ, తెగల మధ్య ఉండే విభేదాలనూ రెచ్చగొట్టటం అనేక సందర్భాల్లో జరిగింది. లక్షల మంది ఆ చర్యలకు బలి అయ్యారు. వియత్నాం యుద్ధంలో (1975) అమెరికా ఓడిపోయిన తర్వాత ఆఫ్రికా, అమెరికా, ఆసియా ఖండాల్లో సాగించిన పరోక్ష యుద్ధాల్లో మతాన్నీ, తెగలనూ ఉసిగొల్పటం ఒక విధానంలా సాగింది. ఇరాన్‌లో 1953లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని సీఐఏ కూలగొట్టింది. ఈజిప్టు, సిరియా, ఇరాక్, అల్జీరియాల్లో లౌకిక, జాతీయవాద, సోషలిస్టు శక్తులు 1950-60ల్లో బలంగా ఉండేవి. వాటిని బలహీనపర్చటానికి ఇస్లామిక్ ఛాందస వర్గాలకు చేదోడుగా నిలిచింది. 1979లో ఇరాన్‌లో వచ్చిన విప్లవంతో నిర్ఘాంతపోయిన అమెరికా షియాల నుంచి సున్నీలకు ప్రమాదం ఉందనే ప్రచారాన్ని చాపకింద నీరులా వ్యాపింపచేసింది. నియంతృత్వ, వంశపారంపర్య ప్రభుత్వాలున్న సున్నీ దేశాల్లో ఇరాన్ విప్లవాన్ని బూచీగా చూపించి మతశక్తులు బలోపేతం కావటానికి తోడ్పడింది. ఇక ఆఫ్ఘనిస్తాన్‌లో రష్యా సేనల ప్రవేశంతో ఇస్లాం ప్రమాదంలో పడిందన్న నినాదంతో 'పవిత్రయుద్ధం' కోసమంటూ 40 ముస్లిందేశాల నుంచి దాదాపుగా లక్ష మందికి పైగా ముజాహిద్‌లను సమీకరించింది. వందల సంఖ్యలో మదర్సాలు ఏర్పాటు చేసింది. ప్రజాస్వామ్య స్థాపన నినాదంతో, బహుళపార్టీ రాజకీయ వ్యవస్థ ఏర్పాటు లక్ష్యంతో జనాలను సమీకరించటం అమెరికాకు ఇష్టంలేదు. అలాంటి భావజాలం బలపడితే ముస్లిందేశాల్లో తిరుగుబాట్లు వస్తాయి. ప్రజాప్రాతినిధ్యంలేని సర్కార్లు కూలిపోతాయి. అమెరికా ఆధిపత్యానికి సవాళ్లు ఎదురవుతాయి. అందుకే తన రాజకీయ లక్ష్యాల కోసం మతశక్తులనూ సంకుచిత ప్రయోజనాలను కాంక్షించే తెగలనూ ప్రోత్సహించింది. మత్తుపదార్థాల కారిడార్లను ఏర్పరిచి టెర్రరిస్టు కార్యకలాపాల కోసం సీఐఏ నిధులు ఎలా సమీకరించిదన్న సమాచారాన్ని కూడా మమ్దానీ ఉదాహరణలతో పేర్కొన్నారు. 1985లో ముజాహిద్‌లలో కొందరిని ఏకంగా శ్వేతసౌధానికి ఆహ్వానించారు. అప్పటి అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్‌రీగన్ చేసిన వ్యాఖ్యలను చూస్తే ముజాహిదీన్ పట్ల ఎలాంటి అభిప్రాయం ఉండేదో స్పష్టంగా తెలుస్తుంది. అమెరికా రాజ్య స్థాపక పితామహులకు ఉన్న నైతిక ఔన్నత్యం ముజాహిద్‌లకు ఉందని రీగన్ వ్యాఖ్యానించారు. ఆఫ్ఘనిస్తాన్‌లో రష్యా వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహించాల్సిందిగా మొదట సౌదీ పాలక కుటుంబాన్నే అమెరికా కోరింది. దాన్ని తిరస్కరించినప్పటికీ సౌదీ పాలకులూ సీఐఏ కలిసి సంయుక్తంగానే బిన్‌లాడెన్‌ను ఆఫ్ఘన్ పోరాటానికి ఎంపిక చేశాయి. మరోవైపు ముజాహిదీన్ శిక్షణా కేంద్రంగా మారిన పాకిస్తాన్‌లో ఐఎస్ఐ ఆధిపత్యం ప్రభుత్వంపై పెరిగిపోయింది. మతశక్తుల పట్టు పాక్ సమాజంపై ఎక్కువైంది. ఆఫ్ఘనిస్తాన్‌లో విజయం సాధించిన ముజాహిద్‌లు కశ్మీర్‌లో కూడా దాన్ని పునరావృతం చేయగలమన్న భరోసాతో అక్కడా కార్యకలాపాలను మొదలుపెట్టారు. 40దేశాల నుంచి ఆఫ్ఘాన్‌కు వచ్చిన ముజాహిద్‌లు తిరిగి తమ దేశాలకు వెళ్లి అలజడులు ఆరంభించారు. ఆయుధాలను ఇచ్చి, సంకుచితత్వంలో తర్ఫీదులిచ్చి, పవిత్రయుద్ధాలకు డాలర్లను పంచి.. ఆ తర్వాత అమెరికా చేతులు దులుపుకున్నా తీవ్రవాదం హఠాత్తుగా మాయమైపోలేదు. 1990ల తర్వాత జరిగిన పరిణామాలన్నీ దాన్నే చాటిచెబుతున్నాయి. తాను సృష్టించిన శక్తులే తనమాట వినని పరిస్థితి అమెరికాకు వచ్చింది. విధ్వంసక శక్తిగా లాడెన్ మారటమే అందుకు నిదర్శనం.

> ఇప్పుడున్న పరిస్థితుల్లో 34 ఏళ్ల జొహ్రాన్ న్యూయార్క్ ఎన్నికల్లో గెలిస్తే అమెరికాలో అదొక మేలిమలుపు అవుతుంది! మరికొన్ని గంటల్లో అక్కడ పోలింగ్ మొదలవుతుంది. ఫలితం ఎలా ఉన్నా జొహ్రాన్ మాత్రం ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా ఎదురొడ్డి నిలబడ్డారు.

ఇస్లాంప్రేరిత మతతత్వాన్ని నరనరాన ఎక్కించటం వెనుక రాజకీయం ఉంది. ఆధిపత్యాన్ని నిలుపుకోవాలన్న వ్యూహం ఉంది. ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలను పడగొట్టటం వెనుకా, లౌకిక లక్ష్యాలున్న రాజకీయ పార్టీలను బలహీనపరచటం వెనుకా సుదీర్ఘ చరిత్ర ఉంది. అందుకే రాజకీయ ప్రమేయాలూ ప్రసక్తీ లేకుండా ఒక మతమంతా, ఒక సంస్కృతి అంతా నిరంకుశానికి అనుకూలమనీ, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమనీ, ఆధునిక జీవితానికి అడ్డంకి అనీ సూత్రీకరణలు చేయటం నిర్హేతుకం. సంస్కృతుల మధ్య సంఘర్షణగా రాజకీయాలనూ, రాజ్యవ్యవస్థలనూ చూడటం అవివేకం అవుతుంది. సంస్కృతిని జడపదార్థంగా పరిగణించటమూ, అవసరాలకు అనుగుణంగా మారలేని అశక్తతలోకి ఒక మతం కూరుకుపోయిందని భావించటమూ మనుషుల మధ్యా సమూహాల మధ్యా పూడ్చలేని అగాధాన్నే సృష్టిస్తుంది. అదే ఈనాటి అసలైన ముప్పు. 2005లో మమ్దానీ చేసిన హెచ్చరిక ఈనాటి భారతావనికి నూటికి నూరుపాళ్లూ వర్తించే విధంగా మన రాజకీయాలు మారిపోతున్నాయి. ఇక్కడా సంస్కృతుల మధ్య అగాధాల సృష్టికి ప్రయత్నాలు తీవ్రంగా సాగుతున్నాయి. సంస్కృతుల మధ్య విభజన రేఖలను పెంచటమే కొందరికి పనిగా మారింది. ఘాతుకాలకు పాల్పడినవారూ, విష భావజాలాలను సృష్టించినవారూ చరిత్రను మరచిపోవాలని అనుకుంటారు. భవిష్యత్తులో అవి జరగకూడదని కోరుకునే వారే చరిత్రను నిరంతరం గుర్తు చేసుకుంటూ మానవీయ సమాజం కోసం తపనచెందుతారు. అమెరికా పాలకులకు చరిత్రమరపు ఎక్కువవ్వటంతోనే గతంలోని పాపాలపై ప్రాయశ్చిత్తం లేకుండా వ్యవహరిస్తున్నారన్నదే మమ్దానీ ఆవేదన!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ఎల్ఐసీ పెట్టుబడులకు ఢోకా లేదు!

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గౌతమ్ అదానీ కంపెనీలో ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టింది అంటూ అమెరికన్ పత్రిక వాషింగ్టన్ పోస్ట్ ప్రచురించిన కథనం ఆధారంగా మన దేశ మీడియా ఎల్ఐసీ గురించి పలు అపోహలతో కూడిన ప్రచారాన్ని సాగిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో అయితే, అతిత్వరలో ఎల్ఐసీ మునిగిపోతుందని ప్రచారం జరిగింది. వాషింగ్టన్ పోస్టు కథనం వెలువడిన మరుక్షణమే ఆదానీ సంస్థలో జరిగిన పెట్టుబడుల గురించి ఎల్ఐసీ పత్రికా ప్రకటన జారీ చేసింది కానీ ఈ ప్రకటనలోని అంశాలన్నీ సంపూర్ణంగా మీడియా ప్రచారంలోకి తేలేదు. ఎల్ఐసీ చట్టం: 1938 సెక్షన్ 27ఎ ప్రకారం మొత్తం నిధులలో 85శాతం ప్రభుత్వ ఆమోదం ఉన్న (గవర్నమెంట్ అప్రూవ్డ్) సెక్యూరిటీలలోను బాండ్లలోను పెట్టే నిబంధన ఉన్నది. మిగతా 15శాతం నిధులను మార్కెట్ అనుకూలతలను బట్టి ఇతర మార్గాల్లో పెట్టుబడులుగా పెట్టే వెసులుబాటు ఉన్నది. ఎల్ఐసీ ప్రభుత్వ రంగ సంస్థ అయినప్పటికీ ప్రైవేట్ కంపెనీలో పెట్టుబడులు పెట్టకూడదన్న నిబంధన ఏమీ లేదు. అయితే ఎల్ఐసీ పెట్టుబడులను నిర్దేశించడానికి సంస్థాగతంగా ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల అజమాయిషీ ఉంటుంది. అన్ని నిర్ణయాలూ బోర్డ్ ఆమోదంతోనే జరుగుతాయి. నిర్ణయాలు పక్షపాతంతో జరిగినట్టు ఎప్పుడూ వెల్లడి కాలేదు. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది– స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టిన తర్వాత ఇప్పటివరకూ ఎల్ఐసీ నామమాత్రమైన నష్టాన్ని కూడా చవిచూడలేదు. దీనికి ప్రధాన కారణం ఎల్ఐసీ ఒక దీర్ఘకాలిక పెట్టుబడిదారు అయివుండటం. అంటే మార్కెట్లో ఎన్ని ఒడుదుడుకులు ఏర్పడినా సుదీర్ఘ కాలంలో పెరుగుదల తథ్యం.



ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు రావడం ద్వారా ఏ కంపెనీకీ నిధులు బదిలీ చేయడం జరగదు. సాధారణంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలినప్పుడు ప్రభుత్వ పెద్దల నుండి సూచనప్రాయ సందేశాలు ప్రజలకు వచ్చినట్టుగానే కంపెనీలకు కూడా వస్తాయి. అలాంటి సందర్భంలో మార్కెట్లను స్థిరపరచడానికి, కొన్ని కంపెనీల షేర్లు తక్కువ రేటుకు అందుబాటులో ఉన్న సందర్భంలో ఎల్ఐసీ వంటి సంస్థలు ముందుకొచ్చి ఆ షేర్లను కొనుగోలు చేస్తాయి. తర్వాత కాలంలో రెట్లు పెరగడం ద్వారా సంస్థ లాభపడి పాలసీదార్లకు పెద్ద మొత్తంలో బోనస్‌లు చెల్లించగలుగుతుంది. ఉదాహరణకు ఐడీబీఐ బ్యాంకులో పెట్టుబడులు పెట్టమని ప్రభుత్వం ఆదేశిస్తే, ఎల్ఐసీ ఆ పని పూర్తి చేసింది. ఆ తర్వాత కొంతకాలం ఐడీబీఐ షేర్ రేటు స్టాక్ మార్కెట్లో పడిపోయినా, ఇప్పుడు ఎల్ఐసీ కొనుగోలు చేసిన రేటుకు ఒకటిన్నర రెట్లు పెరిగింది. ఇలా గతంలో కూడా గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్, యూటీఐ, సత్యం కంప్యూటర్స్ వంటి వాటి రేట్లు మార్కెట్లో తక్కువ ధర పలుకుతున్నప్పుడు ఎల్ఐసీనే కాక అనేక ఇతర సంస్థలు కూడా కొనుగోలు చేసి తాము లాభం పొందడమే కాక మార్కెట్‌లోనూ స్థిరత్వాన్ని నెలకొల్పారు. స్టాక్ మార్కెట్లను స్థిరంగా ఉంచడానికి ఎల్ఐసీ ఒక ప్రభుత్వరంగ సంస్థగాను, చిన్న మొత్తాలను పొదుపులుగా సేకరించి పెట్టుబడులుగా మార్చే సంస్థగాను ఇలాంటి పని బాధ్యతాయుతంగా నెరవేరుస్తూ ఉన్నది. అంతేగాక, కొత్తగా మార్కెట్‌లో నమోదవుతున్న కంపెనీలను ప్రోత్సహించడానికి కూడా ఎల్ఐసీ లాంటి సంస్థలు పరిమితులకు లోబడి ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్‌లో పెట్టుబడులు పెడుతూ ఉంటాయి. ఈ ధోరణిని అనుసరించి– ప్రస్తుతం అదాని సంస్థలో ఎల్ఐసీ పెట్టినవి పెట్టుబడులే గాని నిధుల బదలాయింపు కాదు.

ఎల్ఐసీ ఒక పటిష్ఠమైన ప్రభుత్వ రంగ సంస్థ. కేవలం 3.5శాతం మాత్రమే వాటాలను స్టాక్ మార్కెట్లో విక్రయించింది. రానున్న రోజుల్లో మరో 10శాతం వరకు వాటాలను మార్కెట్‌లో ఉంచాలని, ఆ తదుపరి కాలంలో మొత్తంగా 25శాతం వాటాలను మార్కెట్లో ఉంచాలని సెబీ నిబంధనలు ఉన్నవి. ఇలా వాటాల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగితే ప్రైవేట్ పెట్టుబడి పెరిగిపోతే, ఆ తరువాతి నిర్ణయాల్లో అధికారులపై ప్రభావం కచ్చితంగా ఉంటుంది. అలాంటప్పుడు ఎల్ఐసీ పెట్టుబడులకు ఇప్పుడున్న నిబంధనలు వర్తింపజేయడానికి కష్టం అవుతుంది. అందుచేతనే కాబోలు ఇన్సూరెన్స్ చట్ట సవరణలను సమూలంగా మార్పు చేయాలని, తద్వారా ఇప్పుడు ఏదైతే సెక్షన్ 27ఏ పెట్టుబడులను నిర్దేశిస్తున్నదో, దానిని పూర్తిగా మార్చివేసి ఇష్టానుసారంగా ఇన్వెస్ట్‌మెంట్ చేసుకునే వెసులుబాటును కల్పించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి ప్రయత్నాలు సఫలీకృతమైతే అప్పుడు ప్రభుత్వం లేదా ప్రైవేట్ ప్రాబల్యంతో జరిగే నిర్ణయాలు ఎల్ఐసీ పెట్టుబడులను కచ్చితంగా ప్రభావితం చేస్తాయి. ప్రస్తుతానికి ఎల్ఐసీ పూర్తి ప్రభుత్వ రంగ సంస్థగానే ఉన్నది కాబట్టి తన నిధుల ఇన్వెస్ట్‌మెంట్‌ను నిబంధనలకు లోబడే కంపెనీలలో పెట్టుబడులుగా పెడుతున్నది.

డోనాల్డ్ ట్రంప్ అమెరికాకు రెండోసారి అధ్యక్షుడైన తర్వాత యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టీఆర్) ద్వారా భారత ఇన్సూరెన్స్ మార్కెట్‌ను నిర్దేశిస్తున్న ఐఆర్‌డీఏఐకి సూచనలు చేసే సాహసం చేస్తున్నది. ఇలా విదేశీ ఆర్థిక పెట్టుబడి ప్రాబల్యం పెరిగిన దరిమిలా, స్వదేశంలో జరుగుతున్న పెట్టుబడులపై ఆరా తీస్తూ వాషింగ్టన్ పోస్టు సదరు కథనాన్ని ఆశ్రిత పెట్టుబడి బదలాయింపుగా ప్రచురించినట్లు మనకు అర్థమవుతోంది. అందుచేత మీడియా సంస్థలు గానీ ప్రభుత్వ రంగ ఉన్నతిని కోరే మేధావులు గానీ దేశ అత్యున్నత సంస్థ ఎల్ఐసీ విధి విధానాలను లోతుగా అధ్యయనం చేకుండా దుష్ప్రచారాలకు ఆశ్రయమిస్తే– ప్రజల్లో గందరగోళం నెలకొని ప్రభుత్వరంగ ఉనికికే ప్రమాదంగా పరిణమిస్తుంది.

• జి. తిరుపతయ్య

అనర్హులను నియంత్రించటం తప్పా?

మన దేశంలో ప్రభుత్వ ప్రతి నిర్ణయాన్నీ రాద్ధాంతం చేసే కొందరు ప్రతిపక్ష నేతలున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, విపక్షంలోకి వస్తే మరో మాట మాట్లాడతారు. ప్రభుత్వంపై బురద చల్లుతుంటారు. ప్రభుత్వ పథకాల్లో, చర్యల్లో లోటుపాట్లు ఉంటే చట్టసభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి, ప్రజలకు మేలు జరిగే చర్యలైతే సహకరించాలి. తాజాగా గత ప్రభుత్వం ఇవ్వాల్సిన డీఏ బకాయిల్లో ఈ ప్రభుత్వం కొంత చెల్లిస్తే ఉద్యోగులు కూడా సంతోషించారు, అయినా కొందరు విమర్శించారు. ప్రభుత్వం సామాన్య ప్రజల గురించి కూడా ఆలోచించాలి కదా అన్నారు.

ఇక అనర్హులకి పెన్షన్ల రద్దుపై మరికొందరు విపక్ష నేతలు విమర్శలు గుప్పించారు. వృద్ధుల పింఛను 200 రూపాయలు ఉన్నపుడు స్థితిపరులు ఆ పింఛన్లు తీసుకోవటం నామోషీగా భావించారు. క్రమంగా ప్రభుత్వాలు రెండు వేలు, మూడు వేలు, నాలుగు వేలు అని పెంచుతూ పోతుంటే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పెద్ద జీతాలు, ఆదాయం పొందే కొందరి తల్లిదండ్రులు తాము కూడ పేదలమని కొందరు అవినీతి ఉద్యోగుల సాయంతో పింఛన్లు పొందారు. దివ్యాంగుల విషయంలో కూడా అంగవైకల్యం లేకపోయినా పెన్షన్లు పొందటం పేపర్లలో చూస్తున్నాం. ప్రజల సొమ్మే కదా అని కొందరు ప్రభుత్వ పెద్దలు అడ్డగోలు పంపిణీకి కారణమయ్యారు. మరోవైపు నిజంగా అంగవైకల్యం ఉన్నవారికి మాత్రం లంచం ఇవ్వలేదని కొందరు ఉద్యోగులు ఏదో ఒక సాకుతో వారి పెన్షన్లు మంజూరు చేయక ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారు. తమ పింఛన్లు ఆగిపోయాయని నిజమైన పేదలు, దివ్యాంగులెవరైనా ఫిర్యాదు చేస్తే– పరిశీలించి మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, కొందరు విపక్ష నేతలు 'పేదలపై పిడుగులు' అంటూ ఆందోళన చేస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగుల పింఛన్లు, రేషన్ వంటి పథకాలపై సంబంధిత అధికార బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత లేని వారినందరినీ తొలగిస్తే కోట్లాది రూపాయలు ఆదా అవుతాయి.

ఇక మహిళలకు మేలు చేయాలని ప్రభుత్వం భావిస్తే– గుజరాత్‌లో వలె సంపూర్ణ మద్యనిషేధం విధించలేక పోయినా, ముఖ్యమైన కూడళ్లలో మద్యం షాపులను మూయించటం, తగ్గించటం; తెలంగాణలో వలె తాగుడు మాన్పించటానికి డీ అడిక్షన్ సెంటర్లు తెరిపించే చర్యల వంటివి చేపడితే శాంతి భద్రతలు కొంత మెరుగుపడి, మహిళలకు భద్రత లభిస్తుంది. అవసరం లేని సంక్షేమ పథకాలు పెరిగే కొద్ది ప్రభుత్వాలు మద్యం ఆదాయంపై ఆధారపడుతున్నాయి. పెరిగిపోతున్న అవినీతి, అక్రమాలు, జల్సా సంస్కృతి, తాగుడు వంటి సామాజిక రుగ్మతల దుష్ప్రభావాలపై మంత్రులు, ప్రజాప్రతినిధులు సామాన్య ప్రజానీకాన్ని చైతన్యపరిస్తే సమాజానికి మేలు జరుగుతుంది.

అసలు వృద్ధుల, దివ్యాంగుల పింఛన్లు, రేషన్ వంటి సంక్షేమ పథకాల్లో నిజమైన పేదలెవరో తెలియాలంటే, తమ కుటుంబసభ్యుల వివరాలతో కూడిన డిక్లరేషన్‌ను లబ్ధిదారులు ఇవ్వాలని ప్రభుత్వం కోరాలి. విపక్షాలు సమాజానికి ప్రయోజనం కలిగించే ఇటువంటి అంశాలపై ప్రభుత్వానికి సహకరించాలి. ప్రభుత్వం కూడా మంచి పనులు చేసుకుంటూ పోవాలి. అప్పుడే మన దేశం ఆర్థికంగా, సామాజికంగా చైతన్యవంతమై అభివృద్ధి చెందుతుంది.

○ తిరుమలశెట్టి సాంబశివరావు
గుంటూరు

సేవానిరతికి అపూర్వ సత్కారం!

"సమాజమే దేవాలయం, పేద ప్రజలే దేవుళ్ళు" అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో ఇరవై ఎనిమిది సంవత్సరాలుగా లక్షలాదిమంది పేద ప్రజలకు సాయం అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నది ఎన్టీఆర్ ట్రస్ట్. 1997లో దివంగత ఎన్టీఆర్ జ్ఞాపకార్థం అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ఈ ట్రస్ట్‌ను ప్రారంభించారు. దీనికి మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తూ వచ్చిన నారా భువనేశ్వరి అంకిత భావం, దాతృత్వం వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపింది. ట్రస్ట్ ద్వారా వేలాది విద్యార్థులకు ఉచిత విద్య, పేదలకు ఆరోగ్యసేవలు, అత్యవసర రక్తదానం, విపత్తు సాయం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సమాజంలో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం 'స్త్రీ శక్తి' వంటి కార్యక్రమాల ద్వారా వేలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఇటువంటి సేవకు గుర్తింపుగా నారా భువనేశ్వరి నేడు అంతర్జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకోవటం ప్రతి తెలుగువారికీ గర్వకారణం.




ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఓడీ) సంస్థ ప్రకటించిన 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు 2025'కు నారా భువనేశ్వరి ఎంపిక అయ్యారు. స్వచ్ఛంద ప్రజాసేవ, సామాజిక రంగంలో చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అరుదైన గౌరవాన్ని ఆమె నేడు బ్రిటన్ రాజధాని లండన్‌లో జరిగే గ్లోబల్ కన్వెన్షన్‌లో అందుకోబోతున్నారు. స్వార్థరహిత సేవ చేసిన వ్యక్తులకు మాత్రమే దక్కే అత్యున్నత అంతర్జాతీయ గౌరవం ఇది.

నాయకత్వం, కార్పొరేట్ గవర్నెన్స్, సామాజిక సేవలలో విశిష్ట సహకారం అందించిన వ్యక్తులను ఐఓడీ గుర్తిస్తుంది. దీనిని 1903లో స్థాపించారు. సుమారు 30,000 మంది సభ్యులు ఇందులో ఉన్నట్లు సమాచారం. గతంలో భారతదేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహానుభావులు ఈ అవార్డును పొందటంతో దీని గౌరవం మరింత ఇనుమడించింది. దీనితోపాటు, 'ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్' విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డునూ నారా భువనేశ్వరి హెరిటేజ్ ఫుడ్స్ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో ఇదే వేదికపై అందుకుంటారు.

సామాజిక సేవలో నిస్వార్థంగా, స్వచ్ఛందంగా పనిచేస్తున్న వ్యక్తిగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొన్నారు భువనేశ్వరి. పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశంతో పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేశారు. ప్రతిభావంతులై ఉండి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారు. సాంకేతిక ఆధారిత విద్యకు ప్రాధాన్యం ఇస్తూ స్మార్ట్ క్లాస్ రూమ్స్, డిజిటల్ ల్యాబ్స్‌ను అభివృద్ధి చేస్తున్నారు. బ్లడ్ బ్యాంకుల ద్వారా రక్తం అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తూ వైద్య పరీక్షలు, మందులు అందిస్తున్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ సిలిండర్లు, ప్లాస్మా డొనేషన్ డ్రైవ్స్, ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ వంటి సేవలు అందించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు, ప్రత్యేకించి గ్రామీణ మహిళలకు అవకాశం కల్పిస్తున్నారు. వరదలు, తుఫానులు, భూకంపాలు వచ్చినపుడు అత్యవసర సహాయం అందిస్తూ ఆహారం, బట్టలు, మందులు పంపిణీ చేస్తున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున భువనేశ్వరి నిర్వహించిన ప్రతి సేవ, సామాజిక కార్యక్రమం ఒక కుటుంబాన్ని, ఒక గ్రామాన్ని, ఒక జీవితాన్ని మార్చగల శక్తిగా నిలిచింది. ఆమె రాజకీయ వర్గానికి చెందినప్పటికీ సేవలు మాత్రం పార్టీలకు అతీతంగా అందిస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు. సమాజం కోసం భువనేశ్వరి చేస్తున్న ఈ స్వచ్ఛంద సేవా యజ్ఞం ఇలాగే కొనసాగాలని, పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుందాం. లండన్ వేదికగా అందుకోబోతున్న అంతర్జాతీయ అవార్డు ఆమె సేవా నిబద్ధతకు, నిశ్శబ్ద స్ఫూర్తికి ప్రపంచ స్థాయిలో దక్కిన మన్నన.

■ నీరుకొండ ప్రసాద్

(నారా భువనేశ్వరి నేడు లండన్‌లో 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025' అవార్డు అందుకుంటారు)





ఎన్‌హెచ్-16పై పడిన కంకరను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



నగరంలోని దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) దత్తసాయి శివకామేశ్వరి పీఠంలోని శివయ్యకు ప్రత్యేక అలంకరణ

శివోహం కార్తీక మాసం రెండో సోమవారం శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. వేకువజామునే నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శైవక్షేత్రాల్లో శివయ్యను దర్శించుకున్నారు.



ఇబ్రహీంపట్నంలో అధిక లోడుతో పట్టా కూడా లేకుండా వెళ్తున్న టిప్పర్

ఓవర్ లోడుతో వెళ్తున్న టిప్పర్లు, డంపర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. తెలంగాణాలోని చేవెళ్లలో జరిగిన ప్రమాదం నేపథ్యంలో మన జిల్లాలో పరిస్థితులను పరిశీలిస్తే.. జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు గ్రామీణ రోడ్లలోనూ ఇవి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇసుక, కంకర, మట్టి, గ్రావెల్ ఏదైనా.. అధిక లోడుతో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా అత్యంత వేగంగా రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రిపూట మరింత వేగం పుంజుకుంటున్నాయి. సరైన ఆజమాయిషీ లేకపోవటంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

టిప్పర్లతో తిప్పలు

ప్రమాదకరంగా భారీ టిప్పర్లు, హెవీ డంపర్లు

ఓవర్ లోడుతో పాటు జాగ్రత్తలు లేకుండా రాకపోకలు

- మితిమీరిన వేగంతో ప్రయాణం.. రాత్రుళ్లు మరీ ఘోరం
- జిల్లావ్యాప్తంగా అనేక ప్రమాదాలు.. పట్టని అధికారులు
- ప్రధాన రహదారులపై పడిపోతున్న కంకర, ఇసుక
- వేగంగా వచ్చి జారిపోతున్న వాహనదారులు
- జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు గ్రామీణ రోడ్లూ ఛిద్రం

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం/కంచికచర్ల/విజయవాడ రూరల్/హనుమాన్ జంక్షన్ రూరల్) : విజయవాడ-హైదరాబాద్ ఎన్‌హెచ్-65, ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ ఎన్‌హెచ్-30పై నిత్యం భారీసంఖ్యలో కంకర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, జి.కొండూరు మండలాల్లోని వందలాది రాతి క్వారీలు, సమీపంలోని పెద్దపెద్ద క్రషర్ల నుంచి రాత్రీ పగలు తేడా లేకుండా వందల సంఖ్యలో టిప్పర్లు పలు గ్రామాలకు కంకరను రవాణా మిగతా 6లో..



పెద్దపెద్ద రాళ్లు రవాణా

ఒకపక్క కంకరతోనే ఇబ్బందులు పడుతుంటే.. భారీ బండరాళ్లను సైతం ఎలాంటి జాగ్రత్తలు లేకుండా టిప్పర్లలో రవాణా చేసేస్తున్నారు. క్వారీల్లో నుంచి పెద్దపెద్ద రాళ్లను ఎలాంటి రక్షణ లేకుండా రవాణా చేస్తున్నారు. ఆ రాళ్లు ఎప్పుడు మీద పడతాయోనని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు.

కళ్లు చెమిర్చి

మిర్చి రైతును ముంచేసిన మొంథా తుఫాను

- బలమైన ఈదురు గాలులకు నేలకొరిగిన పంట
- ప్రశ్నార్థకంగా మారిన దిగుబడులు
- పెట్టుబడి అయినా వస్తుందా రాదా అనే భయం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న మిర్చి రైతులు

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల) : పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో ఈ ఏడాది సుమారు 30 వేల ఎకరాల్లో రైతులు మిర్చి పంట సాగు చేశారు. వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది. కౌలుతో కలుపుకొని ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి అయ్యింది. తోటలు పూత, పిందె దశలో ఉన్నాయి. తెగుళ్లు, చీడపీడలు కూడా లేకపోవడంతో తోటలు ఎదుగుతూ, కాపునకు మిగతా 6లో..



చనిపోయిన మిర్చి చెట్లను చూపుతున్న రైతు కటిక నాగేశ్వరరావు

ఫొటోలో కనిపిస్తున్నది పెనుగంచిప్రోలుకు చెందిన రైతు కటిక నాగేశ్వరరావు. ఎకరం రూ.23 వేల వంతున 4 ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాడు. ఇప్పటికి ఎకరాకు రూ.70 వేల వంతున పెట్టుబడి అయింది. గతనెలలో కురిసిన భారీ వర్షానికి మొక్క కింద పడిపోయింది. పైకి లేపి ప్రాణం పోశారు. పూత, పిందెలతో కళకళలాడుతూ ఎదుగుతున్న తోటలను మొంథా తుఫాను మరోసారి దెబ్బతీసింది. ఈదురుగాలులకు చెట్లు ఒరిగి కొమ్మలు విరిగాయి. పూత రాలిపోయింది. మరల చెట్లను నిలబెట్టినప్పటికీ నిలబడతాయో లేదో కాపు వస్తుందో లేదో తెలియని సందిగ్ధ పరిస్థితి ఏర్పడింది.

ఓఆర్ఆర్ భూసేకరణకు మరోసారి ప్రతిపాదనలు

తప్పులను సవరించి నేడు ఎన్‌హెచ్ఏఐకి..

కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అమరావతికి కీలకమైన ఓఆర్ఆర్ భూ సేకరణకు సంబంధించి ప్రతిపాదనల రూపకల్పన, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు అందజేసే ప్రక్రియ దాదాపు పూర్తయిందని, మొత్తం 3,312 ఎకరాలకు ఇప్పటికే 3ఏ పంపించామని కలెక్టర్ లక్ష్మీశ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో 'ఆంధ్రజ్యోతి'లో ఓఆర్ఆర్ 3ఏ ప్రతిపాదనల తప్పులపై 'తప్పుల తడక' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి సంబంధించి 1,763 ఎకరాలకు 3ఏ ప్రతిపాదనలను మంగళవారం పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విజయవాడ, నందిగామ డివిజన్ల పరిధిలోని మైలవరం, జి.కొండూరు, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో భూ సేకరణకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఆయన వివరించారు.

ఇనుము దొంగలపై చర్యలు

పదిమంది హౌసింగ్ అధికారులపై ప్రభుత్వం సీరియస్

- వైసీపీ హయాంలో గొల్లపూడి గోడౌన్‌లోని ఇనుము పక్కదారి
- బిల్డర్లకు అమ్ముకున్న ఘనులు.. ఇప్పటికి క్రమశిక్షణా చర్యలు

విజయవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పేదల ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేయాల్సిన ఇనుమును దొంగిలించిన వ్యవహారంలో పదిమంది హౌసింగ్ కార్పొరేషన్ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించింది. గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ గోడౌన్‌లో కిందటి వైసీపీ ప్రభుత్వంలో 'పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణ మెటీరియల్‌ను నిల్వ చేశారు. ఇందులో భారీ ఎత్తున ఐరన్‌ను కొంతమంది అధికారులు పక్కదారి పట్టించారు. పేదలకు సరఫరా చేయాల్సిన ఇనుమును కొంతమంది బిల్డర్లకు అమ్ముకున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై మిగతా 6లో..

అంతకుమించి..

వైసీపీ నేత జోగి రమేశ్ అక్రమాల అంతస్థులెన్నో..

- తన ఆస్తి రూ.10 కోట్లు.. అప్పులున్నాయని జోగి ప్రకటన
- అంబాపురంలోని అగ్రిగోల్డ్ భూముల విలువే రూ.25 కోట్లు
- జోగి పీఏ కొన్న భవనం విలువ రూ. 1.30 కోట్లు
- అవికాక మైలవరం, హైదరాబాద్‌లో భూముల కొనుగోలు
- నకిలీ మద్యం వ్యాపారంతోనే కొన్నారా? అనే అనుమానాలు

కల్తీ మద్యం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ ఆస్తుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. తనకు రూ.10 కోట్ల ఆస్తులే ఉన్నాయని ప్రకటించుకున్న ఆయన రూ.25 కోట్లు పెట్టి అంబాపురంలో అగ్రిగోల్డ్ ఆస్తులు కొన్నారా? లేదా ఆక్రమించుకున్నారా? అనే అనుమానాలతో పాటు ఆయన బినామీల ఆస్తులు, మంత్రిగా ఉన్న సమయంలో కొన్న స్థలాల లెక్కలు తీస్తే ఆశ్చర్యం కలగకమానదు.





ఇబ్రహీంపట్నంలో జోగి రమేశ్ పీఏ కొన్న భవనం (ఇన్‌సెట్‌లో) జిల్లా జైలు వద్ద మాజీ మంత్రి జోగి రమేశ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తనకు రూ.10 కోట్ల ఆస్తులే ఉన్నాయంటున్న మాజీమంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ కుటుంబం అంబాపురంలో రెవెన్యూ-సీఐడీ నిర్ధారించిన అగ్రిగోల్డ్ భూములను ప్రైవేట్ వ్యక్తి వద్ద కొన్నామని చెబుతోంది. కొద్దిరోజుల ముందు ఓ టీవీ చానల్‌లో జోగి రమేశ్ ఈ విషయం చెప్పడం విడ్డూరంగా ఉంది. ఈ అగ్రిగోల్డ్ భూముల విలువ రూ.25 కోట్ల వరకు ఉంటుంది. రూ.10 కోట్ల ఆస్తులు కలిగి, చాలా అప్పులు ఉన్నాయని చెబుతున్న జోగి రమేశ్‌కు రూ.25 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయన్నది చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికల అఫిడవిట్ లెక్కలు తప్పా..?

2024 ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘానికి ఇచ్చిన అఫిడవిట్‌లో తాను, తన భార్య స్థిరచరాస్తులన్నీ కలిపి రూ.4 కోట్లుగా జోగి రమేశ్ చూపారు. అప్పులు మాత్రం అంతకుమించే ఉన్నట్టు తెలిపారు. ఇలాంటపుడు జోగి రమేశ్ తనకు రూ.10 కోట్ల మేర ఆస్తులు ఉన్నాయని తాజాగా చెప్పడం ఎన్నికల సంఘానికి కూడా తప్పుదారి పట్టించినట్టే అవుతుంది. జోగి రమేశ్ గతంలో ఒక పాత పెంకుటిల్లులో ఉండేవారు. రూ.10 కోట్లతో ఆధునిక భవనాన్ని ఎలా సమకూర్చుకున్నారో? ఆయనే చెప్పాలి. ఈ డబ్బంతా ఎక్కడి నుంచి వచ్చింది? అంటే నకిలీ మద్యం వ్యాపారం నుంచే వచ్చిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

అగ్రిగోల్డ్ భూములు కొన్నారా? కొట్టేశారా?

అంబాపురంలోని అగ్రిగోల్డ్ భూములను కొనకుండా తప్పుడు డాక్యుమెంట్లు, ఫోర్జరీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని జోగి రమేశ్‌పై అభియోగం. తాను అసలు భూములే అమ్మలేదని పోలవరపు మురళీమోహన్ అనే వ్యక్తి పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. జోగి రమేశ్ మాత్రం ఇప్పటికీ తాము మిగతా 6లో..



జోగిలపడ్డారా?

ఇబ్రహీంపట్నం పోలీసులపై అనుమానాలు

- జోగి అరెస్టు ఆపరేషన్‌లో వారంతా దూరం
- ముందే విజయవాడ పిలిపించి.. సెల్‌ఫోన్లు తీసుకుని..
- జోగి అరెస్టు వరకు కళ్లెం వేసిన సిట్ అధికారులు
- చర్చకు దారి తీసిన 'ఆంధ్రజ్యోతి' కథనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ఇబ్రహీంపట్నం) : నకిలీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నాయకుడు, మాజీమంత్రి జోగి రమేశ్‌తో ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో ఉన్న కొందరు అంటకాగుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పీఎస్‌లో జోగికి కోవర్టులు ఉన్నారా? సిట్ అధికారుల సమాచారంతో పాటు ప్రభుత్వ సమాచారాన్ని ఆయనకు చేరవేసే పనిలో ఉన్నారా? అనే సందేహాలు వస్తున్నాయి. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన 'జోగి అరెస్టు ఆపరేషన్‌లో ఇబ్రహీంపట్నం పోలీసులకు కళ్లెం' అనే శీర్షికన ప్రచురితమైన కథనం చర్చనీయాంశంగా మారింది. జోగి అరెస్టు సమయంలో సిట్ అధికారులు ఇబ్రహీంపట్నం పోలీసులకు కళ్లెం వేయడంతో ఈ అనుమానాలకు బలం కలుగుతోంది. ఆ పీఎస్‌లోని ఉన్నతస్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బందిని విజయవాడ పిలిపించి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోవడం, సిట్ అధికారులు జోగి ఇంటికి వెళ్లాకే.. తిరిగి ఇవ్వడం వెనుక స్థానిక పోలీసులకు జోగితో రహస్య సంబంధాలున్నాయన్న అనుమానాలకు ఆస్కారం ఏర్పడింది. ఆ పోలీసులు ఎవరనే దానిపై చర్చ జరుగుతోంది.

అర్జీల పరిష్కారంలో అలసత్వం సహించను

- కలెక్టర్ లక్ష్మీశ 8

ఆ ఇద్దరికీ జీవిత ఖైదు సరైనదే!

- ట్రయల్ కోర్టు తీర్పునకు హైకోర్టు సమర్థన
- చిన్నారి నాగవైష్ణవి కిడ్నాప్, హత్య కేసులో..
- టయల్ ఉత్తర్వులకు పాక్షిక సవరణ
- ఇద్దరు దోషుల అప్పీళ్లు కొట్టివేత
- మరొకరిని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు

6



మోపిదేవి వార్పు వద్ద నేలమట్టమైన అరటి తోట

కష్టాలు.. కన్నీళ్లు!

మొంథా తుఫానుతో కుదేలైన అన్నదాతలు

ఆంధ్రజ్యోతి పొలం బాట

పుడమితల్లిని నమ్ముకున్న శ్రమజీవులు వాళ్లు.. సూర్యోదయానికి ముందే పొలానికి చేరతారు. రోజంతా కష్టపడుతూనే ఉంటారు. చీకటి పడిన తర్వాత గానీ ఇంటికి చేరరు. వారికి ఉన్నది ఒక్కటే వ్యాపకం.. అదే పచ్చని పంటల సాగు.. అటువంటి అన్నదాతలపై తరచూ ప్రకృతి పగపడుతోంది. తుఫాన్లు, వరదల రూపంలో వచ్చి నష్టం కలగజేస్తోంది. అయినా వెరవక ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. ఇటీవల వచ్చిన మొంథా తుఫాను వీరిని కోలుకోలేని దెబ్బతీసింది. కృష్ణానది తీరంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి' బృందం జరిపిన 'పొలంబాట' కార్యక్రమంలో భారీగా పంట నష్టం వెలుగుచూసింది. పెనమలూరు నియోజకవర్గం నుంచి అవనిగడ్డ, మచిలీపట్నం నియోజకవర్గాల వరకు సుమారు 400 కిలోమీటర్ల పరిధిలో 'ఆంధ్రజ్యోతి' బృందం సభ్యులు పర్యటించారు. అన్నదాతలు ఎదుర్కొంటున్న కష్టాలను కళ్లారా చూశారు. వరి, అరటి, బొప్పాయి, పసుపు, కంద, వేరుశనగ, మిర్చి, టమాటా, కూరగాయలు, ఆకుకూరలు ఇలా అనేక రకాల పంటలు నేలపాలయ్యాయి. అరటి, కంద పంటలకు ఎకరాకు రూ.1.50 లక్షలు వరకు నష్టం వాటిల్లింది. మిగిలిన పంటల సాగుకు రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయారు. నేలవాలిన వరికే అధికారులు పరిహారం కోసం అంచనా వేస్తుండగా రైతులు ఆందోళన చెందుతున్నారు. - (ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

- కృష్ణాజిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం
- నేలవాలిన వరి.. మొలకెత్తుతున్న కంకులు
- విరిగిపోయిన అరటి, బొప్పాయి చెట్లు
- నీటిలో నాని కుళ్లిపోయిన పసుపు, కంద
- ఆనవాళ్లు లేకుండా పోయిన మిర్చి, టమాటా, కూరగాయ, ఆకు కూరల పంటలు
- రూ.లక్షలాది రూపాయల పెట్టుబడి నీటిపాలు
- కృష్ణాజిల్లాలో 400 కిలోమీటర్లు పర్యటించి వివరాలు తెలుసుకున్న 'ఆంధ్రజ్యోతి' బృందం
- తీరంలో 'పొలంబాట' పట్టి.. రైతన్నల కష్టాలు అడిగి తెలుసుకుని..

బందరు మండలం బీపీ తోటలో దెబ్బతిన్న వరి కంకులు చూపుతున్న రైతు కొనకళ్ల ప్రసాద్



కష్టం.. నష్టం..!


పెనమలూరులో నేలకొరిగిన కంద పంటను చూపుతున్న రైతు


బంటుమిల్లి మండలం నారాయణపురంలో నేలకొరిగిన వరి

- ఈతదశలో ఉన్న వరి సుంకురాలి తెల్లకంకులు ఏర్పడినా పంట నష్టపరిహారం జాబితాలో నమోదు చేయరట
- జాబితాలో నమోదుచేస్తే ధాన్యం కొనుగోలు చేయరని చెబుతున్న వీఏఏలు
- అరటి, కంద పంటలకు బీమా సౌకర్యమే లేదు
- 50శాతంకు పైగా వరిపంటకు నష్టమని చెబుతున్న వ్యవసాయ సీనియర్ శాస్త్రవేత్తలు
- అన్నిపంటలకు బీమా, నష్టపరిహారం ఇవ్వాలని రైతుల వేడుకోలు
- కృష్ణాజిల్లాలో 'ఆంధ్రజ్యోతి-పొలంబాట'లో వెలుగుచూసిన రైతుల కష్టాలు

మొంథా తుఫాను రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. తుఫాను ప్రభావంతో బలమైన గాలుల తీవ్రతకు వరిపంటతోపాటు అరటి, పసుపు, కంద తోటలకు తీవ్రనష్టం వాటిల్లింది. మిర్చి, టమాటా మొక్కలను ఇరవైరోజుల క్రితం నాటగా తోటల్లోకి వర్షపునీరుచేరి బయటకు వెళ్లే దారిలేక చనిపోతున్నాయి. మొంథా తుఫాను రైతులకు మిగిల్చిన నష్టం, వారి కష్టాలు తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' బృందం 'పొలంబాట' కార్యక్రమాన్ని సోమవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించింది. 20మంది విలేకరుల బృందం 26 మండలాల్లోని పలు గ్రామాల్లో 400కిలోమీటర్ల మేర పర్యటించి రైతులకు జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకోవడం జరిగింది.

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

అరటి రైతుకు కోలుకోలేని నష్టం

మొంథా తుపాను తీరందాటే సమయంలో జిల్లాలోని అన్నిప్రాంతాల్లో గంటకు 90కిలోమీటర్ల కంటే వేగంగా గాలులు వీచాయి. ఈ గాలుల ప్రభావానికి పిలకతోటలతో


మోపిదేవిలంకలో పూర్తిగా పడిపోయిన అరటితోటలు

పాటు, గెలలు తయారై కోతకు సిద్ధంగాఉన్న అరటిచెట్లు నిలువునా కూలిపోయాయి. ఎకరానికి పెట్టుబడిగా రూ.50వేలు, కౌలుగా రూ.50వేలుగా ఇప్పటివరకు రైతులు పెట్టారు. అరటిగెలలు కోతదశలో ఉన్న సమయంలో చెట్లు మొత్తంగా పడిపోవడంతో పూర్తిస్థాయిలో నష్టపోయామని రైతులు చెబుతున్నారు. విరిగిపడిన చెట్లను తొలగించేందుకు ఎకరానికి కనీసంగా రూ.15వేలు ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. ఎకరానికి రూ.1.50లక్షలు నష్టం వాటిల్లిందని, దీనికితోడు చెట్లు పడిపోకుండా కట్టిన వాసాలు సైతం విరిగిపోయాయని రైతులు చెబుతున్నారు. అరటిపంటకు బీమా సౌకర్యం లేదని రైతుల మాటగా ఉంది.

కంద దిగుబడి తగ్గడం ఖాయం..

కంద పంట మరో నెలరోజుల్లో తీస్తామని, ఈదశలో పెనుగాలులకు మొక్కలు విరిగిపడి చనిపోయాయని, దీంతో దుంపలకు ఆహారం అందదని రైతులు చెబుతున్నారు. ఎకరానికి కంద దిగుబడి 70పుట్లు(ఒకపుట్టుకు250 కిలోలు) వస్తుందని ఆశించామని, తుఫాను కారణంగా దిగుబడి సగానికి సగం తగ్గుతుందని, కందలో నాణ్యత తగ్గితే ధరకూడా ఆశించినమేర రాదని రైతులు అంటున్నారు. రానున్నరోజుల్లో కంద పుట్టు ఎంతమేర ధర పలుకుతుందో చూడాలని రైతులు చెప్పుకుంటున్నారు. ఎకరం కంద సాగుకు కౌలుతో కలిపి రూ.1.50లక్షల వరకు ఖర్చు అవుతుందని, అంతా బాగుంటే రూ.3.50నుంచి 4లక్షలవరకు వస్తుందని ఆశించామని, అయితే కోలుకోలేని దెబ్బతగిలిందని, భూమి ఆరిన తరువాత పంటను తవ్వి విక్రయిస్తే నష్టం ఎంతమేర వస్తుందో తేలుతుందని రైతులు అంటున్నారు.

పసుపు దిగుబడి పైనా సన్నగిల్లుతున్న ఆశలు

జూన్‌నెలలో జిల్లాలో పసుపు 2,200హెక్టార్లవరకు నదీ తీరం వెంబడి గ్రామాల్లో, లంకభూముల్లో సాగుచేశారు. పసుపుపైరు నాలుగున్నర నెలలు, ఐదు నెలలవయసులో ఏపుగా ఎదిగి దుంపకట్టే దశలో ఉంది. తుఫాను ప్రభావంతో వీచిన గాలులకు ఏపుగా ఎదిగిన పసుపు మొక్కలు



విరిగిపోయాయి. ఇలా విరిగిన మొక్కలు దుంపలకు ఆహారం అందించలేవని, పక్కనే పిలకలు వచ్చినా, వాటితో అంతగా ఉపయోగం ఉండదని రైతులు అంటున్నారు దీంతోపాటు రోజుల తరబడి పసుపుతోటలో నీరు నిల్వఉండటంతో తయారయ్యే దశలో ఉన్న దుంపలు భూమి లోపలే కుళ్లిపోతున్నాయని, వాసనవస్తున్నాయని, దీంతో ఎంతమేర నష్టం జరుగుతుందనేది ఇప్పుడే చెప్పలేమని రైతులు అంటున్నారు. ఎకరానికి సరాసరి 35నుంచి40క్వింటాళ్ల పసుపు దిగుబడి వస్తుందని ఆశించామని, ఈ ఏడాది పసుపు ఎంతమేర దిగుబడివస్తుందో చెప్పలేకున్నామని రైతులు అంటున్నారు. ప్రభుత్వం బీమా ఇస్తేనే కోలుకుంటారని రైతులు అంటున్నారు.

రైతుల డిమాండ్లు

- మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న అన్ని పంటలకు నష్టపరిహారం ఇవ్వడంతో పాటు పంటల బీమా అమలు చేయాలి
- కందపంటకు ఇంతవరకు బీమా, నష్టపరిహారం ఇవ్వడం లేదు. ఈ ఏడాది నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని పంటల బీమా జాబితాలో చేర్చి రైతులను ఆదుకోవాలి.
- అరటికి పంటబీమా గతఏడాది వరకు జిల్లాలో అమలు చేశారు. ఈ ఏడాది జిల్లాను మినహాయించారు. రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయిన అంశాన్ని దృష్టిలో ఉంచుకుని బీమా అమలుచేసి ఆదుకోవాలి.
- పసుపుపంటకు దిగుబడి ఆధారంగా బీమాను ఈ ఏడాది అమలు చేస్తున్నారు. అది కూడా జిల్లా యూనిట్‌గా అమలులో ఉంది, వాతావారణం ఆధారంగా పసుపుపంటకు గ్రామం యూనిట్‌గా బీమా అమలు చేయాలి.
- మొంథా తుపాను కారణంగా బలమైన గాలులకు వరికంకులు పాలుపోసుకునే దశలో ఉండి గింజలు పగిలిపోయి తప్పతాలుగా మారాయి. దెబ్బతిన్న పంటను పూర్తిస్థాయిలో నష్టపరిహారం జాబితాలో నమోదు చేయాలి.

మొక్కదశలోనే మిర్చి, టమాటా తోటలకు దెబ్బ

కృష్ణాతీరం వెంబడి లంకగ్రామాల్లో మిర్చి, టమాటాసాగును 20 నుంచి నెలరోజుల్లోపు సాగుచేశారు. ఎకరానికి మిర్చిమొక్కలు 18వేలు, టమాటా మొక్కలు 14వేల చొప్పున, ఒక్కోమొక్క రూపాయితో కొనుగోలు చేసి నాటారు. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు తోటల్లో నీరు నిలబడి నిలదొక్కుకునే దశలో ఉన్న మొక్కలు చనిపోయాయి, మిర్చి, టమాటాసాగుకు దుక్కి, ఎరువులకు, మొక్కలు నాటేందుకు మొత్తంగా ఎకరానికి ఇప్పటికి రూ.25వేలు ఖర్చయిందని, ఈ పెట్టుబడి మొత్తం నీటిలో పోసినట్టయిందని రైతులు వాపోతున్నారు. గతంలో రూపాయి పలికిన మిర్చి, టమాటా ఒక్కో మొక్కధరను ఇప్పుడు నర్సరీ యజమానులు ఒక్కోటి రెండురూపాయలకుపెంచారని రైతులు చెబుతున్నారు.

పంట నష్టపరిహారం నమోదుపై స్పష్టత ఏదీ

జిల్లాలో 45వేల హెక్టార్లలో వరిపంట దెబ్బతిందని వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పంట నష్టపరిహారం జాబితాలు తయారుచేసే సమయంలో నేలావాలిన పంటను మాత్రమే నష్టపరిహారం జాబితాలో నమోదు చేస్తామని, ఈతదశలో ఉండి సుంకురాలిపోయిన పంటను నమోదు చేయమని గ్రామస్థాయిలో వ్యవసాయ అధికారులు(వీఏఏ) చెబుతున్నారని రైతులు అంటున్నారు. ఈతదశలో ఉన్న వరిపంట బలమైన గాలుల కారణంగా సుంకురాలి గింజలు పగిలిపోయి తెల్లకంకులుగా మారాయని, ఇలాఉంటే నష్టపరిహారం జాబితాల్లో రాయాలని తమకు స్పష్టమైన ఆదేశాలు రాలేదని, తాము ఏమీ చేయలేమని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారని రైతులు చెబుతున్నారు. పంట నష్టపరిహారం జాబితాల్లో 33శాతంకన్నా అధికంగా పంట నష్టం జరిగినట్టుగా రాస్తే, సంబంధిత పంటను కొనుగోలు చేయకుండా ఈ-క్రాప్‌లో బ్లాక్‌లో పెడతారని వీఏఏలు చెబుతున్నారని రైతులు అంటున్నారు. కొందరు వీఏఏలు ఇంతవరకు గ్రామాల్లోకి వచ్చి పంటకు జరిగిన నష్టాన్ని కూడా పరిశీలించలేదని రైతులు అంటున్నారు.

50 శాతానికి పైగావరిపంటకు నష్టం

తుఫాను అనంతరం గుంటూరు లామ్‌ఫాం, ఘంటసాల వ్యవసాయ పరిశోధనాక్షేత్రానికి చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు జిల్లాలోని పలుప్రాంతాల్లో పర్యటించి వరిపంటను పరిశీలించారని, పాలుపోసుకునే దశలో వరిపంట ఒకదుబ్బులో ఉన్న తల్లి, పిల్లకర్రలకు ఉన్న గింజలు పగిలిపోయాయని, ఇవి తప్పతాలుగా మారిపోతాయని, వరి పంట 50శాతం దెబ్బతిందని తమతో చెప్పారని రైతులు అంటున్నారు. కానీ వరిపంటకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని రైతులు వాపోతున్నారు. వరితో పాటు కంద, అరటి, పసుపు పంటలకు పంటబీమా వర్తింపచేయాలని, పంట నష్టపరిహారం కూడా ఇవ్వాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



చేతికొచ్చే సమయంలో నష్టం

కొనకళ్ల ప్రసాద్, బి.వి.తోట, రైతు

వారం పదిరోజుల్లో చేతికొచ్చే పంట తుపాను కారణంగా సర్వనాశనం అయ్యింది. ఈ ఏడాది సకాలంలో నాట్లు పడ్డాయి. 40 బస్తాలు పండుతుందని ఆశించాం. తుఫాన్‌తో ఆశలు అడియాశలయ్యాయి.

ఊహించని నష్టం



- వెంకటేశ్వరరావు, చిట్టిపాలెం

తుఫాన్ నష్టం ప్రభావం ఇంతా అంతా కాదు. ఊహించని విధంగా దెబ్బ తీసింది. పంట మొత్తం మునిగిపోయింది. పది ఎకరాల్లో చేతికొచ్చేది అంతంత మాత్రమే. చేసిన ఖర్చుకు తోడు, పడి పోయిన పంటను లేవదీసి కోతలు కోసేందుకు ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి.

పంట పూర్తిగా పోయింది

- జన్ను వెంకటేశ్వరరావు, సీతారామపురం



12 ఎకరాలు కౌలు చేస్తున్నా. తుఫానుకు పంట మొత్తం పడిపోయింది. రెండో పంట ఉంటే సిద్ధమవుతాం. పంట నూర్చే పరిస్థితి లేదు. యంత్రాలకే చాలా ఖర్చు అవుతుంది. పొలంలోనే వదిలేస్తా.

నష్టం నమోదు చేయడం లేదు

- నల్లూరి గంగాధర్‌రావు, శ్రీకాకుళం



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. ఎకరా ఒక్కంటికి రూ.25 వేల మేర నాలుగు ఎకరాలకు లక్ష వరకు ఖర్చు అయ్యింది. తుఫాన్ కారణంగా అత్యధిక శాతం తెల్లకంకులు కనిపిస్తుండటంతో ఏమి చేయాలో అర్థం కావటం లేదు. పడిపోకుండా నిలబడి ఉన్నప్పటికీ కంకులు పాలు పోసుకోకుండా తప్పలుగా ఉన్నాయి. ఇలాంటి పొలాల విషయంలో అధికారులు నష్టం జరిగినట్లు నమోదు చేయటం లేదు.

పెట్టుబడి రావడం గగనమే

- నడకుదుటి సీతారామరాజు, నిమ్మగడ్డ



రెండు ఎకరాల్లో కంద వేయగా, ఎకరాకు రూ.2.50 లక్షల మొత్తాన్ని విత్తనాల కోసం, రూ.50 వేల మేర సాగు మొత్తం రూ.6 లక్షల మేర ఖర్చు చేశా.. ప్రకృతి సహకరించి ఉంటే ఎకరా ఒక్కంటికి రూ.5 లక్షలు వచ్చేది. గాలుల కారణంగా ఏపుగా పెరిగిన కంద చెట్టు విరిగి పడిపోవటంతో ఇప్పటి వరకు పెరిగిన దుంప మాత్రమే దక్కుతుంది. పెట్టుబడి ఖర్చులు కూడా రావటం గగనం అవుతుంది.

న్యాయం చేయాలి

- ఇంకొల్లు చెన్నయ్య, కె.కొత్తపాలెం



తుఫాన్ కారణంగా వరి పంట దెబ్బతిన్న రైతులకు నిబంధనలు సడలించి రైతులకు న్యాయం చేయాలి. తుఫాను నష్టం జాబితాలో వరి పంటను నమోదు చేస్తే ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు పడతారని చెబుతున్నారు. ఆ మేర కు నిబంధనలు సడలించి పంట దెబ్బతిన్న రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలి.

అధికారులు న్యాయం చేయాలి

- కాగిత వెంకట్రావు, అర్తమూరు



సాతులూరు రోడ్డులో ఎకరం అరవై సెంట్లు దేవుడిమాన్యం కట్టుబడి చేస్తున్నాం. దేవస్థానం భూములకు సంబంధించి కాగితాలు ఇవ్వకపోవడంతో అధికారులకు సమర్పించలేక పోయా. మరోచోట రెండు ఎకరాలు కౌలు చేస్తున్నా. 65 సెంట్లకు మాత్రమే కౌలుకార్డు ఉంది. దాదాపు మూడు ఎకరాలకు ఎలాంటి ఆధారం లేకపోవడంతో ప్రభుత్వ సాయం అందేలా లేదు. అధికారులు విచారణ చేసి న్యాయం చేయాలి.

వాణిజ్య పంటలకు అపార నష్టం

- బొందలపాటి వెంకటేశ్వర ప్రసాద్, మోపిదేవి



అధిక వర్షాలు, తుఫాను కారణంగా వాణిజ్య పంటలైన అరటి, పసుపు, కంద, కూరగాయల తోటలు సాగు చేస్తున్న రైతులకు అపార నష్టం వాటిల్లింది. ప్రస్తుతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అరటి పంటకు మాత్రమే అధికారులు అంచనా నమోదు చేస్తున్నారు. పసుపు, కంద పంటలకు నష్టం అంచనాలో పొందుపరచి రైతులకు న్యాయం చేయాలి. ప్రభుత్వమే ఆదుకుని న్యాయం చేయాలి.

పదిలక్షలకు పైగా నష్టపోయా

- మన్నె రాజబాబు, తాడిగడప

తాడిగడప గ్రామాన్ని ఆనుకొని ఉన్న తన పొలంలో ఐదెకరాల్లో అరటి, మరో ఐదెకరాల్లో కంద సాగు చేశాను. అరటి చెట్లు గెలలతో నేలకొరిగి పూర్తిగా ధ్వంసమయింది. కంద దుంప పూర్తిగా రాకుండానే కొంతమేర నష్టం వాటిల్లింది. దీంతో పది లక్షలకు పైగా నష్టపోయానని రైతు, స్థానిక టీడీపీ నేత మన్నె రాజబాబు వాపోయాడు.

ఆ ఇద్దరికీ జీవిత ఖైదు సరైనదే!

- ట్రయల్ కోర్టు తీర్పునకు హైకోర్టు సమర్థన
- చిన్నారి నాగ వైష్ణవి కిడ్నాప్, హత్య కేసులో
- ట్రయల్ ఉత్తర్వులకు పాక్షిక సవరణ
- ఇద్దరు దోషుల అప్పీళ్లు కొట్టివేత
- మరొకరిని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు
- 15ఏళ్ల క్రితం బెజవాడలో సంచలనం రేపిన కేసు


నాగవైష్ణవి (ఫైల్)

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పదిహేనేళ్ల క్రితం సంచలనం సృష్టించిన చిన్నారి పలగాని నాగవైష్ణవి కిడ్నాప్, హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ మహిళ సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు పాక్షికంగా సవరించింది. నిందితులు మోర్ల శ్రీనివాసరావు(ఏ1), యంపరాల జగదీశ్(ఏ2)లకు ట్రయల్ కోర్టు విధించిన శిక్షను సమర్థిస్తూ వారు వేసిన అప్పీళ్లను కొట్టివేసింది. సరైన సాక్ష్యాలు లేనందున మరో నిందితుడు పంది వెంకటరావు అలియాస్ కృష్ణ(ఏ3)కు విధించిన జీవిత ఖైదును రద్దు చేస్తూ, అతడిని నిర్దోషిగా ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డితో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు ఇచ్చింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో 2010లో.. విజయవాడలో చిన్నారి నాగ వైష్ణవి, కారు డ్రైవర్ లక్ష్మణరావు హత్యకేసు సంచలనం సృష్టించింది. విజయవాడకు చెందిన పలగాని ప్రభాకర్‌రావుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య పలగాని వెంకటేశ్వరమ్మకు పిల్లలు లేకపోవడంతో నర్మదాదేవిని రెండో పెళ్లి చేసుకోగా ఇద్దరు కుమారులు, కుమార్తె నాగవైష్ణవి జన్మించారు. కుమార్తె పుట్టిన తరువాత వ్యాపారం వృద్ధి చెందడంతో ప్రభాకర్‌రావు ఆమె పేరుమీద ఆస్తులు కొనడం ప్రారంభించారు. దీంతో కుటుంబంలో విభేదాలు ప్రారంభమయ్యాయి. అక్క వెంకటేశ్వరమ్మకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని సోదరుడు పంది వెంకట్రావు బావపై కక్ష పెంచుకున్నాడు. నాగవైష్ణవిని హత మారిస్తే అక్క కాపురం బాగుపడుతుందని భావించి హత్యకు కుట్రపన్నాడు. బంధువు మోర్ల శ్రీనివాసరావుతో రూ.50లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. శ్రీనివాసరావు తన వద్ద పనిచేసే జగదీశ్ సాయం తీసుకున్నాడు. నాగవైష్ణవి, సోదరుడు తేజేశ్ గౌడ్‌లను డ్రైవర్ లక్ష్మణరావు 2010 జనవరి 30న ఉదయం పాఠశాలకు తీసుకెళ్తుండగా మోర్ల శ్రీనివాసరావు రాయి విసిరి కారు అద్దం పగులగొట్టాడు. డ్రైవర్ లక్ష్మణరావు దిగి చూస్తుండగా మోర్ల శ్రీనివాసరావు, జగదీశ్.. అతడిని కత్తులతో విచక్షణారహితంగా పొడిచారు. ఇది గమనించి తేజేశ్ గౌడ్ కారుదిగి పారిపోయాడు. డ్రైవర్ లక్ష్మణరావును స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. శ్రీనివాసరావు, జగదీశ్ చిన్నారి వైష్ణవిని కిడ్నాప్ చేసి మరో కారులో తరలిస్తుండగా చిన్నారి కేకలు వస్తుండటంతో గొంతు నొక్కి చంపేశారు. ప్లాస్టిక్ డ్రమ్ములో మృతదేహాన్ని ఉంచి గుంటూరు శివారులోని ఆటోనగర్‌లో విద్యుత్ కొలిమిలో వేసి బూడిద చేశారు. కుమార్తె హత్యతో తండ్రి ప్రభాకర్‌రావు గుండె ఆగి మరణించారు. కేసు ట్రయల్ జరుగుతుండగానే నాగవైష్ణవి తల్లి నర్మదాదేవి, బాబాయి మరణించారు. హత్య ఘటనపై విజయవాడ పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ జరిపిన విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు నిందితులు మోర్ల శ్రీనివాసరావు, యంపరాల జగదీశ్, పంది వెంకటరావులకు 2018జూన్ 14న జీవిత ఖైదు విధించింది. తీర్పును సవాల్ చేస్తూ దోషులు వేర్వేరుగా హైకోర్టులో అప్పీల్ వేశారు. దీనిపై ధర్మాసనం ఇటీవల తుది విచారణ జరిపి పై విధంగా తీర్పు చెప్పింది.

టిప్పర్లతో తిప్పలు

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నాయి. టిప్పర్లలో కంకరను ఓవర్‌లోడు చేస్తున్నారు. డ్రైవర్ టాప్ క్యాబిన్‌పై కూడా కంకరను పోసి మరీ రవాణా చేస్తున్నారు. కంకర కిందకు కారకుండా ఉండేందుకు పట్టాలు కూడా కట్టట్లేదు. ఈ క్రమంలో జాతీయ రహదారుల్లోని పలు కూడళ్ల వద్ద, జంక్షన్లు ఉన్నచోట కంకర కింద పడుతోంది. పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద ఉన్న జంక్షన్లలో, రింగ్ సెంటర్లలో రోజూ 4 నుంచి 5 ట్రాక్టర్ల మేర టిప్పర్ల నుంచి కంకర కింద పడుతోంది. వీటివల్ల వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి.

నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో..

నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇసుక రీచ్‌లు, గ్రావెల్, కంకర క్వారీలు, సిమెంట్ ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడి నుంచి జిల్లాలోని ప్రాంతాలకే కాకుండా, ఇతర జిల్లాలకు ఇసుక, కంకర, సిమెంట్ సరఫరా అవుతుంది. భారీ టిప్పర్లకు, డంపర్లకు 60 నుంచి 70 టన్నుల వరకు లోడింగ్ చేస్తున్నారు. వీటివల్ల రహదారులతో పాటు గ్రామీణ రోడ్లు ధ్వంసమవుతున్నాయి.

నగరంలో రాత్రిపూట ఇష్టానుసారంగా..

టిప్పర్ల దూకుడు కారణంగా నగరంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డు, పైపులరోడ్డు సెంటర్, ప్రకాష్‌నగర్, కండ్రిక తదితర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అవనిగడ్డ-విజయవాడ కరకట్ట మార్గం మీదుగా ఇసుకతో కూడిన భారీ లారీలు గుంటూరు కూడా వెళ్తున్నాయి. గన్నవరం, బాపులపాడు మండలాల్లోని క్వారీల నుంచి కూడా నగరానికి మితిమీరిన వేగంతో టిప్పర్లు దూసుకొస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలతో పాటు రహదారులు ధ్వంసం కాకుండా చూడాల్సి ఉంది.

ఇనుము దొంగలపై చర్యలు

(5వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వంలో తూతూమంత్రపు చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంలో మొత్తం పదిమంది అధికారుల హస్తం ఉందని గుర్తించారు. ఎస్.చలపతిరావు-డీఈఈ ఇన్‌చార్జి (రిటైర్డ్), బీఎస్ రవికాంత్-డీఈఈ ఇన్‌చార్జి (రిటైర్డ్), ఎం.శ్రీధర్‌కుమార్-ఏఈఈ (రిటైర్డ్), బి.శ్రీనివాసరావు-ఏఈ (రిటైర్డ్), ఎం.విజయభాస్కర రాజు-డీఈఈ (తిరువూరు),ఎం.రజనీకుమారి-డిప్యూటీ కలెక్టర్ (ఎన్టీఆర్ జిల్లాలో పనిచేస్తున్నారు), ఎం.నాగమల్లేశ్వరరావు-డీఈఈ (రిటైర్డ్), ఓ.విజయ బాబు-డీఈఈ (విజయవాడ ఈస్ట్ సబ్ డివిజన్‌లో పనిచేస్తున్నారు), ఎస్కే ఖాదర్‌వలీ-ఈఈ (బాపట్లలో పనిచేస్తున్నారు), వి.శ్రీదేవి-ఈఈ (రిటైర్డ్)లపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది.

అదుపులోకి మనోజ్‌కుమార్ జైన్

- నకిలీ మద్యం కేసులో 41ఏ నోటీసు ఇచ్చి విడుదల
- సీసాలు, మూతల సరఫరాలో జైన్‌కు ప్రమేయం

విజయవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తయారైన నకిలీ మద్యం నింపడానికి వాడిన సీసాలు, మూతలను సరఫరా చేసిన వ్యవహారంలో మనోజ్ కుమార్ జైన్ అనే వ్యాపారిని విజయవాడలో ఎక్సైజ్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. 41ఏ నోటీసు ఇచ్చి ఆయనను పంపించివేశారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహనరావు సోదరులను ఎక్సైజ్ అధికారులు విచారించినప్పుడు.. మనోజ్‌కుమార్ జైన్ పేరు ప్రస్తావనకు వచ్చింది. ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేసిన తర్వాత దాన్ని నింపడానికి అవసరమైన సీసాలను, వాటికి అమర్చే మూతలను మనోజ్‌కుమార్ సరఫరా చేసినట్టు తమ వాంగ్మూలంలో వారు తెలిపారు. 2021 నుంచి ఈ ప్రక్రియ సాగినట్టు వారిద్దరూ వెల్లడించారు. దీని ఆధారంగా మనోజ్‌కుమార్ జైన్‌ను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన అస్వస్థతకు లోనవ్వడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం 41ఏ నోటీసు ఇచ్చి పంపించివేశారు. కాగా, విజయవాడలోనే మనోజ్‌కుమార్ కుటుంబం అద్దెకు ఉంటోంది. ఆయన పోలీసులకు చిక్కడం ఇదే మొదటిసారి కాదు. ఇంతకుముందు పలు కేసుల్లో ఆయన నిందితుడిగా ఉన్నాడు. తెలంగాణ పోలీసులు ఒకసారి, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పోలీసులు మరోసారి మనోజ్‌కుమార్‌ను విజయవాడలో అరెస్టు చేసి తీసుకెళ్లారు.

మనోజ్... ఓ గందరగోళం

మనోజ్‌కుమార్ జైన్... మనోజ్ కొఠారి... ఈ రెండు వేర్వేరు పేర్లు. వాటిలో కామన్ ఉన్నది మనోజ్ అనే పేరు ఒక్కటే. ఇదే గందరగోళానికి దారి తీసింది. ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యాపారి పేరు మనోజ్‌కుమార్ జైన్. కోర్టుకు సమర్పించిన సీడీ ఫైలులో మాత్రం ఏ20గా మనోజ్ కొఠారి పేరును ప్రస్తావించారు. దీంతో గందరగోళం తలెత్తింది. కాగా, మనోజ్ కొఠారి విజయవాడలో ప్లాస్టిక్ డబ్బాల వ్యాపారి. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావుకు ముఖ్యఅనుచరుడు. కొఠారిని జగన్ ఆనాడు జైన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినా, ఆయన ప్రమాణస్వీకారం చేయలేదు. ఒకానొకదశలో పశ్చిమ విజయవాడ నియోజకవర్గం ఎమ్మెల్యే సీటు కేటాయింపు వరకు కొఠారి పేరు వెళ్లింది.

గన్నవరం సర్పంచ్‌పై వేటు

- పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు
- రూ.1.32 కోట్ల నిధుల దుర్వినియోగమే కారణం
- ఉపసర్పంచ్‌కు తాత్కాలికంగా సర్పంచ్ అధికారాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : గన్నవరం గ్రామపంచాయతీ సర్పంచ్ నిడమర్తి సౌజన్యపై వేటు పడింది. గ్రామ పంచాయితీలో జరిగిన నిధుల దుర్వినియోగం వ్యవహారంలో జిల్లా పంచాయతీ అధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం సర్పంచ్ పదవి నుంచి ఆమెను తొలగిస్తూ కలెక్టర్ బాలాజీ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. సర్పంచ్ అధికారాలను తాత్కాలికంగా ఉపసర్పంచ్‌కు బదిలీ చేశారు. గన్నవరం పంచాయతీలో రూ.1.32 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగిందని జిల్లా అధికార యంత్రాంగం నిర్ధారించింది. గ్రామ కార్యదర్శితో కలిసి నిధులను దుర్వినియోగం చేసినట్టుగా విచారణలో తేలింది. పంచాయితీ రాజ్ చట్టాన్ని అనుసరించి సర్పంచ్, కార్యదర్శి ఇద్దరికి 1:1 నిష్పత్తి ప్రకారం ఇద్దరూ రూ.66,05,425 చెల్లించాలని, లేని పక్షంలో సర్పంచ్ పదవి నుంచి తొలగించాల్సి ఉంటుందని గతంలో నోటీసు ఇచ్చారు. ఈ డబ్బులు చెల్లించడానికి ఆరు నెలల సమయం ఇచ్చారు. ఈ ఆరు నెలల కాలంలో సర్పంచ్ చెక్కు డ్రాయింగ్ అధికారాలను కూడా నిలిపివేశారు. గ్రామ పంచాయతీ సాధారణ నిధులు, 14వ ఆర్థిక సంఘం నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులను డ్రా చేసే అధికారాన్ని గుడివాడ డీఎల్‌పీవోకు అప్పగించడం జరిగింది. దీనిపై సర్పంచ్ నిడమర్తి సౌజన్య కలెక్టర్‌కు అప్పీలు చేసుకున్నారు. జూలై 19, 2024న నిడమర్తి సౌజన్య కలెక్టర్ ఎదుట వ్యక్తిగతంగా హాజరై లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. సర్పంచ్ చేసిన అప్పీలుపై కలెక్టర్ రికార్డులను పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా గుడివాడ డీఎల్‌పీవోను ఆదేశించారు. గుడివాడ డీఎల్‌పీవో విచారణ జరిపి సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో సర్పంచ్ చెక్ డ్రాయింగ్ పవర్‌ను నిషేధిస్తూ, డబ్బులు చెల్లించడానికి మరో మూడు నెలలు సమయం ఇచ్చారు. అయితే ఇచ్చిన గడువులోగా డబ్బులు సర్పంచ్ చెల్లించలేదు. దీంతో ఆమెను పదవి నుంచి తొలగించడానికి నోటీసు ఇచ్చారు. ఈ క్రమంలో మళ్లీ సర్పంచ్ నిధుల వినియోగానికి సంబంధించి ఓచర్లు ఉన్నాయని, చేసిన ఖర్చుకు పంచాయతీ ఆమోదం ఉందని, చెక్కు డ్రాయింగ్ అధికారాలను తిరిగి పునరుద్ధరించాల్సిందిగా కలెక్టర్‌ను అభ్యర్థించారు. సర్పంచ్ అందజేసిన వివరాలు సమగ్రంగా లేకపోవడంతో నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్టు నిర్ధారించి ఆమె పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

కళ్లు చెమిర్చి

(5వ పేజీ తరువాయి)

దిగుతున్న తరుణంలో మొంథా తుఫాన్ విరుచుకుపడింది. పల్లపు, లోతట్టు ప్రాంతాల్లోని మిర్చి తోటలు దెబ్బతిన్నాయి. నీళ్లు నిలబడటంతో తోటలు ఎర్రబడ్డాయి. బలమైన ఈదురుగాలులకు మొక్కలు పక్కకు ఒరిగాయి. కొన్ని తోటల్లో చెట్లకొమ్మలు విరిగాయి. పూత రాలిపోయింది. ఒరిగిన చెట్లను రెండోరోజే నిలదొక్కించారు. అయితే, మిర్చి తోటలకు కనిపించని నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు. నేలకొరిగిన చెట్లు నిలదొక్కుతున్నప్పటికీ కాపుపై తీవ్ర ప్రభావం పడుతోందని, ఆశించిన దిగుబడులు రావటం కష్టమని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనికితోడు పెట్టుబడి కూడా బాగా పెరుగుతుందంటున్నారు. సాధారణంగా ఎకరాకు రూ.1.50 లక్షలకు అయ్యే పెట్టుబడి, అధిక వర్షాలు, తుఫాన్ వల్ల రూ.2 లక్షల పైగా అవుతుందంటున్నారు.

పుంజుకుంటున్న మార్కెట్

రెండేళ్లుగా మిర్చి మార్కెట్‌లో సంక్షోభం ఏర్పడింది. క్వింటాకు రూ.10 వేల నుంచి రూ.13 వేలలోపు మాత్రమే ధర వచ్చింది. ఒకప్పుడు తాలు కాయల ధర కూడా ఎర్ర కాయలకు లభించకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల నుంచి మార్కెట్‌లో కదలిక వచ్చిందని అంటున్నారు. క్రమేణా ధరలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. రెండు రోజుల క్రితం గుంటూరు మార్కెట్‌లో తేజ రకానికి క్వింటాకు కనిష్ఠంగా రూ.13 వేలు, గరిష్ఠంగా రూ.15,700 ధర పలికింది. లావులకు సంబంధించి 334 రకానికి కనిష్ఠంగా రూ.12,500, గరిష్ఠంగా రూ.15 వేలు ధర పలికింది. ప్రస్తుతం మార్కెట్లో ధర పెరుగుతుండటం రైతులకు కొంత ఊరట కలిగించే అంశం.

అంతకుమించి..

(5వ పేజీ తరువాయి)

ఆ భూములను కొన్నామనే చెబుతున్నారు. ఈ భూములను కొంటే ఆస్తికి మించి డబ్బు ఎలా వచ్చింది? ఎక్కడి నుంచి వచ్చింది? కల్తీ మద్యం వ్యాపారం నుంచే వచ్చిందా? అనే విషయంపై చర్చ నడుస్తోంది.

అనుచరులకు అన్ని ఆస్తులా..?

జోగి రమేశ్ అనుచరులు కూడా భారీగా ఆస్తులు కొనడంపై అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. జోగి పీఏ ఆరేపల్లి రాము ఆయన బినామీ అని అందరూ అంటుంటారు. తన పీఏ భారీ జీతం కూడా తీసుకోలేదని చెబుతున్న రాము రూ.1.30 కోట్లతో ఇబ్రహీంపట్నంలో రెండంతస్తుల భవనాన్ని ఎలా కొన్నాడన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ భవనాన్ని జోగి రమేశ్ తన బినామీ పేరుతో కొన్నాడన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో మైలవరం నియోజకవర్గంలో దాదాపు 50 ఎకరాలు కొన్నట్టు సమాచారం. ఇవికాకుండా హైదరాబాద్‌లో మరో 10 ఎకరాలు కొన్నట్టు తెలుస్తోంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్లు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

ఆటోనగర్‌లో ఉద్యమ వర్క్‌షాప్ రేపు

ఆటోనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 5న జవహర్ ఆటోనగర్‌లోని ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ అసోసియేషన్ హాలులో రాంప్ కార్యక్రమంలో భాగంగా ఉద్యమ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం. మధు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి జరిగే ఈవర్క్‌షాప్‌లో ఉద్యమ రిజిస్ట్రేషన్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పథకాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. పారిశ్రామికులు ఈఅవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఎం. మధు కోరారు.



దివ్యాంగ విద్యార్థులకు లాప్‌ట్యాప్‌లు అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

దివ్యాంగ విద్యార్థులకు లాప్‌ట్యాప్‌లు అందజేత

కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ లక్ష్మీశ, దివ్యాంగ విద్యార్థులకు లాప్‌ట్యాప్‌లు అందజేశారు. రూ.1,40,000 విలువైన నాలుగు లాప్‌టాప్‌లను పీహెచ్‌డీ, డిగ్రీ, బీటెక్ చదివే వినికిడి లోపం, కంటి చూపు సమస్య, శారీరక వైకల్యం గల విద్యార్థులకు అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు తీసుకొని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

● కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మొత్తం 17ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఏ.రవీంద్రరావు, డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీరు ఇన్‌చార్జి పీ. సత్యకుమారి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, పాల్గొన్నారు.



లబ్ధిదారులతో ఎంపీ కేశినేని శివనాథ్

పేదలను ఆదుకోవటమే కూటమి లక్ష్యం

● చెక్కుల పంపిణీలో ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, పేదవారిని ఆదుకునే లక్ష్యంతో పనిచేస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. సోమవారం గురునానక్ కాలనీలోని ఎన్‌టీఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 21 మంది లబ్ధిదారులకు రూ.14,42,700 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇప్పటి వరకు విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో 350 మంది లబ్ధిదారులకు రూ.3కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ సహాయం అందించినట్లు తెలిపారు. పార్టీ నాయకులు కే.శివరామకృష్ణ, షేక్ హుస్సేన్, కందిమళ్ళ సాయిసుమిత్, తాళ్లూరి శ్రీను, గద్దె హరిబాబు, మన్నె కళావతి, వి.నరసింహా చౌదరి, మాదిగాని గురునాథం తదితరులు పాల్గొన్నారు.

గిరిజన భవన నిర్మాణానికి స్థలం కేటాయించండి

● జేసీకి బంజారా సేవా సంఘం వినతి

కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో లక్షలాది మంది గిరిజనులు ఉన్నా ఇప్పటి వరకు జిల్లాలో గిరిజన భవన్ లేకపోవడంతో గిరిజనులు జిల్లా కేంద్రంలో సమావేశాలు నిర్వహించడానికి తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జె.బాలాజీ నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన జేసీ ఇలక్కియాకు వినతిపత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వం జిల్లా కేంద్రంలో గిరిజన భవన నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ భవన్ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించి వెంటనే నిర్మాణానికి సహకరించాలని జేసీకి విన్నవించారు. జేసీకి వినతిపత్రం ఇచ్చిన వారిలో బాలాజీ నాయక్, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బి.గోపిరాజు, జిల్లా నాయకులు బి.శ్రీనివాసరావులు ఉన్నారు.



జయహో జాతీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

గాంధీనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మతోన్మాదానికి వ్యతిరేకంగా 'హిందూ ముస్లిం ఏక్ హో' నినాదంతో ఈ నెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జయహో మూడో జాతీయ సమ్మేళనం జరుగుతుందని ఆ సంఘం నేత ఖదిజ్జాసి రవీంద్రనాథ్ తెలిపారు. జయహో మూడో జాతీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ సోమవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత, స్వాతంత్య్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫక్ ఖుల్లాఖాన్, గాంధీజీ, గఫర్‌ఖాన్, స్వామీ వివేకానంద స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జయహో ప్రతినిధులు ఖదిజ్జాసి రాజమణి, ఎం.ఏ.రజాక్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కాపవరపు ధర్మరాజు, ప్రజానాట్య మండలి కోశాధికారి ఆర్.పిచ్చయ్య పాల్గొన్నారు.

ఐలా ప్రాంతాల అభివృద్ధికి ప్రతిపాదనలు

ఏపీఐఐసీ సీజీఎం రామ్ వెల్లడి

ఆటోనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న 133 ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ(ఐలా) ప్రాంతాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించామని ఏపీఐఐసీ చీఫ్ జనరల్ మేనేజర్ ఐఎల్ రామ్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన జవహర్ ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ఐలా ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రాంతాలలో పర్యటించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు.. ఖాళీ స్థలాల్లో మొక్కలునాటి వాటి పరిరక్షణ బాధ్యతను సంబంధిత ప్రాంతాల్లోని పారిశ్రామికవేత్తలు తీసుకునే విధంగా వారికి అవగాహ కల్పించాలని ఐలా కమిషనర్, అధికారులను ఆదేశించామని తెలిపారు. ఐలా పరిధిలో ఈఏడాది ఇప్పటి వరకు 50 శాతం ఆస్తిపన్ను వసూలైందని, అందులో 35శాతం వాటా లోకల్‌బాడీలకు ఇస్తున్నామని రామ్ పేర్కొన్నారు. వారు కూడా ఐలా ప్రాంతాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్ఎం కె. బాబ్జీ, కానూరు న్యూఆటోనగర్ ఐలా కమిషనర్ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీజీఎం రామ్

త్రిశక్తిపీఠంలో ఘనంగా మహాలింగార్చన

కృష్ణలంక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. పంచబిల్వార్చన (తులసి, బిల్వం, నిర్గుండి (వావిలాకు), జంబీరం(నిమ్మ, నేరుడు), ఆమ్లం(ఉసిరి)తో అర్చన, అభిషేకాలను పండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పండితులు, ఆలయ ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక దీపోత్సవం సాయంత్రం 6.15 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ కార్యదర్శి జగదీష్‌కుమార్ తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.



మహాలింగార్చనలో పాల్గొన్న పండితులు, కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

గురునానక్ కాలనీ శివాలయంలో...

భారతీనగర్: కార్తీక మాసం పురస్కరించుకొని గురునానక్ కాలనీ శివాలయంలో శ్రీరామలింగేశ్వర స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచి భక్తులు కుటుంబసమేతంగా తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయప్రాంగణాన్ని కార్తీక దీపాలతో అలంకరించారు.

గృహిణుల సేవలు వెలకట్టలేనివి

● ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ



విజయవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి క్షణం జీవితాన్ని తన కుటుంబం కోసమే ఖర్చు పెడుతూ తాను వెలుగుతూ, కరిగిపోతున్న గృహిణుల త్యాగం కొలవలేమని, వారి సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. కేవీఎస్ సిద్ధార్థ ఫార్మాస్యూటికల్ కళాశాలలో సోమవారం జాతీయ గృహిణుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మార్పు ట్రస్టు, మహిళా స్టడీ సెంటర్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాయపాటి శైలజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, గృహిణులు వంటింటికే పరిమితం అనే భావన నుంచి బయటపడి, వారి శ్రమలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కష్టసుఖాల్లో చేదోడువాదోడుగా ఉంటూ సమాన అవకాశాలు, హక్కులు కల్పించాలన్నారు. మహిళల ఆరోగ్యానికి కుటుంబ సభ్యులు, ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. చదువుకుని ఉద్యోగం చేస్తున్న గృహిణుల జీవితాల్లో కూడా అణచివేత, హింస వంటివి జరగడం బాధాకరమన్నారు. బాలికలు, మహిళలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. వరల్డ్ కప్ కాంపిటీషన్‌లో భారత్ తరపున ఆడి గెలిచిన ఉమెన్ క్రికెట్ టీమ్‌కు కేక్ కటింగ్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్పు ట్రస్ట్ అధినేత ఆర్.సూయజ్, కాలేజీ ప్రిన్సిపాల్ ఏ.సుమతి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మారిన దోబీఘాట్

● చెత్తా చెదారంతో దుర్గంధం వెదజల్లుతున్న వైనం

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: 14 వ డివిజన్ దోబీఘాట్‌లో దుస్తులు ఉతుక్కోవడానికి వీలు లేకుండా సిమెంట్ మెట్లు, సైడ్ వాల్స్ పగిలిపోయి పూర్తిగా నిరుపయోగంగా మారిందని పటమట అంబేడ్కర్ నగర్ కాలనీ, సత్యనారాయణ నగర్, లంబాడిపేట ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోబీఘాట్ నిరుపయోగంగా మారడంతో చుట్టుపక్క ప్రాంత వాసులు చెత్తా చెదారం, వ్యర్థాలను వేస్తున్నారని, దీంతో రేవు దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈగలు దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు సోకే ప్రమాదముందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దోబీఘాట్ మరమ్మతులు చేయించకపోగా కనీసం శుభ్రపరిచేదిశగా చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఘాట్‌ను శుభ్రపరిచి పగిలిపోయిన మెట్లకు మరమ్మతులు చేయించే దిశగా చర్యలు చేపట్టి పునఃనిర్మించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.




చెత్తా చెదారం, వ్యర్థాలతో పాడైన రేవు



విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసిన డీఆర్ఎం మోహిత్ సోనాకియా, ఇతర అధికారులు

విజేతలకు బహుమతుల అందజేత

రైల్వేస్టేషన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ సైబర్ భద్రతా అవగాహన మాసం సందర్భంగా విజయవాడ రైల్వే డివిజన్‌లో సైబర్ జాగృత్ భారత్ అంశంపై నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన పలువురు ఉద్యోగులకు సోమవారం విజయవాడ డీఆర్ఎం మోహిత్ సోనాకియా అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. డీఆర్ఎం సమావేశపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన సైబర్ భద్రత కోసం భారతీయ రైల్వే సురక్షితమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి నిరంతరం అవగాహన కల్పిస్తుందన్నారు. అదనపు రైల్వే డివిజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) శ్రీనివాసరావు కొండా, సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికామ్ ఇంజనీర్ పి.సతీష్ శంకర్, ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరికరాలను అందజేస్తున్న ఆర్టీసీ కార్మిక పరిషత్ నాయకులు

బస్‌స్టేషన్‌లోని ఆసుపత్రికి వైద్యపరికరాల అందజేత

బస్టేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లోని ఆసుపత్రిలో ఆర్టీసీ ఉద్యోగులకు అవసరమయ్యే వైద్య పరికరాలను ఆర్టీసీ కార్మిక పరిషత్ నాయకుడు యార్లగడ్డ రమేష్ తన సొంత నిధితో రెండు స్టెతస్కోప్‌లు, ఒక బీపీ మిషన్, మరికొన్ని వైద్య పరికరాలను సోమవారం ఆసుపత్రి వైద్యుడు అనిల్‌కు అందజేశారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలు లేకపోవడం వలన ఆసుపత్రికి వెళ్ళే ఉద్యోగులు, ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్న విషయం తెలుసుకున్న బస్‌స్టేషన్ కంట్రోలర్, కార్మిక పరిషత్ నాయకుడు యార్లగడ్డ రమేష్ తన సొంత నిధులతో వైద్య పరికరాలను కొనుగోలు చేసి వైద్యులకు అందజేశారు. కార్మిక పరిషత్ నాయకులు యర్లగడ్డ విష్ణు, జి.వి నారాయన, నగ్సర్తి ప్రభాకరరావు, సీనియర్ స్టాఫ్ నర్స్‌లు రీటా, హేమ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

యూజీడీ పైపులైన్, వర్షం నీటి సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మొగల్రాజపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత నెల ఏడో డివిజన్, 11వ డివిజన్‌లో పలు సమస్యలపై ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో వీఎంసీ ఈఈ-3 సామ్రాజ్యం ఆయా సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. గత నెల 25న ఏడో డివిజన్ ఉడ్‌పేట కనుమూరి దేవానందం రోడ్డు శాంతినగర్ రెండో లైను కలిసే చోట వర్షం నీరు నిలిచి స్థానికులు పడుతున్న ఇబ్బందులపై నీరు పోయేదెలా అనే కథనానికి పరిష్కారంగా గల్పర్ మెషిన్‌తో నీటిని తోడించి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. గత నెల 29న బోయపాటి మాధవరావు రోడ్డులో తాగునీటి పైపులైన్లు లీకేజీ- తాగునీటి కొరతపై కథనానికి సంబంధించి ప్రధాన లైన్లలో లీకులు లేవని ఒక ఇంటి కుళాయి కనెక్షన్‌కు మరమ్మతు చేసి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. 11వ డివిజన్‌లో విజయదుర్గానగర్‌లో డ్రిల్ యంత్రాలతో రోడ్డును తవ్వుతున్నపుడు యూజీడీ పైపులైన్ ధ్వంసమైన అంశంపై కథనానికి పరిష్కారంగా పగిలిన యూజీడీ పైపుల స్థానంలో కొత్త పైపులు వేసి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు.



పటమట అంబేద్కర్‌నగర్ ఎస్ఎస్ఎం స్కూల్ వెనుక గోతులతో అంతర్గత సిమెంట్ రోడ్డు

గోతులతో ప్రమాదకరంగా అంతర్గత రోడ్లు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: ఎస్ఎస్ఎం స్కూల్ వెనుక ఉన్న అంతర్గత సిమెంట్ రోడ్డు గోతులతో ప్రమాదకరంగా ఉందని పటమట అంబేడ్కర్ నగర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా దర్శిపేట వెళ్లాలంటే పటమట లంబాడిపేట, అంబేడ్కర్‌నగర్ నుంచి వెళ్లే వాహనదారులు ఈ మార్గాన్నే వెళ్లాలని, వాహనాలు అదుపుతప్పి వాహనదారులు గాయపడుతున్నారని, ఒక్కోసారి వాహనాలు పాదచారులపై దూసుకువచ్చి ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించే దిశగా చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

తోపుడు బండి అందజేత

కృష్ణలంక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక 21వ డివిజన్‌లోని శంకరమఠం వద్ద టీడీపీ నాయకులు చెంబేటి కృష్ణబాబు సొంత నిధులతో అందించిన తోపుడు బండిని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ ఆకురాతి శ్రీనివాసరావుకు అందజేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 14న సంగీత వాగ్గేయకారుల సంస్మరణోత్సవాలు

విజయవాడ కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి డిసెంబరు 14న వాగ్గేయకారుల సంస్మరణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సమితి ప్రధాన కార్యదర్శి సీవీ రావు తెలిపారు. వీణ కుప్పయ్యర్, స్వాతి తిరునాళ్, సుబ్బరాయశాస్త్రి, పల్లవి గోపాలయ్యర్, రామనాథ్ శ్రీనివాస్ అయ్యంగార్, పొన్నయ్య పిళ్లై, పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్, ముత్తయ్య భాగవతార్, మైసూరు వాసుదేవాచారి, జీఎన్‌బీ వారల కృతులు వచ్చిన వారు పాడేందుకు, వాయించేందుకు అభ్యర్థులు ఎవరైనా కృతుల వివరాలతో ఈనెల 20లోగా వారి పేర్లను 9866864340 నంబర్‌లో తెలియజేయాలని తెలిపారు.


కమిషనర్ ధ్యానచంద్రను కలిసిన శాలిగ్రామ పంచాయతీ బృందం

వీఎంసీలో శాలిగ్రామం విజ్ఞాన యాత్ర

కార్పొరేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానయాత్రలో భాగంగా కర్ణాటక రాష్ట్రం ఉడిపి జిల్లా శాలిగ్రామ నగర పంచాయతీ నుంచి ప్రజా ప్రతినిధులు, ఆఫీసర్లు, ప్రజారోగ్య సిబ్బంది వీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం కమిషనర్ ధ్యానచంద్రను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వీఎంసీ చేస్తున్న అభివృద్ధి పనులు, వ్యర్థాల నిర్వహణ, డ్రోన్ సర్వేలెన్సు ద్వారా చేస్తున్న పారిశుధ్య నిర్వహణను వివరించారు. అనంతరం వారు ఫీల్డ్‌లో అజిత్‌సింగ్ నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్, స్క్రాప్ పార్క్, వెహికల్ డిపో, ప్రాంతాలని పరిశీలించారు. శాలిగ్రామ పంచాయతీ చీఫ్ ఆఫీసర్ అజయ్ బండార్కర్, సుకన్య శెట్టి, వైస్ ప్రెసిడెంట్ గిరిజ పూరి, చైర్మన్ అనసూయ, వీఎంసీ అడిషనల్ కమిషనర్ (జనరల్) ఏ రవీంద్రరావు, వెహికల్ డిపో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, పంచాయతీ బృందం పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఉచిత మెగా వైద్యశిబిరం

● ఆస్టర్ రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

విజయవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు ఆస్టర్ రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించబోతున్నట్టు జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కే దాలినాయుడు తెలిపారు. సోమవారం గాంధీనగర్‌లోని పెన్షనర్స్ హాలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని పెన్షనర్లు వినియోగించుకోవాలన్నారు. బీపీ, షుగర్, ఊపిరితిత్తులు, ఈసీజీ, టుడీ ఎకో టెస్టులు ఆస్టర్ రమేష్ ఆసుపత్రి ఉచితంగా చేస్తారన్నారు. గుండె జబ్బులు, ఎండోక్రైనాలజీ, ఊపిరితిత్తులు, జనరల్ మెడిసిన్ డాక్టర్లు కూడా పెన్షనర్ల రిపోర్టులు చూసి మందులు సూచిస్తారన్నారు. అనంతరం పెన్షనర్ల సమస్యలు, డిమాండ్ల గురించి ప్రసంగించారు. 2026 పెన్షనర్స్ డైరీ కావాల్సిన వారు ముందుగా 150 చెల్లించి ఆఫీస్‌లో తమ డైరీని రిజర్వు చేసుకోవాలన్నారు.


ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే సుజనాచౌదరితో మాట్లాడుతున్న చైర్మన్లు

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన ప్రెస్ అకాడమీ చైర్మన్లు

వన్‌టౌన్, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి సోమవారం గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మీడియాలో నెలకొన్న పరిస్థితులు, రాజకీయ అంశాల గురించి ఎంపీతో చర్చించారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డీ సోమసుందరరావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుజనా చౌదరితో..

పెనమలూరు: ఏపీ, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్లు ఆలపాటి సురేష్‌కుమార్, కే శ్రీనివాసరెడ్డి సోమవారం ఎమ్మెల్యే సుజనాచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. తాడిగడపలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నేతలతో కలిసి వారు ఎమ్మెల్యేతో జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం సహించను

● కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోనని, పునరావృతం కాకుండా అర్జీలకు పరిష్కారం చూపాల్సిందేనని, అనుమతి లేకుండా గ్రీవెన్స్‌కు గైర్హాజరయితే చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను హెచ్చరించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని అర్జీదారుడు పెట్టుకొన్న నమ్మకానికి బలం చేకూర్చేలా అర్జీలను పరిష్కరించి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. డీఆర్వో ఎం లక్ష్మీనరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వీ నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జీ జ్యోతి వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జంతు సంక్రమిక వ్యాధుల నివారణే లక్ష్యం

జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులను నివారించాలన్న లక్ష్యంతో ఒకే ఆరోగ్యం (వన్ హెల్త్) అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు సమావేశ మందిరంలో ఒకే ఆరోగ్యం పోస్టర్ ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఏడాది నవంబరు 3న వన్‌హెల్త్ డేగా జరుపుకుంటారన్నారు. పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకా మందులు ఇప్పించాలన్నారు. జేసీ ఎస్ ఇలక్కియా, డీఆర్వో ఎం లక్ష్మీ నరసింహం, డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని, డీఈవో యూవీ సుబ్బారావు, డాక్టర్ సమీర పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, తదితరులు

కొండపల్లి కీర్తికి ఎస్‌పీఏ చేయూత

జిల్లాలోని కొండపల్లి ప్రాంతంలో హస్తకళలు, పర్యాటకరంగ అభివృద్ధికి చేస్తున్న కృషిలో భాగంగా కొండపల్లి బొమ్మల ఎక్స్‌పీరియన్స్ సెంటర్ అభివృద్ధిలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ-విజయవాడ) సంస్థ భాగస్వామ్యానికి చొరవ చూపుతున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్‌లో ఎస్‌పీఏ ప్రతినిధులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంతో పాటు దేశ, విదేశాలలో ప్రత్యేక గుర్తింపు పొందిన కొండపల్లి బొమ్మల ఔన్నత్యాన్ని నేటితరానికి చాటిచెప్పేలా, భవిష్యత్తుతరాలకు వారసత్వ సంపదగా అందించేలా చేపట్టిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్ తోరణం (ఆర్చ్) అభివృద్ధితో పాటు కొండపల్లిని ఒక మోడల్ గ్రామీణ సృజనాత్మక ఆర్థిక కేంద్రంగా మార్చడానికి అవసరమైన ఆర్కిటెక్చర్, ప్లానింగ్‌కు సంబంధించి సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రొడక్ట్ (ఓడీపీడీ) కింద కొండపల్లి బొమ్మల కళాకారుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దడంతో పాటు ఈ కళను తరతరాలకు వారసత్వ సంపదగా అందించేందుకు కృషిచేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎస్‌పీఏ అసిస్టెంట్లు ప్రొఫెసర్లు డాక్టర్ ఆర్ఎన్ఎస్ మూర్తి, డాక్టర్ డీ జగత్ కుమారి పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకానికి ప్రతినెలా ఆర్టీసీకి డబ్బులు చెల్లించాలి

● ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

బస్‌స్టేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీ శక్తి పథకానికి సంబంధించి ఆర్టీసీకి ప్రతినెల డబ్బులు చెల్లించాలని ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. సోమవారం విజయవాడలోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా యూనియన్ నిర్మాణ మహాసభ జరిగింది. సభకు ముఖ్య అతిథిగా దామోదరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ కృషి చేస్తుందన్నారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఏకే సాగర్, కార్యదర్శిగా జీఎం రావుతో పాటు 18మందితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్, రాష్ట్ర నేతలు ఎండీఏ సిద్ధిక్, కే బాలాజీ, టీవీ భవానీ, మందపాటి శంకర్‌రావు, ఎస్కే మొహిద్దీన్, ఎస్ఎస్ నారాయణ, చక్రవర్తి, జీవీఎస్ నారాయణ, విజయవాడ జోన్ జోనల్ కార్యదర్శి వై శ్రీనివాసరావు, డిపోలు, కమిటీ ప్రతినిధులు, మహిళా నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు


మంత్రి గుమ్మడి సంధ్యారాణి, సంగీత దర్శకుడు తమన్, హీరో సుధీర్‌కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేస్తున్న ఈవో, పాలకమండలి సభ్యులు

దుర్గమ్మ సన్నిధిలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రి, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కనకదుర్గమ్మను సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈవో శీనా నాయక్, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచన మండపంలో అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఈవో శీనా నాయక్, టెంపుల్ సూపరింటెండెంట్ చందు శ్రీను, పాలకమండలి ప్రత్యేక ఆహ్వానితుడు వెలగపూడి శంకర్ బాబు వారికి అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రం, లడ్డూప్రసాదాలను అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు తమన్, యాంకర్, హీరో సుడిగాలి సుధీర్ ఉన్నారు.


లడ్డూపోటులో లడ్డూల నాణ్యతను పరిశీలిస్తున్న చైర్మన్, సభ్యులు

పనులు త్వరగా పూర్తి చేయాలి

● అన్నదాన విభాగం, లడ్డూపోటు పరిశీలించిన పాలకమండలి

ఇంద్రకీలాద్రి, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి): దేవాలయంలోని పలువిభాగాలను దుర్గగుడి పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ట్రస్ట్‌బోర్డు సభ్యులు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనం, లడ్డూపోటును, కనకదుర్గనగర్‌లోని దుకాణాలు, అర్జునవీధిలోని అన్నదాన విభాగం, లడ్డూ తయారీ విభాగాలను పరిశీలించి అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలుత అన్నదాన భవనం, లడ్డూ ప్రసాద పోటును పరిశీలించి పనులు ఏమేరకు జరుగుతున్నాయోనని ఇంజనీరింగ్ విభాగ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని అధికారులను సూచించారు. కనకదుర్గనగర్‌లో ఫుట్‌పాత్‌పై పూజాసామగ్రి ఏర్పాటు చేసి భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. అర్జునవీధిలోని అన్నదాన విభాగాన్ని పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు లడ్డూ ప్రసాదం తయారీ గురించి అధికారులు, సిబ్బందిలను అడిగి తెలుసుకున్నారు. తొలుత మహామండపం 7వ అంతస్తులోని చైర్మన్ చాంబర్‌లో ట్రస్ట్‌బోర్డు సమావేశం జరిగింది. చైర్మన్‌తో పాటు సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, బడేటి ధర్మారావు, గూడపాటి వెంకటసరోజిని దేవి, హరికృష్ణ, మన్నే కళావతి, పద్మావతి ఠాగూర్, పెనుమత్స రాఘవరాజు, సుకాశి సరిత, తంబళ్లపల్లి రమాదేవి, ఎక్స్ ఆఫిషియో, ప్రధాన అర్చకుడు ఎల్‌డీపీ దుర్గాప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితులు మార్తి రామబ్రహ్మం, వెలగపూడి శంకర్‌బాబు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

కథే ఈ సినిమాకు హీరో


దేవన్


దేవన్ కథా నాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది


దీక్షిత్ శెట్టి

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్ర్కిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.

కాసుల గలగల.. వజ్రాల మిలమిల


టీమిండియాకు భారీ నజరానాలు

ముంబై: దేశ మహిళా క్రికెట్ చరిత్రలో తొలి వన్డే ప్రపంచకప్ అందించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేనపై కాసుల వర్షం కురుస్తోంది. కప్ గెల్చినందుకు విజేతకు ఐసీసీ అందించే రూ.40 కోట్ల రూపాయలకు తోడు, బీసీసీఐ తమ వంతుగా రూ.51 కోట్లు ప్రకటించింది. జట్టు సభ్యులు, సహాయ సిబ్బంది, వారిని ఎంపిక చేసిన సెలెక్షన్ కమిటీకి కలిపి ఈ నగదు పురస్కారాన్ని అందించనున్నట్టు బీసీసీఐ సోమవారం వెల్లడించింది. ఇక, పేసర్ రేణుక సింగ్ ఠాకూర్‌కు హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోటి నగదు బహుమతిని, ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వనున్నట్టు ప్రకటించారు. అలాగే మధ్యప్రదేశ్‌లోని ఛతర్పూర్‌కు చెందిన మీడియం పేసర్ క్రాంతి గౌడ్‌కు కోటి నగదు పురస్కారాన్ని ప్రదానం చేయనున్నామని ఆ రాష్ట్ర సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు.

వజ్రాలు పొదిగిన నగలు: టీమిండియా క్రికెటర్లకు వజ్రాలు పొదిగిన నగలతో పాటు వారందరి ఇంటిపైన ఉచితంగా సోలార్ ప్యానెల్స్ అమరుస్తామని సూరత్‌కు చెందిన పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యుడు గోవింద్ ధోలాకియా ప్రకటించారు. జట్టు సభ్యులందరిని సన్మానించి, వజ్రాల నగలను బహూకరించే అవకాశం ఇవ్వాలని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాకు గోవింద్ లేఖ రాశారు.

విజయ గీతాలాపనలో..

వరల్డ్‌కప్ గెలిచిన ఆనందంలో భారత మహిళా ఆటగాళ్లు డీవై పాటిల్ మైదానంలో అంతులేని సంబరాల్లో మునిగారు. దీంట్లో భాగంగా కోచ్ మజుందార్‌తో కలిసి పిచ్ దగ్గరికి వెళ్లి తమ టీమ్ సాంగ్‌ను ఆలపించారు. 'సాత్ మే ఛలేంగే.. సాత్‌మే ఉఠేంగే.. హమ్ హై టీమిండియా' అంటూ సాగే ఈ పాటను చప్పట్లు చరుస్తూ వీరంతా హుషారుగా ఆలపించారు. బీసీసీఐ ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.



ఇది ఆరంభం మాత్రమే..

వరల్డ్‌కప్‌లో చాంపియన్‌గా నిలవడంతో అంతా అయిపోలేదు. ఇది మాకు ఆరంభం మాత్రమే. ఇప్పుడు మా ముందున్న లక్ష్యం ఇలాంటి విజయాలను అలవాటు చేసుకోవడమే. ప్రస్తుత గెలుపు కోసం దశాబ్దాలుగా ఎదురుచూసి చివరకు సాధించాం. ఇక ముమ్ముందు మరిన్ని పెద్ద ఈవెంట్స్ రాబోతున్నాయి. అందుకే మేమింకా రాటుదేలాలనుకుంటున్నాం.

– హర్మన్‌ప్రీత్ కౌర్

ప్రధానితో సమావేశం రేపు

న్యూఢిల్లీ: వరల్డ్‌కప్ చాంపియన్‌గా నిలిచిన భారత మహిళల జట్టు ప్రధాని నరేంద్ర మోదీని కలవనుంది. హర్మన్ నేతృత్వంలోని ఆటగాళ్లంతా ఈనెల 5న న్యూఢిల్లీలోని ప్రధాని నివాసానికి వెళ్లనున్నారు. దీంతో ప్రస్తుతం ముంబైలో ఉన్న జట్టంతా మంగళవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకోనుంది.

విక్టరీ పరేడ్ లేనట్టే..

గతేడాది టీ20 వరల్డ్‌కప్ గెలిచాక భారత పురుషుల జట్టు ముంబైలో విక్టరీ పరేడ్ చేసిన విషయం తెలిసిందే. అదే రీతిన హర్మన్‌ప్రీత్ బృందానికి కూడా విజయోత్సవ ర్యాలీ ఉంటుందని అభిమానులు ఆశించారు. కానీ ప్రస్తుతానికి అలాంటి ఆలోచనేమీ లేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తేల్చాడు. మంగళవారం నుంచి దుబాయ్‌లో జరిగే ఐసీసీ మీటింగ్‌పైనే ప్రస్తుతం బోర్డు దృష్టి ఉందని, ఆ తర్వాతే ఓ నిర్ణయానికి వస్తామని తెలిపాడు.

వన్డే వరల్డ్ కప్ టైటిల్ విజయంతో అంతర్జాతీయ మహిళా క్రికెట్‌పై భారత్ ఆధిపత్యం చెలాయించే స్థాయికి చేరింది. బలమైన జట్లు పోటీపడిన ప్రపంచ కప్‌లో టైటిల్ గెలవడం ఆషామాషీ కాదు. అయితే సవాళ్లను ఎదుర్కోవడం విశ్వవిజేత భారత జట్టులోని క్రికెటర్లకు కొత్తకాదు. ఎన్నో క్లిష్ట పరిస్థితులను, సమస్యలను అధిగమించి తమ క్రికెటర్ కెరీర్‌ను వారు తీర్చిదిద్దుకున్న తీరు స్ఫూర్తిదాయకం.



కష్టాలకోర్చి.. లక్ష్యాన్ని చేరి..

చాంపియన్ల త్యాగాల గాథలు

ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం

నాన్న కలను నెరవేర్చి..



హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన పేసర్ రేణుకా సింగ్ తండ్రికి క్రికెట్ అంటే పిచ్చి అభిమానం. తన ఫేవరెట్ క్రికెటర్ వినోద్ కాంబ్లీ పేరును అతడు తన కుమారుడికి పెట్టాడు. రేణుకకు మూడేళ్ల వయస్సులో తండ్రి మరణించాడు. తండ్రి ఆకాంక్ష మేరకు రేణుకను క్రికెటర్‌గా తీర్చిదిద్దే బాధ్యతను తల్లి సునీత, సోదరుడు వినోద్ తీసుకున్నారు. తొలుత గ్రామంలో బాలుర జట్లతో క్రికెట్ ఆడిన రేణుక..బంధువు భూపిందర్ సలహాతో ధర్మశాలలోని హిమాచల్ క్రికెట్ సంఘం మహిళల రెసిడెన్షియల్ అకాడమీలో చేరి తన క్రికెట్ నైపుణ్యాలకు పదును పెట్టుకుంది.



మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లాలోని గిరిజన నగర పంచాయతీ గువారాలో పుట్టింది క్రాంతి గౌడ్. ఆమె తండ్రి రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్.

నగలు కుదువపెట్టి..

ఆరుగురు పిల్లల్లో క్రాంతి చివరిది. సోదరులు టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడుతుండడం చూసి ఆమె ఆటపట్ల ఆకర్షితురాలైంది. క్రాంతిలో సహజసిద్ధమైన అథ్లెట్ లక్షణాలున్నాయని గమనించిన కోచ్ రాజీవ్ బిల్తారే ఆమెకు శిక్షణ ఇప్పించాలని అనుకున్నాడు. కానీ ఆడపిల్ల క్రికెట్ ఆడడమా..అని క్రాంతి కుటుంబం అందుకు అంగీకరించలేదు. అయితే క్రాంతికి తల్లి అండగా నిలిచింది. శిక్షణకు అవసరమైన డబ్బుల కోసం తన నగలు సైతం ఆమె కుదువ పెట్టింది.

కూరగాయలు అమ్మి..



స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ రాధా యాదవ్ ముంబైలో పుట్టింది. తండ్రి కూరగాయలు అమ్ముతూ జీవనం సాగించేవాడు. ఇంటి పరిసర ప్రాంతాల్లో క్రికెట్ ఆడుతుండే రాధ..కోచ్ ప్రఫుల్ నాయక్ కంటపడింది. ఆమె బ్యాటింగ్ నైపుణ్యాలను గమనించిన ప్రఫుల్..రాధ తండ్రిని ఒప్పించి తనతోపాటు బరోడా తీసుకు వెళ్లాడు. అక్కడ శిక్షణ ఇప్పించి ఆమెను జాతీయస్థాయి క్రికెటర్‌గా తీర్చిదిద్దాడు.

తండ్రి తయారు చేసిన బ్యాట్‌తో..



మొహాలీకి చెందిన అమన్‌జోత్ కౌర్ తండ్రి కార్పెంటర్. అమన్‌కు బ్యాట్‌లేదంటూ స్థానిక బాలురు కొందరు ఆమెను తమతో ఆడేందుకు నిరాకరించారు. దాంతో అమన్‌జోత్ తండ్రి స్వయంగా ఓ బ్యాట్ తయారు చేసి ఆమెకు ఇచ్చాడు. 14 ఏళ్ల వయస్సులో రాధను కోచ్ నగేశ్ గుప్తా వద్ద చేర్పించాడు. అతడి కోచింగ్‌లో అమన్ తన నైపుణ్యాలకు మరింత సొబగులు అద్దుకుంది.

ఆ త్రో మార్చేసింది..



దీప్తి శర్మ సోదరుడు సుమీత్ ఉత్తర ప్రదేశ్ జట్టు పేసర్. దాంతో అతడు ఆడే అన్ని మ్యాచ్‌లకు దీప్తి వెళ్లేది. ఓసారి తన వద్దకు వచ్చిన బంతిని బుల్లెట్‌లా దీప్తి త్రో చేయడం భారత జట్టు మాజీ క్రికెటర్ హేమలత కంటపడింది. ఆమెలో క్రికెటర్ అయ్యే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని సుమీత్‌కు హేమలత సూచించింది. అలా దీప్తి ఆటలోకి అడుగుపెట్టింది.

నానమ్మ అనారోగ్యాన్ని దాచాం

అమన్ తండ్రి

వరల్డ్‌కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా కెప్టెన్ వోల్వార్ట్ క్యాచ్‌ను అమన్‌జోత్ అద్భుతంగా పట్టేసి మ్యాచ్‌ను మనవైపు తిరిగేలా చేసింది. అయితే అమన్ టోర్నీపైనే దృష్టి పెట్టేందుకు తన నానమ్మ అనారోగ్యాన్ని కుటుంబసభ్యులు తెలియనీయలేదట. 'అమన్‌జోత్ కెరీర్ ఆరంభంలో నా తల్లి నిరంతరం తనకు మద్దతిచ్చేది. అమన్ వీధుల్లో, పార్కుల్లో ఆడేటప్పుడు వెంటే ఉండి గమనించేది. అయితే గత నెలలో ఆమెకు గుండెపోటు వచ్చింది. కొన్ని రోజులుగా చికిత్స కోసం మేమంతా ఆస్పత్రిలోనే గడుపుతున్నాం. అయితే ఈ విషయాలేమీ అమన్‌కు చెప్పకుండా దాచాం. ఇప్పుడీ విజయం తన నానమ్మ ఆరోగ్యాన్ని కుదుటపరుస్తుందని ఆశిస్తున్నాం' అని అమన్ తండ్రి భూపిందర్ సింగ్ తెలిపాడు.



నిరాదరణ నుంచి జగజ్జేతగా..

- సాధారణ బోగీల్లో ప్రయాణాలు
- సొంత బ్యాట్ కూడా లేని దుస్థితి

దేశంలో ఎక్కడ చూసినా భారత మహిళల క్రికెట్ జట్టు విశ్వకప్ సంబరాలే.. అటు చూస్తే హర్మన్‌ప్రీత్ సేనపై కాసుల వర్షం కురుస్తోంది. ఆ మాటకొస్తే, ఈ తరం మహిళా క్రికెటర్లకు గత కొంతకాలంగా పురుష క్రికెటర్లతో సమానంగా వేతనాలు లభిస్తున్నాయి. కొందరు ఎండార్స్‌మెంట్లతో కోట్లు సంపాదన కళ్లజూస్తున్నారు. జట్టు ఎక్కడికి వెళ్లినా బిజినెస్ క్లాసుల్లో ప్రయాణిస్తూ, ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస చేస్తోంది. ఇదంతా నేటి తరం క్రికెట్ అభిమానులకు మామూలుగానే అనిపిస్తుండొచ్చునేమో కానీ ఓ దశాబ్ద కాలం వెనక్కి వెళితే భారత మహిళా క్రికెటర్లు ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొన్నారో తెలుస్తుంది.

చందాలతో పర్యటనలకు..

1973 నుంచి 2006 వరకు భారత మహిళల క్రికెట్ సంఘం (డబ్ల్యూసీఏఐ) ఆధ్వర్యంలో అమ్మాయిల జట్టు నడిచేది. ఆటగాళ్ల ఎంపికను కూడా ఈ సంఘమే చూసేది. అయితే టూర్లకు వెళ్లాలంటే మాత్రం చేతిలో డబ్బుండేది కాదు. దీంతో రైళ్లలో జనరల్ బోగీల్లోనే ప్రయాణించేవారు. ఆడినందుకు మ్యాచ్ ఫీజులుండేవి కావు. అటు అంతర్జాతీయ మహిళల క్రికెట్ మండలి (ఐడబ్ల్యూసీసీ) సైతం తమ సభ్యదేశాలకు నయా పైసా ఇచ్చేది కాదు. కేవలం ఆటపై అమితాసక్తి, ప్రేమతోనే అప్పటి ప్లేయర్లు క్రికెట్ టోర్నీల్లో ఆడేవారు. ఓసారి న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడి హోటళ్లలో బస చేసేందుకు డబ్ల్యూసీఏఐ దగ్గర డబ్బులు లేకపోతే.. స్థానిక భారతీయుల నివాసాల్లో సర్దుకోవాల్సి వచ్చింది. మరోసారి ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లాల్సిన పరిస్థితిలో మాజీ ప్రెజెంటర్ మందిరా బేడీ సహాయపడింది. ఓ డైమండ్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నందుకు తనకు లభించిన మొత్తాన్ని డబ్ల్యూసీఏఐకి ఇవ్వగా, ఆ డబ్బుతోనే విమాన టిక్కెట్లు కొనుగోలు చేసి ప్లేయర్లను ఇంగ్లండ్‌కు పంపగలిగారు.

బ్యాట్లు కూడా పంచుకునేవారు



అప్పటి క్రికెటర్లకు సొంత కిట్ అనేది లగ్జరీ కిందే లెక్క. అందుకే బ్యాట్లను కూడా షేర్ చేసుకునేవారు. స్థానిక క్రికెట్ టోర్నీల్లో పాల్గొనేటప్పుడు ఆయా జట్ల దగ్గర మూడు బ్యాట్లే ఉండేవి. ఓపెనర్లు, వన్‌డౌన్ బ్యాటర్ ముందు వినియోగించేవారు. ఓపెనర్ అవుటైతే నాలుగో నెంబర్ ప్లేయర్ తన బ్యాట్, లెగ్ గార్డ్స్‌ను వాడేది. ఇక వీరుండే వసతి గృహాల్లో 20 మందికి కలిపి నాలుగు వాష్‌రూమ్స్‌ను వినియోగించుకునేవారు. నేలపైనే తమ సొంత దుప్పట్లు వేసుకుని పడుకునేవారు. 2005 వన్డే వరల్డ్‌కప్‌లో రన్నరప్‌గా నిలిచినందుకు ప్రైజ్‌మనీ లభించినా.. ఇప్పటి మాదిరిగా ప్రోత్సాహకాలూ వారికి దక్కలేదు.

ఇదీ భారత మహిళల క్రికెట్ ప్రస్థానం

బీసీసీఐ అండతో..

2006లో భారత మహిళా క్రికెట్ జట్టు బీసీసీఐ ఆధ్వర్యంలోకి రావడంతో నెమ్మదిగా పరిస్థితులు మారుతూ వచ్చాయి. ఆరంభంలో బోర్డు కూడా సీనియర్ జట్టుపైనే దృష్టి పెట్టింది. కానీ 2017 వన్డే వరల్డ్‌కప్ సెమీస్ మహిళల క్రికెట్‌లో కీలక మలుపుగా చెప్పవచ్చు. ఆసీస్‌పై హర్మన్‌ప్రీత్ అజేయంగా 171 రన్స్ బాదడంతో జనాల దృష్టి ఒక్కసారిగా అమ్మాయిల జట్టుపై పడింది. ఆ తర్వాత స్మృతి మంధాన తన బ్యాటింగ్ మెరుపులతో మరింత ఆదరణ తెచ్చింది. అటు బోర్డు కూడా మహిళల క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకోవడం.. వీరికి కూడా డబ్ల్యూపీఎల్ నిర్వహించడంతో ఆట స్వరూపమే మారిపోయింది. తొలితరం మహిళా క్రికెటర్లు ఎలాంటి ప్రోత్సాహం లేకపోయినా ఆటపై అంకితభావంతో ముందుకు సాగారు. వారిని ప్రేరణగా తీసుకున్న ఇప్పటి ఆటగాళ్లు తమ అసాధారణ నైపుణ్యాలతో భారత మహిళల జట్టును అత్యున్నత స్థాయికి చేర్చగలిగారు.

ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం

ఏపీ క్రీడా ప్రాజెక్టులకు 620 కోట్లు మంజూరు చేయండి!

కేంద్ర ప్రభుత్వానికి శాప్ చైర్మన్ రవినాయుడు విజ్ఞప్తి



న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో క్రీడాప్రాజెక్టుల అభివృద్ధి పనులకు సంబంధించి రూ.620 కోట్ల నిధులు మంజూరు చేయాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని మొత్తం 56 ప్రాజెక్టులను ఖేలో ఇండియా నిధులతో పూర్తి చేయాలని కోరారు. సోమవారం, కేంద్ర క్రీడల శాఖ సంయుక్త కార్యదర్శి వినీల్‌కృష్ణ రావెళ్లతో ఆయన కార్యాలయంలో రవినాయుడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలోని ఖేలో ఇండియా ప్రాజెక్టులపై పలు వినతిపత్రాలు అందించారు. విజయవాడలోని ఐజీఎంసీ మైదానాన్ని ఖేలో ఇండియా నిధులతో అభివృద్ధి చేయాలని విన్నవించారు. కాకినాడ డీఎస్‌ఏ, గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వద్ద నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా రెసిడెన్షియల్ సెంటర్ ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అదనంగా డిస్ట్రిక్ లెవెల్ ఖేలో ఇండియా సెంటర్‌లను నిర్మించాలని రవినాయుడు విన్నవించారు. తన విజ్ఞప్తులపై వినీల్‌కృష్ణ సానుకూలంగా స్పందించారని రవినాయుడు మీడియాకు తెలిపారు.

ఫాలోఆన్‌లో ఒడిశా

ఆంధ్రతో రంజీట్రోఫీ

కటక్: ఆంధ్రతో గ్రూప్ 'ఎ' రంజీట్రోఫీ మ్యాచ్‌లో ఒడిశా ఫాలోఆన్‌లో పడింది. దాంతో రెండో ఇన్నింగ్స్‌లో సోమవారం ఆట ముగిసే సరికి ఆతిథ్య జట్టు రెండు వికెట్లకు 190 పరుగుల స్కోరుతో పోరాడుతోంది. గౌరవ్ చౌదరి (79), గోవింద్ (4) క్రీజులో ఉన్నాడు. సందీప్ పట్నాయక్ (63), స్వస్తిక్ (36) అవుటయ్యారు. ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఒడిశా ఇంకా 134 పరుగులు వెనుకంజలో నిలిచింది. అంతకుముందు 80/4తో మూడోరోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఒడిశా 151 రన్స్‌కు ఆలౌటైంది. విజయ్, సాయితేజ, సౌరబ్ తలా మూడేసి వికెట్లు తీశారు. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 475/7 స్కోరుతో డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.

మన చరణి తిప్పేసింది



భయపడలేదు..

లీగ్ దశలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా చేతిలో మనం పరాజయం పాలయ్యాం. అయితే, ఆ ఫలితాలను మనసులో పెట్టుకొని సెమీస్, ఫైనల్లో వారితో తలపడినప్పుడు ఒత్తిడికి లోనుకాలేదు. ప్రధానంగా సెమీస్‌కు ముందు.. ఎన్నో వరల్డ్‌కప్‌లు గెలిచిన ఆసీస్‌పై భారత్ గెలుస్తుందా అనే చర్చలను జట్టుగా మేము అసలు పట్టించుకోలేదు. ఆస్ట్రేలియాను ఓడించి ఫైనల్‌కు మనం వెళ్తున్నాం అనే ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగాం. వారికంటే మెరుగ్గా ఆడి విజయం సాధించాం. ఇక, ఫైనల్లోనూ సొంత ప్రేక్షకుల మధ్య భారీ అంచనాలతో బరిలోకి దిగుతున్నామనే ఒత్తిడి, భయానికి లోను కాకుండా మా శక్తి వంచన లేకుండా కృషి చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం.

– శ్రీచరణి

కడప డైనమైట్ నల్లపురెడ్డి శ్రీచరణి మహిళల వన్డే ప్రపంచ కప్‌లో తన సత్తా ఏంటో నిరూపించింది. జట్టు కష్ట సమయాల్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తన చేతికి బంతి ఇచ్చిన ప్రతి సారి ఆమె నమ్మకాన్ని వమ్ము చేయకుండా కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టి ప్రశంసలు అందుకొంది. ఇరవై ఏళ్ల వయస్సులోనే ప్రతిష్ఠాత్మక వరల్డ్ కప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా అందులో అద్భుత ప్రదర్శన కనబర్చిన తెలుగమ్మాయి శ్రీచరణిపై ప్రత్యేక కథనం.

రాయలసీమలోని కడప జిల్లా, యర్రంపల్లి గ్రామానికి చెందిన శ్రీచరణి క్రికెట్ ప్రయాణం రాకెట్‌లా దూసుకెళ్తోంది. ఈ ఏడాది డబ్ల్యూపీఎల్‌తో మొదలై వన్డే ప్రపంచకప్ వరకు వరుస పెట్టి అవకాశాలు దక్కించుకుంటూ ప్రతి సందర్భంలోనూ తన ఎంపిక సరైనదేనని నిరూపించుకుంది ఈ తెలుగమ్మాయి. ప్రపంచకప్‌లో చరణి మొత్తం తొమ్మిది మ్యాచ్‌లాడి 14 వికెట్లు పడగొట్టింది. మొత్తంగా 4.96 ఎకానమీతో అత్యంత పొదుపుగా బౌలింగ్ చేసింది. వరల్డ్‌కప్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్ల జాబితాలో దీప్తి శర్మ 22 వికెట్లతో (5.52 ఎకానమీ) అగ్రస్థానం దక్కించుకోగా, చరణి నాలుగో స్థానంలో నిలిచింది.

సీనియర్లకు దీటుగా..: విశాఖపట్నం వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో 331 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకోవడంలో భారత బౌలర్లందరూ విఫలమైన చోట చరణి తన దమ్ము చూపించింది. ఇక చావో రేవో తేల్చుకోవాల్సిన ఫైనల్లో కూడా దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్‌తో సహా టాపార్డర్ బ్యాటర్లంతా చరణి బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ఆపసోపాలు పడ్డారు.

పూజలు ఫలించాయి..



దేశానికి తొలి మహిళల వరల్డ్‌కప్ అందించిన భారత జట్టులో మా అమ్మాయి సభ్యురాలిగా ఉండడం మా అదృష్టం. మేము చేసిన పూజలు ఫలించాయి. ఈ ప్రపంచకప్‌లో చరణి ఆట తీరు పట్ల చాలా సంతోషంగా ఉన్నాం. దేశం మొత్తం మా బిడ్డను పొగుడుతుంటే ఆనందంగా ఉంది.

– చంద్రశేఖర్ రెడ్డి (శ్రీచరణి తండ్రి)

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి–హైదరాబాద్)

లలిత్, రిత్విక్ పరాజయం

చెస్ ప్రపంచ కప్

పనాజీ (గోవా): ఫిడే వరల్డ్‌కప్‌లో తెలుగు జీఎంలు లలిత్ బాబు, రాజా రిత్విక్ పోరాటం ముగిసింది. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లోని రెండు క్లాసిక్ గేమ్‌లను ఈ ఇరువురు డ్రా చేసుకోవడంతో సోమవారం టైబ్రేకర్ నిర్వహించారు. ఇందులో ఇద్దరూ పోరాడి ఓడారు. జీఎం లలిత్ బాబు (విజయవాడ) ర్యాపిడ్ రెండు గేములను కూడా డ్రా చేయడంతో తొలుత 2-2తో వామర్‌డామ్ (నెదర్లాండ్స్)తో సమంగా నిలిచాడు. ఆ తర్వాత నిర్వహించిన రెండో టైబ్రేకర్ బ్లిట్జ్‌లో ఓడి 3-5తో పోటీల నుంచి నిష్క్రమించాడు. రాజా రిత్విక్ (కరీంనగర్) ర్యాపిడ్ రెండు గేములను డ్రా చేసుకుని 2-2తో నోజర్‌బెక్ (కజకిస్థాన్)తో సమంగా నిలవగా ఆ తర్వాత జరిగిన రెండో టైబ్రేకర్ బ్లిట్జ్‌లో ఓడి 3-5తో పోటీల నుంచి తప్పుకున్నాడు. ఇతర భారత గ్రాండ్‌మాస్టర్లలో తెలుగు క్రీడాకారుడు కార్తీక్‌తో పాటు సూర్య శేఖర్ గంగూలీ, వి.ప్రణవ్, రౌనక్, ప్రాణేష్, ఇనియాన్ రెండో రౌండ్‌కు అర్హత సాధించారు. ఇక, తొలి రౌండ్‌లో బై లభించిన స్టార్ ప్లేయర్లు గుకేష్, ప్రజ్ఞానంద, అర్జున్ రెండో రౌండ్‌లో పోటీ పడనున్నారు.

ఓటర్ల సమస్యకు సత్వర పరిష్కారం!

» పోలింగ్ బూత్ స్థాయి అధికారికి ఫోన్‌లో సమస్యలు చెప్పొచ్చు

» సైట్‌లో 'బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌వో' ఆప్షన్.. 48 గంటల్లో ఫోన్ కాల్

» రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ వెల్లడి

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఓటర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) కొత్త సదుపాయాన్ని ప్రారంభించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో 'బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌వో' అనే కొత్త ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లు https://ecinet.eci.gov.in వెబ్‌సైట్, లేదా ఈసీఐ మొబైల్ యాప్‌లోని హోంపేజీలో ఉన్న ఓటరు సేవల విభాగంలోకి వెళ్లి 'బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌వో' అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఈసీ వద్ద ఓటరు రిజిస్టర్ చేసిన మొబైల్ నంబరు, ఈ-మెయిల్ లేదా ఎపిక్ నంబర్ ద్వారా లాగిన్ కావొచ్చు. తర్వాత రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గాన్ని ఎంచుకుని, పార్ట్ నంబర్‌ను సెలెక్ట్ చేయాలి. దీంతో సంబంధిత బీఎల్‌వో వివరాలు కనిపిస్తాయి, అక్కడ బీఎల్‌వో పేరు, మొబైల్ నంబరు ఇచ్చి 'సెండ్ ఓటీపీ' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఓటీపీ ధ్రువీకరించిన వెంటనే కాల్ అభ్యర్థన బీఎల్‌వోకు చేరుతుంది. తర్వాత 48 గంటలలోపు బీఎల్‌వో స్వయంగా ఓటరును సంప్రదించి సమస్య తెలుసుకుని పరిష్కరిస్తారు. ఈ ఫీచర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను, ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ ఆదేశించారు. ఓటర్ల నుంచి వచ్చిన ప్రతి అభ్యర్థనకు తక్షణమే స్పందన ఇవ్వాలని, 48 గంటల్లో సమస్యను పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు.

1,49,302 హెక్టార్లలో పంటనష్టం!

» ఎన్యూమరేషన్ తర్వాత పెరిగిన నష్టం అంచనాలు

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న వ్యవసాయ పంటల నష్టం అంచనా పెరిగింది. 1,38,391 హెక్టార్లలో పంటలు మునిగాయని వ్యవసాయశాఖ తొలుత ప్రాథమికంగా అంచనా వేయగా, గత ఐదు రోజులుగా క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ చేశాక నష్టం అంచనా దాదాపు 11వేల హెక్టార్లు పెరిగి... 1,49,302 హెక్టార్లకు చేరినట్లు సోమవారం రాత్రికి అధికారులు నమోదు చేశారు. కర్నూలు, శ్రీసత్యసాయి జిల్లాలు మినహా 24జిల్లాల్లో 387మండలాల్లోని 3,849 గ్రామాల్లో అధికారులు ఎన్యూమరేషన్ పూర్తిచేశారు. అత్యధికంగా కోనసీమ జిల్లాలో 29,322 హెక్టార్లు, కృష్ణాలో 23,980, కాకినాడలో 20,791, తూర్పుగోదావరిలో 13,629 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారులు తేల్చారు. నష్టపోయిన రైతులజాబితాలను ఎప్పటికప్పుడు రైతుసేవాకేంద్రాల్లో సోషల్ ఆడిట్ కోసం ప్రదర్శిస్తున్నారు. అభ్యంతరాలు, విజ్ఞప్తులను స్వీకరిస్తున్నారు.

సీపీడీసీఎల్‌కు 10 కోట్ల నష్టం

» నేడు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సీఎండీ, డైరెక్టర్ల పర్యటన

గుంటూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోనున్న ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ సీపీడీసీఎల్)కు రూ.10 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనాలు తయారు చేశారు. బలమైన గాలులకు ప్రధానంగా కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఫీడర్లు, సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. డిస్కం పరిధిలో 965 సబ్‌స్టేషన్లు ఉండగా 200 సబ్ స్టేషన్లు దెబ్బతిన్నాయని, 450 ఫీడర్లు ఉండగా వాటిలో 100 ఫీడర్లు దెబ్బతిన్నాయని, 3 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా 700 దెబ్బతిన్నాయని నివేదికలు రూపొందించారు. ఇందులోభాగంగా.. మచిలీపట్నం, ఉయ్యూరు డివిజన్‌తోపాటు బాపట్ల జిల్లాలోని పలుప్రాంతాల్లో మంగళవారం సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణయాదవ్ పర్యటించనున్నారు.

వైసీపీ హయాంలో అవినీతిపై 17లోగా నివేదిక!

» అధికారులకు అసెంబ్లీ హౌస్ కమిటీ ఆదేశం

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఆప్కాబ్, డీసీసీబీలు, పీఏసీఎస్‌లలో జరిగిన అవినీతి, అవకతవలపై ఈనెల 17వ తేదీలోగా పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని అధికారులను అసెంబ్లీ ప్రత్యేక హౌస్ కమిటీ ఆదేశించింది. సహకార సంస్థలపై దర్యాప్తు కోసం ఏర్పాటైన హౌస్ కమిటీ సమావేశాన్ని సోమవారం అసెంబ్లీ కాన్ఫరెన్స్ హాలులో కమిటీ ఛైర్మన్ ఎస్.అమర్నాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. 2019-2024 మధ్య ఆప్కాబ్, డీసీసీబీలు, పీఏసీఎస్‌లలో జరిగిన అవినీతి, అవకతవలపై వాడీవేడి చర్చ జరిగింది. 17వ తేదీలోగా పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని సహకారశాఖ కమిషనర్ అహ్మద్‌బాబు, ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డిలను హౌస్ కమిటీ ఆదేశించింది. కమిటీ సభ్యులైన ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, బూర్ల రామాంజనేయులు, యార్లగడ్డ వెంకట్రావు, తెనాలి శ్రావణ్‌కుమార్, బొలిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు.

అన్ని జిల్లాల్లో 400 కేవీ సబ్‌స్టేషన్లు!

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 400 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని శాసనసభ ప్రభుత్వరంగ సంస్థల కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడలోని విద్యుత్ సౌధలో పీయూసీ కమిటీ సభ్యులు, ఏపీ ట్రాన్స్‌కోతోపాటు నెడ్‌క్యాప్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ఆస్తులకు ఎప్పటికప్పుడు మార్కెట్ ధర ప్రకారం విలువ కట్టాలని సూచించారు. తద్వారా ఆస్తుల విలువ ప్రకారం రుణం ఎక్కువగా రావడంతోపాటు వడ్డీ తగ్గుతుందని తెలిపారు. సిబ్బంది నియామకాలు, ఖాళీలతోపాటు, భవిష్యత్తులో నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రాజెక్టుల గురించి కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో కమిటీ సభ్యులు గిడ్డి సత్యనారాయణ, వర్ల కుమార్ రాజా, తెనాలి శ్రావణ్ కుమార్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, విద్యుత్ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు 5వేల కోట్ల రుణం!

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉత్పత్తి కోసం బొగ్గు కొనుగోలు, అత్యవసర సమయాల్లో విద్యుత్ కొనుగోలు, ఇతరత్రా అవసరాలకుగాను హడ్కో నుంచి రూ.5వేల కోట్ల రుణం తీసుకునేందుకు ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్ణయించింది. ఈ రుణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వనుంది. ఈ మేరకు సోమవారం జీవో నంబరు 88ను విడుదల చేశారు.

సబ్సిడీల కోసం డిస్కంలకు రూ.2,637 కోట్లు

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉచిత విద్యుత్, ఇతరత్రా సబ్సిడీలకుగాను డిస్కంలకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపింది. 2025-26 ఆర్థికసంవత్సరం మూడో క్వార్టర్‌కు రూ.2,637 కోట్లను విడుదల చేయాలని నిర్ణయించింది.

రాయితీ బకాయిలు పూర్తిగా చెల్లించాలి: సీపీఐ

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈ యూనిట్లు నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు చెల్లించాల్సిన రూ.1200 కోట్ల పెండింగ్ రాయితీ బకాయిల సొమ్మును తక్షణమే విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రికి ఆయన లేఖ రాశారు.

7న 'వందేమాతరం' సామూహిక ఆలాపన

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా కేంద్రం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి కల్చరల్ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావును రాష్ట్ర ప్రభుత్వం నోడల్ అధికారిగా నియమించింది. ఈ మేరకు జీఏడీ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కేంద్ర ప్రభుత్వం నవంబరు 7న దేశవ్యాప్తంగా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆ రోజున ఉదయం 10 గంటలకు 'సామూహికంగా వందేమాతరం ఆలాపన' నిర్వహించాలని నిర్ణయించింది. పబ్లిక్ ప్రదేశాలు, విద్యాసంస్థలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు టీచర్లు, డాక్టర్లు, పోలీసులు, డ్రైవర్లు, షాప్‌కీపర్లు ఇలా అందరినీ భాగస్వామ్యం చేయనున్నారు. ఈ కార్యక్రమ ముందస్తు ఏర్పాట్లు కోసం నవంబరు 4న నిర్వహించే కార్యక్రమానికి అన్ని రాష్ట్రాల నోడల్ అధికారులు హాజరుకావాలని సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రం నుంచి మల్లికార్జునరావు నోడల్ అధికారిగా హాజరు అవుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆధారాలున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోలేదని ఏ దేవుడి ముందైనా ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. అదే తరహాలో వైసీపీ అధ్యక్షుడు జగన్ తాను నమ్మిన దేవుడి ముందు లిక్కర్ ముడుపులు తీసుకోలేదని ప్రమాణం చేస్తారా?' నకిలీ మద్యం కుంభకోణం తంబళ్లపల్లెలో మొదలైంది. టీడీపీ నాయకుడిపై కేసు పెడితే ఒకాయన విదేశాలకు వెళ్లిపోయారు. మరొకరు అరెస్టయ్యారు. ఈ కేసులో వైసీపీ నేతలున్నారని తెలిసి కూపీ లాగితే జోగి రమేశ్ వ్యవహారం బయటపడింది. రమేశ్ మాటలన్నీ రికార్డయ్యాయి. ఈ కేసులో కులాన్ని రాజకీయ లబ్ధికోసం వాడుకునేందుకు ప్రయత్నించడం ఏమిటి?' అని ప్రశ్నించారు.

జగన్ ఎందుకు రాలేదు?

"తప్పు చేస్తే నన్నైనా ముఖ్యమంత్రి చంద్రబాబు చట్టం ముందు దోషిగా నిలబెడతారు. మొంథా తుపాను, కర్నూలు బస్సు ప్రమాదం, శ్రీకాకుళం జిల్లా ఆలయంలో తొక్కిసలాట.. అన్ని ఘటనల్లోనూ ప్రభుత్వం వెంటనే స్పందించి తన కర్తవ్యాన్ని నిర్వహిస్తోంది. తుపాను సమయంలో సీఎం, నేను, మంత్రులు సమష్టిగా పనిచేసి ప్రాణ, ఆస్తి నష్ట నివారణ కోసం కష్టపడ్డాం. జగన్ బెంగళూరులో ఉంటూ తుపాను ప్రభావం తగ్గాక తాడేపల్లికి వచ్చి ముఖ్యమంత్రి సృష్టించిన విపత్తుగా విమర్శలు చేయడం ఏమిటి? ఈ మూడు ఘటనలపై అసెంబ్లీలో చర్చకు రావాలంటూ జగన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ చేస్తే ఎందుకు రావడం లేదు? శ్రీకాకుళం జిల్లాలో తొక్కిసలాట సమాచారం తెలియగానే ఎమ్మెల్యే గౌతు శిరీష సహా మంత్రి అచ్చెన్న అక్కడికి చేరుకున్నారు. ఆ తర్వాత నేను, మంత్రి అనిత, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కూన రవికుమార్ తదితరులంతా బాధితులకు అండగా నిలిచాం. పొరుగునే ఉన్న వైసీపీ నేత బొత్స సత్యనారాయణ వెంటనే ఎందుకు రాలేదు? జగన్ శ్రీకాకుళం జిల్లాలో ఘటనా స్థలికి ఎందుకు వెళ్లలేదు" అని లోకేశ్ నిలదీశారు. కాగా, ఎమ్మెల్యేల క్రమశిక్షణకు ఇకపై అత్యంత ప్రాధాన్యమిస్తామని లోకేశ్ అన్నారు.



విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుపై సమీక్షా సమావేశంలో మంత్రులు లోకేశ్, కొండపల్లి, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవి

410 ఒప్పందాలు.. 9,80,000 కోట్ల పెట్టుబడులు

» ఈ నెలంతా శంకుస్థాపనలు, ఎంవోయూలు

» వైసీపీ విద్వేషాలు రెచ్చగొడుతోంది: లోకేశ్

"ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని ఓడించి ఆ పార్టీని 11 అసెంబ్లీ సీట్లకే పరిమితం చేయడంతో ప్రజాకాంక్షేమిటో జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలు గ్రహించాయి. సుస్థిర పాలనను రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని పారిశ్రామికవేత్తలు గుర్తించినందునే 15 నెలల్లోనే 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. ఈ నెలంతా వరుసగా భారీ పరిశ్రమల శంకుస్థాపనలు, అవగాహనా ఒప్పందాలు ఉంటాయి. 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నాం. ఈ సదస్సులో రూ.9,80,000 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. 410 ఒప్పందాలు జరుగుతాయి. 12 బహుళ జాతి సంస్థలు వస్తున్నాయి. 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతారని సమాచారం ఇచ్చారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వనీ వైష్ణవ్, పీయూష్ గోయల్ హాజరవుతున్నారు. యువగళం యాత్రలో నేను రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కష్టపడుతున్నాం. అనకాపల్లి జిల్లాకు మిట్టల్ స్టీల్స్ ద్వారా లక్షన్నర కోట్ల పెట్టుబడులు రానున్నాయి. గూగుల్ డేటా సెంటర్ రూ.1,33,000 కోట్ల పెట్టుబడులు తీసుకురానుంది. బీపీసీఎల్ లక్షన్నర కోట్ల పెట్టుబడులు పెడుతోంది. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకునేందుకు వైసీపీ విద్వేషాలను రెచ్చగొడుతోంది. ఈ ప్రచారాలను పెట్టుబడిదారులు విశ్వసించడంలేదు. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని అమలు చేయడం వల్లే పెట్టుబడులు రాబట్టడంలో ముందంజలో ఉన్నాం. ఏ అంశంపైనా పట్టు, అవగాహన లేని జగన్ ముఖ్యమంత్రి ఎలా అయ్యారో?" అని లోకేశ్ అన్నారు.

మహిళా క్రికెటర్లకు ప్రోత్సాహకాలు

మహిళల క్రికెట్ ప్రపంచకప్ విజేత భారత జట్టులోని ఇద్దరు తెలుగు క్రికెటర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తామని లోకేశ్ చెప్పారు. సీఎం చంద్రబాబు లండన్ నుంచి తిరిగొచ్చిన వెంటనే ఆయనతో చర్చించి ప్రకటిస్తామని అన్నారు.

అంతా అయిపోయాక..
జగన్ రాక!

» నేడు కృష్ణాలో మాజీ సీఎం పర్యటన

» 'విడిది నేత' విమర్శల హోరుతో కదిలిన వైసీపీ నేత

అమరావతి/మచిలీపట్నం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 'బెంగళూరు విడిది నాయకుడి'గా ముద్రపడ్డ వైసీపీ అధ్యక్షుడు జగన్.. ఈ విమర్శల ధాటితో ఎట్టకేలకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి మంగళవారం బయటకు రానున్నారు. ఇటీవల వచ్చిన మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కృష్ణా జిల్లాలో దెబ్బతిన్న పంటలను పరిశీలించడంతో పాటు రైతులను పరామర్శించనున్నారు. తాడేపల్లి నుంచి ఉదయం 9.30 గంటలకు బయలుదేరి తొలుత పెనమలూరులోను, తర్వాత పెడన నియోజకవర్గంలోని గూడూరులోను పంటలను పరిశీలిస్తారు. కాగా, మొంథా తుఫాను రాష్ట్రం తలుపు తట్టకముందే బెంగళూరుకు వెళ్లిపోయిన జగన్.. తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గాక తాడేపల్లి నివాసానికి చేరుకున్నారు. దీంతో ఆయనను విడిది నాయకుడంటూ పలు పార్టీల నాయకులు విమర్శించారు. ఇక, "మొంథా చంద్రబాబు సృష్టించిన విపత్తు." అని జగన్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. అంతేకాదు, జగన్ వ్యాఖ్యలు వైసీపీకి తీవ్రనష్టం చేకూర్చాయని ఆ పార్టీ నేతలు అంతర్గత భేటీల్లో చర్చించుకున్నారు. ఈ నేపథ్యంలో జగన్ కృష్ణా జిల్లాలో రైతులను పరామర్శించేందుకు వెళ్లడం రాజకీయవర్గాల్లో ఆసక్తిగా మారింది.

కార్మికుల పని గంటల్లో మార్పులు

» రోజుకు 8 నుంచి 10 గంటలకు పెంపు

» చట్ట సవరణపై ఉత్తర్వులు.. 3 నుంచే అమలు

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్మికుల పని గంటల విషయంలో రాష్ట్రప్రభుత్వం కీలక మార్పులు చేసింది. రోజువారీ పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంచింది. అయితే వారానికి 48 గంటలకు మించకూడదన్న నిబంధన పెట్టింది. దీనివల్ల వారానికి ఐదు రోజులు విధులు నిర్వహించే వారికి కొంత మేలు జరగనుంది. వారం మొత్తంలో పని గంటలు 48 గంటలు దాటితే కార్మికులకు ఓటీ కింద అదనపు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్' చట్టానికి సవరణ చేసింది. సంబంధిత జీవోను కార్మిక శాఖ కార్యదర్శి ఎం.వి.శేషగిరి బాబు సోమవారం జారీచేశారు. మారిన పని గంటలు సోమవారం నుంచే అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొన్నటి వరకూ వారానికి 14 గంటలు, నెలకు 50గంటల అదనపు పనికి అవకాశం ఉంది. ఇప్పుడు క్వార్టర్‌కు (మూడు నెలలు) 144 గంటలే అదనపు పనికి అవకాశం కల్పించారు. మహిళా ఉద్యోగులకు సంబంధించీ కొన్ని కీలక మార్పులు చేశారు. ప్రస్తుతం మహిళలు రాత్రి సమయాల్లో డ్యూటీ చేయాలంటే సంబంధించిన షాపులు, కంపెనీలు కొన్ని ముఖ్యమైన ఏర్పాట్లు చేయాల్సి వచ్చేది. ఐదు మంది కంటే ఎక్కువ మహిళలు ఉంటేనే రాత్రి డ్యూటీలకు అనుమతిస్తారు. వారికి ప్రత్యేక టాయిలెట్లు, భోజన గది, వారి పిల్లల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి వచ్చేది. తాజా సవరణ ద్వారా వీటన్నింటినీ ప్రభుత్వం తొలగించింది. రాత్రి డ్యూటీ చేసేందుకు ఒక్క మహిళా ఉద్యోగికి కూడా అనుమతిచ్చింది.

పెట్టుబడులకు ఏపీ అనుకూలం

» దుబాయ్‌లో పారిశ్రామికవేత్తలతో మంత్రి నారాయణ భేటీ


దుబాయ్‌లో కేఈఎఫ్ హోల్డింగ్స్ ప్రతినిధులతో మంత్రి నారాయణ

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ అనుకూలమని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని దుబాయ్‌లో పారిశ్రామికవేత్తలను మంత్రి నారాయణ కోరారు. దుబాయ్ పర్యటనలో భాగంగా తొలి రోజు సోమవారం ఆయన పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సుకు రావాలని ఆహ్వానించారు. తొలుత దుబాయ్ ఇండియా కాన్సుల్ ప్రతినిధులు బీజీ కృష్ణన్, సెలీనా శశికాంత్‌తో మంత్రి నారాయణ బృందం భేటీ అయింది. ఆ తర్వాత శోభా గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విక్రమ్‌దత్తతో సమావేశమయ్యారు. అనంతరం భారత కాన్సుల్ జనరల్ సతీష్ శివన్‌తో లంచ్ మీటింగ్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ పర్యటనలో నారాయణతో పాటు సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్‌కుమార్ ఉన్నారు.

ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం: కొండపల్లి

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్న ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో రోడ్లు, విద్యుత్తు, నీటి వసతి తదితర మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యమిచ్చి త్వరగా పనులు పూర్తిచేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. 175 నియోజకవర్గాల్లో అభివృద్ధి చేస్తున్న ఎంఎస్‌ఎంఈ పార్కుల పనుల్లో పురోగతిపై ఎంఎస్‌ఎంఈ, ఏపీఐఐసీ అధికారులతో మంత్రి సోమవారం సమీక్ష సమీక్షించారు. పారిశ్రామికవేత్తలకు అనుమతులిచ్చే విషయంలో జాప్యం ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్, ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి సంస్థ సీఈవో విశ్వమనోహరన్ సమావేశంలో పాల్గొన్నారు.

20 వేల కోట్ల పెట్టుబడులకు హిందూజా సై

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా.. విశాఖలోని హిందూజా సంస్థకు ప్రస్తుతమున్న 1,050 మెగావాట్ల థర్మల్ ప్లాంట్‌ను అదనంగా మరో 1,600 మెగావాట్ల వరకు సామర్థ్యాన్ని పెంచనుంది. ఇక్కడ ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు కొత్త యూనిట్లను స్థాపిస్తుంది. రాయలసీమలో భారీ సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తుంది. ఆధునిక ఎలక్ట్రిక్ బస్సులు, తేలికపాటి వాణిజ్య వాహనాల తయారీ లక్ష్యంగా కృష్ణా జిల్లా మల్లవల్లిలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్ నెలకొల్పనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈవీ చార్జింగ్ నెట్‌వర్క్ తీసుకురానుంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపైన హిందూజా ప్రతినిధులు సంతకాలు చేశారు.


లండన్‌లో రోల్స్ రాయిస్ గ్రూప్ సీటీవో నిక్కీ గ్రేడీ స్మిత్, ఇతర ప్రతినిధులతో సమావేశమైన సీఎం చంద్రబాబు

రోల్స్ రాయిస్‌కు ఆహ్వానం

ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్, డీజిల్ ప్రొపెల్షన్ సిస్టమ్స్ తయారీలో అంతర్జాతీయ స్థాయిలో పేరున్న రోల్స్ రాయిస్ గ్రూప్ ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. సంస్థ సీటీవో నిక్కి గ్రేడి స్మిత్‌తో జరిగిన భేటీలో.. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఓర్వకల్లులో మిలటరీ ఎయిర్ స్ట్రిప్, విమానాల మెయింటెనెన్స్, రిపెయిర్, ఓవర్ హాలింగ్(ఎంఆర్‌ఓ) యూనిట్ ఏర్పాటుకు అవకాశాలున్నాయని తెలిపారు. ఏరో స్పేస్ విడిభాగాల ఉత్పత్తికి మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు. విశాఖ, తిరుపతిలో జీసీసీ(గ్లోబల్ కేపబుల్ సెంటర్) ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. భోగాపురం విమానాశ్రయం సమీపంలోనూ ఏవియేషన్ ఎకోసిస్టమ్, ఎమ్మార్వో ఫెసిలిటీ ఏర్పాటుకు అవకాశముందని వివరించారు.

పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీలు

ఎస్ఆర్ఏఎం, ఎంఆర్ఏఎం గ్రూప్ ఛైర్మన్ శైలేశ్ హీరానందానీ, శామ్కో హోల్డింగ్ లిమిటెడ్ ఛైర్మన్ సంపత్ కుమార్ మల్లాయతోనూ సీఎం సమావేశమయ్యారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను సీఎం వివరించారు. సెమీ కండక్టర్స్, ఆధునిక ప్యాకేజింగ్ యూనిట్ ఏర్పాటుకు ఎస్ఆర్ఏఎం, ఎంఆర్ఏఎం గ్రూప్ ఆసక్తి చూపింది. లండన్‌లో అతిపెద్ద విద్యుత్తు సరఫరా సంస్థ ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ క్రిస్ ఫిటార్డ్‌తో సీఎం భేటీ అయ్యారు. పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టాలని సీఎం వారిని ఆహ్వానించారు. క్లీన్ ఎనర్జీ, స్మార్ట్ గ్రిడ్, డేటా అనలిటిక్స్‌లో ఏపీలో పనిచేసేందుకు అవకాశాలు ఉన్నాయని వివరించారు..

టెక్నాలజీ రంగంలో అపార అవకాశాలు

ఏపీలో టెక్నాలజీ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. సీఐఐ ఆధ్వర్యంలో లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అమరావతిలో ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీలో ఏఐ వినియోగం, నిపుణులను తయారు చేసే అంశంతోపాటు ఎకో సిస్టమ్ అభివృద్ధికి అవకాశాలు పరిశీలించాలని కోరారు. అరుదైన భూగర్భఖనిజాల వెలికితీతపై వివిధ వర్సిటీలతో భాగస్వామ్యం, అవకాశాలు అందిపుచ్చుకొనే ఆస్కారం ఉందన్నారు. విశాఖలో ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్న భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఏఐ పాలసీ ల్యాబ్స్ ఫౌండర్ డైరెక్టర్ ఉదయ్ నాగరాజు, ఫ్లయిమెంట్ గ్రిడ్ ప్రెసిడెంట్ రత్న గారపాటి, బ్రిటీష్ హెల్త్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రతినిధి పాల్ బెంటన్, ఆరుప్ గ్లోబల్ అఫైర్స్ డైరెక్టర్ జేమ్స్ కెన్నీ, అల్తెరిన్ టెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫ్రెడీ వూలాండ్, ఫిడో టెక్, ఫిజీ పేపర్ కంపెనీ, నేషనల్ గ్రాఫైన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులే లక్ష్యంగా
కొండారెడ్డి డ్రగ్స్ దందా!

» పక్కా ప్లాన్‌తో విశాఖకు మాదకద్రవ్యాలు..

» వైసీపీ విద్యార్థి నేతకు భారీ నెట్‌వర్క్



విశాఖపట్నం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వైసీపీ విద్యార్థి విభాగం విశాఖ జిల్లా అధ్యక్షుడు పులగం కొండారెడ్డి డ్రగ్స్ దందా నడిపిస్తున్నట్టు స్పష్టమైంది. తాను బానిసై.. ఇతర విద్యార్థులను కూడా మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ వినియోగం, సరఫరా, విక్రయం కేసులో కొండారెడ్డి(23)ని అరెస్టు చేశారు. ఆయన సమకూర్చిన డబ్బు, విమానం టికెట్‌తో బెంగళూరు వెళ్లి అక్కడి నుంచి ఎల్ఎస్‌డీ బోల్ట్స్‌ను నగరానికి తీసుకువచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థితోపాటు డ్రగ్స్‌ను అందుకునేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లిన మరో విద్యార్థిని కూడా అరెస్టు చేశారు. ఈ మేరకు సోమవారం విశాఖ నగర డీసీపీ మేరీప్రశాంతి కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

ఎంబీఏ చదువుతూ.. డ్రగ్స్‌కు బానిసై..

మద్దిలపాలెం చైతన్యనగర్‌లో ఉంటున్న కొండారెడ్డి ఏయూలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొండారెడ్డికి సింథటిక్ డ్రగ్స్ తీసుకోవడం అలవాటు. వీటిని వివిధ ప్రాంతాల్లో కొనుగోలు చేసి కొంత తాను వినియోగించి, మిగిలింది ఇతర విద్యార్థులు, స్నేహితులకు విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలోనే కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలోని పెదపారుపూడి మండలం బేతవోలు గ్రామానికి చెందిన మూరాడ గీత్‌చరణ్(21)తో కొండారెడ్డికి పరిచయమైంది. చరణ్ నగరంలోని ఓ కాలేజీలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. కొండారెడ్డి బెంగళూరు నుంచి ఎల్ఎస్‌డీ బోల్ట్స్ డ్రగ్స్‌ను తెచ్చేందుకు చరణ్‌కు రూ.25 వేల నగదు, విమానం టికెట్ ఇచ్చి గత నెల 31న పంపించాడు. కొండారెడ్డి ఆదేశాల మేరకు సంథన్ అనే వ్యక్తి నుంచి 48 ఎల్ఎస్‌డీ(లైసెర్జిక్ యాసిడ్ డైథాల్ అమైడ్) బోల్ట్స్‌ను తీసుకున్న చరణ్ ఆదివారం ఉదయం రైలులో విశాఖ చేరుకున్నాడు.వాటిని అందుకునేందుకు కొండారెడ్డి, శ్రీకాకుళానికి చెందిన తంగి హర్షవర్ధన్‌నాయుడు వెళ్లారు. దీనిపై పక్కా సమాచారం మేరకు ఈగల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు గీత్‌చరణ్, కొండారెడ్డి, హర్షవర్ధన్‌ను అదుపులోకి తీసుకున్నారు. సంథన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. అతడికి డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి? కొండారెడ్డి వాటిని ఎవరెవరికి విక్రయిస్తున్నాడనే వివరాలు తెలుసుకునేందుకు ఆధారాలు సేకరిస్తున్నామని డీసీపీ తెలిపారు. కొండారెడ్డి విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గతంలోనూ డ్రగ్స్‌ను విక్రయించినట్టు కొందరు చెబుతున్నారని, ఆ కోణంలో కూడా విచారణ చేస్తున్నామని తెలిపారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్‌లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

దొనకొండలో అంతర్జాతీయ క్యాన్సర్ సెంటర్

» 25 ఎకరాల్లో 4,800 కోట్లతో ఏర్పాటు

విజయవాడ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా దొనకొండలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్యాన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం(డబ్ల్యూఎస్‌సీఎఫ్- సౌత్ కొరియా) అధ్యక్షుడు పీటర్ చున్ తెలిపారు. చున్ జాంగ్ యున్ చల్లా పేరుతో 25 ఎకరాల్లో రూ. 4,800 కోట్లతో ఈ సెంటర్‌ను నెలకొల్పనున్నట్లు వివరించారు. విజయవాడలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. చున్ జాంగ్ యున్ క్యాన్సర్ సెంటర్ ఇప్పటికే చెన్నైలో ప్రారంభించామని తెలిపారు. క్యాన్సర్ సెంటర్ విస్తరణలో భాగంగా మందుల తయారీ సైతం ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్న సమయంలో చల్లా గ్రూప్ అధినేత ప్రసాద్ సూచన మేరకు ఏపీలో తమ సేవలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఓమెక్సా బయోలజీస్, ఎంఏసీఈ, చల్లా గ్రూప్, ఐ హోల్డింగ్ కంపెనీల భాగస్వామ్యంతో ఈ క్యాన్సర్ సెంటర్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి ఉచితంగా ఆపరేషన్‌లు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాక ఈ క్యాన్సర్ సెంటర్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబు పిలుపు మేరకు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చామని, ఈ సెంటర్ ద్వారా 4 వేల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. చల్లా గ్రూప్ అధినేత చల్లా ప్రసాద్ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లోని పేదలకు ఈ క్యాన్సర్ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం భాగస్వామ్య సంస్థల మధ్య ఎంవోయులు జరిగాయి.

కర్నూలులో హైబ్రిడ్ ఎనర్జీ ప్రాజెక్టుకు ఆర్ఈసీ 7,500 కోట్ల ఆర్థిక సాయం

న్యూఢిల్లీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారడానికి భారీ ముందడుగు పడింది. కర్నూలు జిల్లాలో బ్రూక్‌ఫీల్డ్ అనుబంధ సంస్థ ఏర్పాటు చేసే హైబ్రిడ్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుకు రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ) రికార్డు స్థాయిలో రూ. 7,500 కోట్ల ఆర్థిక సాయాన్ని సోమవారం ప్రకటించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆ సంస్థ 400 మెగావాట్ల సోలార్ విద్యుత్, 640 మెగావాట్ల పవన విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఈ 1,040 మెగావాట్ల ప్రాజెక్టుకు రూ. 9,910 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టును బ్రూక్‌ఫీల్డ్, యాక్సెస్ ఎనర్జీ జాయింట్ వెంచర్ ప్లాట్‌ఫాం ఎవ్రెన్ చేపట్టనుంది. బ్రూక్‌ఫీల్డ్ గ్లోబల్ ప్రెసిడెంట్ కానర్ టెస్కీతో లండన్‌లో ఈ ఏడాది ఆగస్టులో మంత్రి లోకేశ్ సమావేశమైన నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు ముందడుగు పడింది. ఆర్ఈసీ ప్రకటన పట్ల మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. ఇది రాష్ట్ర కొత్త క్లీన్ ఎనర్జీ పాలసీ ఫలితానికి ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు.

మరో ఆర్నెల్ల పాటు కాల్పుల విరమణ

» శాంతియుత వాతావరణాన్ని కొనసాగిస్తాం

» తెలంగాణ మావోయిస్టు పార్టీ లేఖ విడుదల

చర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తాము మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణ కొనసాగిస్తున్నామని తెలంగాణ మావోయిస్టు పార్టీ సోమవారం ఓ లేఖ విడుదల చేసింది. పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో విడుదలైన ఆ లేఖలో కాల్పుల విరమణపై పలు అంశాలను ప్రస్తావించారు. గత ఏప్రిల్, మే నెల్లో తెలంగాణలోని అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు శాంతియుత వాతావరణం కావాలని ఉద్యమాలు చేశాయని, దాని అనుగుణంగా తమ పార్టీ ఆరు నెలల పాటు కాల్పులు విరమణ ప్రకటించిందని పేర్కొన్నారు. ఇదే వాతావరణాన్ని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్న నేపథ్యంలో మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటిస్తున్నామని తెలిపారు. గతంలో కొనసాగిన విధంగానే తమవైపు నుంచి శాంతియుత వాతావరణం కొనసాగిస్తామని, ప్రభుత్వం కూడా గతంలో వ్యవహరించిన విధంగా ఉండాలని కోరుతున్నామని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణలో కొనసాగుతున్న శాంతి యుత వాతావరణాన్ని భంగం చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని, దానికి వ్యతిరేకంగా అన్ని పార్టీలు, సామాజిక వర్గాలు, సంఘాలు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు పోరాడాలని జగన్ ఆ లేఖలో పిలుపునిచ్చారు.



రహదారి రక్తసిక్తం


ప్రమాదంలో నామరూపాల్లేకుండా పోయిన బస్సు


కంకరలో కూరుకుపోయిన వారిని పైకి తీస్తున్న దృశ్యం



టిప్పర్.. టెర్రర్

తెలంగాణలో ఓవర్ లోడ్ కంకరతో ఆర్టీసీ బస్సును ఢీకొన్న వాహనం.. టిప్పర్, బస్సు డ్రైవర్లు సహా 19 మంది దుర్మరణం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ చేవెళ్ల)

తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో వికారాబాద్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో 34 మంది గాయాలపాలయ్యారు. కంకర లోడ్‌తో వేగంగా వెళుతున్న టిప్పర్ వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును నేరుగా ఢీకొని, కుడిపక్క ఆరు సీట్లను నుజ్జు నుజ్జు చేసి, 55 టన్నుల కంకర లోడుతో బస్సుపై ఒరిగి పోయింది. పై నుంచి పోసినట్లుగా టన్నుల కొద్దీ కంకర మీద పడటంతో బస్సులో అనేక మంది అందులోనే సజీవ సమాధి అయ్యారు. టిప్పర్ డ్రైవర్ మితిమీరిన వేగం కారణంగానే ఈ ఘోర ప్రమాదం సంభవించింది. చేవెళ్లకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న మీర్జాగూడ గ్రామ శివారులో మూల మలుపు వద్ద గుంతను తప్పించేందుకు కుడివైపునకు వచ్చిన టిప్పర్ అనేక కుటుంబాల్లో విషాదానికి కారణమైంది. తాండూరు నుంచి సోమవారం తెల్లవారు జామున బయలు దేరి హైదరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు (టీఎస్ 34టీఏ 6354) వికారాబాద్‌ను దాటింది. మరోవైపు హైదరాబాద్ పటాన్‌చెరు సమీపంలోని ఇస్నాపూర్ నుంచి కంకర లోడ్‌తో టిప్పర్ వికారాబాద్ ప్రాంతానికి వస్తోంది. 40 టన్నుల కెపాసిటీ ఉన్న టిప్పర్‌కు 55 టన్నుల మేర బాడీకి మించి కంకరను పోశారు. దానికి తోడు ప్రమాదానికి కాస్త ముందు టిప్పర్ పలు వాహనాలను వేగంగా దాటేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బస్సును ఢీకొనగానే టిప్పర్ వెనుక లోడ్ ఉన్నభాగం కంకరతో సహా ముక్కలైన బస్సు క్యాబిన్‌లోకి ఒరిగిపోయింది. క్యాబిన్ మొత్తం కంకర గుట్టగా మారిపోయింది. ప్రమాద తీవ్రతకు బస్సు కుడిభాగం మొత్తం ధ్వంసం కాగా, టిప్పర్ ముందు భాగం నుజ్జయింది. ఈ ఘటనలో బస్సులో డ్రైవర్ వెనుక భాగంలో ఉన్న ఆరు లైన్లలో సీట్లలో కూర్చున్న వారంతా దాదాపు చనిపోయారు. వీరి మీద టిప్పర్‌లోని కంకర అంతా కుప్పగా పడిపోవడంతో బస్సులోనే ప్రాణాలు వదిలారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సు 72 మంది ప్రయాణికులతో కిక్కిరిసి ఉంది. కొందరు సీట్లు లేక నిలుచొని ఉన్నారు. తెల్లవారుజాము కావడంతో ప్రయాణికుల్లో అనేక మంది నిద్రపోతున్నారు. 6:40 గంటల సమయంలో ఒక్కసారిగా బస్సు భారీ శబ్దంతో కుదుపునకు గురి కావడంతో ఎవరికీ ఏం జరిగిందో అర్థం కాలేదు. కళ్లు తెరిచి చూసే సమయానికి పక్క సీట్లలో ఉన్న వారు ఏమయ్యారో తెలియదు. బస్సు నిండా కంకర, దుమ్ము. అనేక మంది కంకర కింద పడి చనిపోగా, కొంతమంది అద్దాలు పగలగొట్టి బయటపడ్డారు. ఇంతలో బస్సు వెనుక నుంచి, ముందు నుంచి వాహనాల్లో వస్తున్న వారు, పొలాల వద్ద ఉన్న వారు పలువురిని రక్షించారు. డ్రైవర్‌తో కలిపి బస్సులో మొత్తం 18 మంది అక్కడికక్కడే చనిపోయారు. మరో 34 మంది గాయపడ్డారు. ప్రమాద ఘటనలో టిప్పర్ డ్రైవర్ కూడా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుల్లో 13 మంది మహిళలు, 40 రోజుల వయసుగల ఒక శిశువు ఉన్నారు. మృతుల్లో వికారాబాద్ జిల్లా వాసులు 15 మంది ఉండగా ఇద్దరు హైదరాబాద్, ఒకరు కర్ణాటక, మరొకరు మహారాష్ట్రకు చెందిన వారు ఉన్నారు.

19 మంది ప్రాణాలు తీసిన గుంత?

ఘోర ఘటనకు మూలమలుపు మీద ఉన్న గుంతే కారణంగా ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. చేవెళ్ల నుంచి వికారాబాద్ వైపు వెళ్లే రోడ్డుకు ఎడమవైపు గుంత ఉంది. టిప్పర్ డ్రైవర్ మలుపులో ఉన్న గుంతను చివరిక్షణంలో గుర్తించి వాహనాన్ని కాస్త కుడివైపు తిప్పాడు. ఈ క్రమంలో ఓవర్‌లోడ్‌తో ఉన్న టిప్పర్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొంది. తమవైపు దూసుకు వస్తున్న లారీ నుంచి తప్పించుకునేందుకు బస్సు డ్రైవర్‌కు ఎలాంటి మార్గం అక్కడ లేదు. అప్పటికే రోడ్డు చివరలో వెళుతోంది. కొన్నాళ్లుగా గుంత అలానే ఉంది. మరమ్మతులు చేసి ఉంటే ఈ ఘోరం జరిగి ఉండేది కాదు. మలుపులోని గుంత ఇంత మంది ప్రాణాలు పోవడానికి కారణమైంది.

అతి వేగమే కారణం

టిప్పర్ అతి వేగం కారణంగానే ఈ ఘోర ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. టిప్పర్ వెనుక వస్తున్న వారు కూడా ఇదే విషయాన్ని చెప్పారు. బస్సు పరిమిత వేగంతోనే వస్తోందని, టిప్పర్ వాయువేగంతో వచ్చి మలుపు దగ్గర అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బస్సును ఢీ కొట్టి దానిపై పడిపోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుల సంఖ్య అధికంగా ఉండడానికి టిప్పర్‌లో అధిక లోడ్‌తో ఉన్న కంకరే కారణమని తేల్చారు. కంకర ప్రయాణికులపై కుప్పగా పడటమే ఎక్కువ ప్రాణ నష్టానికి కారణమైంది. దాదాపు ఎనిమిది మంది కంకర కింద కూరుకుపోయి ఊపిరాడక చనిపోయారని పోస్టుమార్టం చేసిన వైద్య సిబ్బంది ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వారి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని, దీన్ని బట్టి ఊపిరాడకే చనిపోయినట్లుగా భావిస్తున్నామని చెప్పారు. టిప్పర్ కంకర తీసుకుని ఉదయం 4:30 గంటలకు సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ నుంచి బయలుదేరింది. టిప్పర్‌లో 55 టన్నుల కంకర లోడ్ చేసినట్లు తెలిసింది. టిప్పర్ బాడీపైకి కంకర ఉండడంతో బస్సుపై టిప్పర్ పడగానే ఒకేసారి కుప్పగా కంకర బస్సుపై పడిపోయింది. ఆ కంకర కింద పడి ఊపిరాడక నిమిషాల్లోనే ప్రాణాలు వదిలారు. క్షతగాత్రులను స్థానికులు, పోలీసులు అరగంటలోపే బయటకు తీసినప్పటికీ అప్పటికే కొందరు ప్రాణాలు విడిచారు.

హాహాకారాలు... ఆక్రందనలు

ప్రమాదంలో గాయపడిన వారంతా బస్సు నుంచి బయటపడేందుకు హాహాకారాలు, ఆక్రందనలు చేశారు. రోడ్డుపై ఇతర వాహనాల్లో వస్తున్న వారితో పాటు పొలాల వద్ద ఉన్న వారు వచ్చి కొందరిని రక్షించారు. పోలీసులకు ఫోన్ చేసి జేసీబీ యంత్రాలు తెప్పించారు. బస్సును కొందరు తమ వద్ద ఉన్న ఆయుధాలతో అద్దాలు పగలకొట్టి ప్రయాణికులను కాపాడారు. ఏదో విధంగా కంకర తొలగించి కొందరిని గాయాలతో బయటకు తీసుకొచ్చారు. సగం కంకరలో ఇరుక్కు పోయిన వారు కాపాడాలని కేకలు వేస్తుండడం అందరినీ కంటతడి పెట్టించింది. నడుంలోతు కంకరలో కూరుకుపోయిన తోల్కాట్ట సాంఘిక సంక్షేమ గురుకుల స్కూల్ టీచర్ జయసుధను స్థానికులు కాపాడారు. కేరెల్లికి చెందిన ఆమె వికారాబాద్‌లో బస్సు ఎక్కారు. ఆమెతో పాటు రావాల్సిన మరో నలుగురు టీచర్లు ఈ బస్సు మిస్ అయి ప్రాణాలు దక్కించుకున్నారు. కంకర కింద శవాల గుట్ట బయటపడడంతో అధికారులు, స్థానికులు విస్తుపోయారు.

ప్రమాదానికి 45 నిమిషాలకు ముందు మారిన డ్రైవర్లు

ప్రమాదానికి దాదాపు 45 నిమిషాల ముందు వరకు యజమానే టిప్పర్‌ను నడిపినట్లు తెలిసింది. టిప్పర్ యజమాని లక్ష్మణ్‌ది మహబూబ్‌నగర్ జిల్లా బాలాపూర్. భార్య లచ్చిరామ్ నాయక్ పేరు మీద టిప్పర్ కొన్నాడు. అతని దగ్గర మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బీజేవాడి గ్రామానికి చెందిన ఆకాశ్ ధన్యా కామ్లే టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ కలిసి ఆదివారం రాత్రి నుంచి కంకర టిప్పర్ నడుపుతున్నారు. సోమవారం ఉదయం 4:30కి ఇస్నాపూర్‌లోని ఓ క్రషర్‌లో కంకర లోడ్ నింపుకున్న తర్వాత అక్కడి నుంచి శంకర్‌పల్లి వరకు లక్ష్మణ్ నడిపించాడు. తనకు నిద్ర రావడంతో డ్రైవింగ్ నుంచి తప్పుకొని ఆకాష్‌కు డ్రైవింగ్ అప్పజెప్పాడు. ప్రమాద సమయంలో యజమాని నిద్రిస్తున్నట్లు సమాచారం.

బస్సు దుర్ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మంత్రి లోకేశ్ కూడా ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఒక రోజు సెలవు కోసం వచ్చి

ఒక్క రోజు సెలవు కోసం హైదరాబాద్ నుంచి సొంతూరుకు వచ్చిన అనేక మందిని టిప్పర్ రూపంలో మృత్యువు కాటేసింది. మరో గంటన్నరలో హైదరాబాద్ చేరుకోవాల్సిన వాళ్ల తనువు చాలించారు. బస్సులో 30 మందికి పైగా విద్యార్థులు, ఉద్యోగులే ఉన్నారు. హైదరాబాద్‌లో ఉంటూ సెలవులకు స్వగ్రామాలకు వస్తుంటారు. ఆదివారం సెలవు కావడంతో సొంత ఊర్లకు వచ్చారు. తిరిగి సోమవారం ఉదయమే హైదరాబాద్‌కు వచ్చి చదువులకు, విధులకు వెళతారు. అందుకే సోమవారం ఉదయం లేదా సెలవు మర్నాడు ఈ బస్సు రద్దీగా ఉంటుంది.

తీరని శోకం..

దుర్మరణంపాలైన ముగ్గురు అక్కాచెల్లెళ్లు

- బంధువుల పెళ్లికి వచ్చి వెళ్తుండగా విషాదం
- హృదయవిదారకంగా రోదిస్తున్న తల్లిదండ్రులు



తాండూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నవ్వుతూ తుళ్లుతూ తిరిగే ముగ్గురు అక్కాచెల్లెళ్లు.. చేవెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణంపాలయ్యారు! పదిహేను రోజుల క్రితం జరిగిన సొంత అక్క పెళ్లిలో సందడి చేసిన ఆ ముగ్గురూ.. ఆ పెళ్లికి వేసిన పందిరి తీయకముందే ప్రాణాలు కోల్పోయారు!! నాలుగు రోజుల క్రితం జరిగిన బంధువు పెళ్లికి వచ్చి తిరిగి వెళ్తూ కన్నవారికి శాశ్వతంగా దూరమైపోయారు! జిల్లాలోని యాలాల మండలం పేర్కంపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ ఎల్లయ్య గౌడ్‌కు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు. వీరిలో పెద్ద కుమార్తె అనూషకు గత నెల 17న పెళ్లి జరిగింది. మిగతా ముగ్గురు కుమార్తెలు.. నందిని (డిగ్రీ మొదటి సంవత్సరం), సాయిప్రియ (డిగ్రీ మూడో సంవత్సరం), తనూష(ఎంబీఏ) హైదరాబాద్‌లో చదువుతున్నారు. అక్టోబరు 30న సమీప బంధువు పెళ్లి జరగడంతో.. ముగ్గురు అక్కాచెల్లెళ్లూ తాండూరు వచ్చారు. సోమవారం ఉదయం తెల్లవారు జామున తిరిగి హైదరాబాద్‌కు బస్సులో వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ప్రమాదవార్త తెలుసుకుని పరుగుపరుగున అక్కడికి చేరుకున్న ఎల్లయ్యగౌడ్ దంపతులు.. తమ కుమార్తెలు ఇక లేరని తెలుసుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. శవ పరీక్ష అనంతరం యాలాల మండలం పేర్కంపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అమ్మ పొత్తిళ్లలోనే..

- బస్సు ప్రమాద మృతుల్లో 40 రోజుల పసికందు, ఆ చిన్నారి తల్లి, తాత



ముద్దులు మూట గట్టే మనవరాలికి ఉయ్యాల వేడుక నిర్వహించి.. కూతుర్ని అత్త వారింటిలో దిగబెట్టడానికి బయల్దేరాడా తండ్రి! కానీ గమ్యం చేరేలోగానే బస్సు ప్రమాదంలో ముగ్గురూ దుర్మరణంపాలయ్యారు. తాండూరు పట్టణం ఇందిరానగర్‌కు చెందిన ఖాలిద్ కుమార్తె సాలిదా బేగం 40 రోజుల క్రితం పాపకు జన్మనిచ్చింది. దీంతో ఖాలిద్.. బంధువులను పిలిచి ఉయ్యాల వేడుక నిర్వహించడంతోపాటు రెండు రోజుల క్రితం చిల్లా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాపకు జోరాఫాతిమాగా నామకరణం చేశారు. సోమవారం ఉదయం ఖాలిద్ తన కూతురిని అల్లుడి వద్ద దిగబెట్టేందుకు మనవరాలితో కలిసి హైదరాబాద్‌కు బస్సులో బయలుదేరారు. కానీ మార్గమధ్యంలోనే మృత్యువు వారిని కబళించింది. ఆదమరచి అమ్మ ఒడిలో నిద్రిస్తున్న జోరా ఫాతిమా.. అసలేం జరుగుతోందో తెలుసుకునేలోపే సాహిదాబేగం, ఖాలిద్.. ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు!

అమ్మానాన్నలను కోల్పోయి..

- అనాథలైన ఇద్దరు బాలికలు..



తాండూరు,యాలాల, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): ముక్కుపచ్చలారని ఇద్దరు బాలికలు.. సోమవారం బస్సు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలయ్యారు! యాలాల మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన కుడుగుంట లక్ష్మి(43), బందెప్ప కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండడంతో.. భర్త బందెప్ప ఆమెను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు తాండూరులో బస్సెక్కాడు! దారిలో జరిగిన ప్రమాదంలో ఇద్దరూ దుర్మరణం చెందారు. వీరికి ఇద్దరు కుమార్తెలు.. శిరీష, భవాని ఉన్నారు. విగతజీవులుగా మారిన తల్లిదండ్రులను చూసి ఆ పిల్లలిద్దరూ కన్నీరుమున్నీరుగా విలపించారు. కన్నవారిని కోల్పోయి హృదయవిదారకంగా రోదిస్తున్న ఆ ఇద్దరు చిన్నారులను చూసినవారి గుండెలు తరుక్కుపోయాయి!

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

- ఒకరు మృతి, 10 మందికి గాయాలు
- మద్యం మత్తులో.. వాహన డ్రైవర్!
- ఏలూరు జిల్లాలో ప్రమాదం


బోల్తా పడిన బస్సు

లింగపాలెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా చిన్నటేకూరులో జరిగిన ఘోర బస్సు ప్రమాదం మరువునకు రాకముందే.. మరో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైంది. ధర్మాజీగూడెం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న భారతీ ట్రావెల్స్ బస్సు.. ఏలూరు జిల్లా లింగపాలెం శివారు జూబ్లీనగర్ వద్ద సోమవారం రాత్రి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో పది మంది గాయపడ్డారు. పోలీసులు, ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు.. భారతీ ట్రావెల్స్ ఏఆర్ 06 బీ 8428 నెంబరు స్లీపర్ బస్సు ధర్మాజీగూడెం నుంచి సత్తుపల్లి మీదుగా హైదరాబాద్‌కు వెళ్తోంది. అయితే.. బస్సు ప్రారంభమైనప్పటి నుంచి డ్రైవర్ మితిమీరిన వేగంతో నడిపినట్టు ప్రయాణికులు తెలిపారు. ఎక్కినప్పటి నుంచి అతన్ని హెచ్చరిస్తూనే ఉన్నారు. తొలుత మఠంగూడెం-లింగపాలెం మధ్యలో ప్రయాణికులతో వెళుతున్న ఓ ఆటోను బస్సు రాసుకుంటూ వెళ్లింది. ఆటో డ్రైవర్ కంగారుగా ఆటోను పక్కన ఆపేశాడు. ఆటో డ్రైవర్, సహా ప్రయాణికులు హాహాకారాలు చేశారు. అయినప్పటికీ బస్సును ఆపలేదు. అదే వేగంతో వెళుతున్న బస్సు లింగపాలెం వైన్‌షాపు వద్ద మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరిని ఢీకొట్టింది. వారు కింద పడిపోయారు. దీంతో స్థానికులు కేకలు వేస్తూ బస్సును ఆపమని అరిచారు. అయినా డ్రైవర్ అదే నిర్లక్ష్యంతో బస్సును ముందుకు పోనిచ్చాడు. బైక్ పై నుంచి పడిన ఇద్దరు బస్సును వెంబడించారు. డ్రైవర్ మరింత వేగం పెంచాడు. ఈ క్రమంలో జూబ్లీనగర్ సమీపంలోని మలుపు రావడంతో స్పీడుగా వెళుతున్న బస్సు నియంత్రణ కోల్పోయి బోల్తా పడింది. బస్సులో ముందు సీటులో కూర్చున్న హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న వీరంకి ప్రవీణ్(25)పై బస్సు వరిగి పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని బస్సులో ఉన్న 13 మందిని బయటకు తీశారు. బస్సు డ్రైవర్ మద్యం తాగి ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

ప్రమాదంలో 'పంతొమ్మిది'

- ఏపీ, తెలంగాణ, రాజస్థాన్‌లలో దుర్ఘటనలు
- ప్రతి చోటా 19 మంది దుర్మరణం

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వరుసగా భారీ ప్రమాదాలు... బాధిత కుటుంబాలనే కాదు, ఇతరులనూ కలచివేసిన విషాదాలు! ప్రతి ప్రమాదంలో 19 మంది చొప్పున మరణించారు! గత నెల 24వ తేదీన కర్నూలు నగర సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. అంతకుముందే ప్రమాదానికి గురై రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఢీకొనడం... దానిని అలాగే ఈడ్చుకుంటూ వెళ్లడంతో మంటలు చెలరేగి 19 మంది సజీవ దహనమయ్యారు. ఇక... సోమవారం తెలంగాణలోని చేవెళ్ల సమీపంలో ఆర్టీసీ బస్సును కంకర టిప్పర్ ఢీకొనడంతో 19 మంది చనిపోయారు. సోమవారమే... రాజస్థాన్‌లో ఒక తాగుబోతు డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు 19 మంది బలైపోయారు. ఇక... శనివారం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు.

రెప్పపాటులో నలుగురు బలి

- బాపట్లలో ఘోర రోడ్డు ప్రమాదం


బాపట్ల జిల్లా కర్లపాలెం హైవేపై ప్రమాదానికి గురైన కారు, లారీ

బాపట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వారంతా ఒకే కుటుంబ సభ్యులు.. ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ ఉల్లాసంగా గడిపారు. అనంతరం సంతోషంగా తిరిగి వెళుతుండగా హఠాత్తుగా మృత్యువు లారీ రూపంలో ఎదురైంది. అర్ధరాత్రి వేళ జాతీయ రహదారిపై వేగంగా వెళుతున్న వీరి కారు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. అంతే.. రెప్పపాటులో ఘోరం జరిగింది. కారులో ఉన్న ఆరుగురిలో దంపతులతో పాటు, మరో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. కర్లపాలేనికి చెందిన బేతాళం బలరామరాజు(65), ఆయన భార్య లక్ష్మి(60)తో పాటు గాదిరాజు పుష్పవతి(60), సమీప బంధువు విజయవాడకు చెందిన మదునూరి శ్రీనివాస రాజు(57), మరో ఇద్దరు చిన్నారులు ఆదివారం రాత్రి బాపట్ల రూరల్‌లో జరిగిన ఓ వేడుకల్లో పాల్గొన్నారు. తర్వాత అందరూ కారులో కర్లపాలేనికి తిరుగుపయనమవ్వగా శ్రీనివాసరాజు కారు నడుపుతున్నారు. అర్ధరాత్రి వేళ.. చీకట్లో కారు వేగంగా వెళుతూ కర్లపాలెం జాతీయ రహదారిపై లారీని ఢీకొంది. రెప్పపాటులో జరిగిన ప్రమాదంలో బలరామరాజు, లక్ష్మి, పుష్పవతి, శ్రీనివాసరాజు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని ఎయిర్ బ్యాగులు తెరుచుకోగా, ఇద్దరు చిన్నారులు గాదిరాజు జయంత్, వైష్ణవి మాత్రం స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన అర్ధగంట వ్యవధిలో వెనుకనే ఇంకో కారులో వస్తున్న బలరామరాజు కుమార్తె, మరికొంత మంది బంధువులు ఈ ఘటనను చూసి నివ్వెరపోయారు. బాధితులందరినీ హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. కారు అతివేగమే ప్రమాదానికి కారణంగా ప్రాథమిక సమాచారం. మదునూరి శ్రీనివాస రాజు స్వస్థలం విజయవాడ. మృతులంతా బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్రవర్మ సమీప బంధువులని సమాచారం.

జైలుకు జోగి బ్రదర్స్

రమేశ్, రాముకు 13 వరకు కోర్టు రిమాండ్

- తెల్లవారుజామున 5 గంటలకు తీర్పు
- నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలింపు

విజయవాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో అరెస్టయిన వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రాముకు విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు రిమాండ్ విధించింది. ఈ నెల 13వ తేదీ వరకు రిమాండ్ విధిస్తున్నట్టు న్యాయాధికారి జి.లెనిన్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. జోగి సోదరులను నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తరలించాలని ఆదేశించారు. ముందుగా విజయవాడ జిల్లా జైలుకు తరలించి అక్కడి నుంచి నెల్లూరు కేంద్ర కారాగారానికి పంపాలని స్పష్టం చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంకే విజయలక్ష్మి, జోగి సోదరుల తరఫున మాజీ ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, మన్మథరావు వాదనలు వినిపించారు.

జోగి సోదరుల కనుసన్నల్లోనే...

ముందుగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంకే విజయలక్ష్మి వాదనలు వినిపించారు. "జోగి సోదరులకు, ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావుకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. జోగి సోదరులు వెనకుండి జనార్దనరావును నడిపించారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులోను, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోను కల్తీ మద్యం తయారీ మొత్తం వారి కనుసన్నల్లోనే జరిగింది. దీనికి సంబంధించి జోగి సోదరులకు అద్దేపల్లి సోదరులు దఫదఫాలుగా లక్షలాది రూపాయల ముడుపులు ముట్టజెప్పారు. కొన్నిసార్లు ఈ డబ్బులను ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద తీసుకున్నట్టు ఇప్పటికే అరెస్టయిన నిందితులు వాంగ్మూలంలో వెల్లడించారు. ఇబ్రహీంపట్నంలో కల్తీ మద్యం తయారీని ప్రారంభించడానికి ముందు జోగి సోదరులు పలుమార్లు అద్దేపల్లి జనార్దనరావును కలిశారు. జనార్దనరావు ఈ విషయంపై చర్చించడానికి జోగి రమేశ్ ఇంటికి వెళ్లారు. వారిద్దరి మధ్య ఫోన్లలో సంభాషణ మొత్తం వాట్సాప్ ద్వారా జరిగింది. రమేశ్, జనార్దనరావు కలిసి ఆఫ్రికా పర్యటనలకు వెళ్లారు" అని పీపీ వివరించారు. జోగి సోదరుల తరఫున పొన్నవోలు వాదనలు వినిపిస్తూ.. ప్రధాన నిందితులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా జోగి సోదరులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఈ కేసులో ఏర్పాటైన సిట్ గానీ, ఎక్సైజ్ పోలీసులు గానీ ఎలాంటి ఆధారాలను సేకరించలేదని వివరించారు.

జైలు నుంచి జైలుకు

వాదప్రతివాదనలను విన్న తర్వాత న్యాయాధికారి జి.లెనిన్‌బాబు సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు తీర్పును వెలువరించారు. జోగి సోదరులకు ఈ నెల 13 వరకు రిమాండ్ విధించారు. తెల్లవారుజాము వరకు ఎస్కార్ట్ పోలీసులు మేల్కొని ఉండడంతో అప్పటికప్పుడు నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించడం కష్టమవుతుందని భావించి, ముందుగా నిందితులను విజయవాడ జిల్లా జైలుకు తరలించాలని ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఈ జైలు సిబ్బంది ద్వారా వారిని నెల్లూరు కేంద్ర కారాగారానికి పంపాలని స్పష్టం చేశారు. దీంతో వారిని విజయవాడ జిల్లా జైలుకు తీసుకెళ్లి, సోమవారం మధ్యాహ్నం నెల్లూరు జైలుకు తరలించారు.

అజ్ఞాతంలోకి జోగి అనుచరులు

విజయవాడ ప్రభుత్వాసుపత్రి వద్ద జోగి రమేశ్ కుమారుడు రాజీవ్, అనుచరులు చేసిన వీరంగంపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. జోగి సోదరులను క్యాజువాలిటీలోకి తీసుకెళ్తుండగా రమేశ్ కుమారుడు రాజీవ్ అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శంకర్‌పై దౌర్జన్యం చేశారు. ఆయన అనుచరులు పోలీసులను తోసుకుంటూ లోపలికి ప్రవేశించారు. ఈ ఘటనలో అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ రెండు ఘటనలపై ఆసుపత్రి అవుట్ పోస్టు కానిస్టేబుల్ తాతనంబోయిన శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదుపై మాచవరం పోలీసులు కేసు నమోదు


విజయవాడ జిల్లా జైలు వద్ద తన కుమారులతో జోగి రమేశ్

చేశారు. జోగి రమేశ్ భార్య శకుంతల, కుమారుడు రాజీవ్, జోగి రాము కుమారుడు రోహిత్‌పై కేసు నమోదు చేశారు. జోగి రాజీవ్, రోహిత్ వెనుక క్యాజువాలిటీలోకి దూసుకొచ్చిన అనుచరులను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. వారిలో కొంత మంది అరెస్టుల భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ కేసులో జోగి బ్రదర్స్ అరెస్టులతో కలిపి 19 మందిని నిందితులుగా పేర్కొన్నారు. తాజాగా మరో నలుగురిని నిందితులుగా చేర్చారు. దీంతో నిందితుల సంఖ్య 23కి చేరింది.

జోగి బ్రదర్స్‌ను కస్టడీకి ఇవ్వండి

నకిలీ మద్యం తయారీ కేసులో నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రామును పది రోజుల పాటు పోలీసుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సోమవారం ఎక్సైజ్ అధికారులు విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో వారి నుంచి మరింత సమాచారం రాబట్టాల్సి ఉందని పేర్కొన్నారు. పిటిషన్‌ను అనుమతించిన కోర్టు తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. విజయవాడ తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌లో జోగి సోదరులను సుదీర్ఘంగా విచారించినప్పటికీ కొన్ని విషయాలు మాత్రమే వెల్లడించారు. చాలా విషయాలను గోప్యంగా ఉంచినట్టు అధికారులు భావిస్తున్నారు.

అద్దేపల్లితో 20 ఏళ్ల బంధం!

- కల్తీ మద్యం సిండికేట్‌తో జోగి బ్రదర్స్‌కు సంబంధాలు
- అద్దేపల్లి సోదరుల నుంచి భారీగా ముడుపులు
- ప్రతిసారి 5 లక్షల నుంచి 8 లక్షల వరకు
- రిమాండ్ రిపోర్టులో ఎక్సైజ్ పోలీసుల వెల్లడి

విజయవాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావుతో మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాముకు దాదాపు 20 ఏళ్ల నుంచి వ్యాపార, ఆర్థిక సంబంధాలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ బంధం మరింత బలపడింది. నకిలీ మద్యం కేసులో ఎక్సైజ్ అధికారులు రిమాండ్ రిపోర్టులో ఈ సంచలన విషయాలు పేర్కొన్నారు. ములకలచెరువు, ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహనరావు తయారు చేసిన నకిలీ మద్యం వ్యవహారంలో జోగి సోదరులు లక్షలాది రూపాయల ముడుపులు అందుకున్నారు. అద్దేపల్లి అన్నదమ్ములు ప్రతిసారి 5 లక్షల నుంచి 8 లక్షలు జోగి బ్రదర్స్‌కు ముట్టజెప్పేవారు. వాట్సాప్ కాల్‌లో మాట్లాడేవారు. జోగి రమేశ్ పెడన ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి జనార్దన్‌రావు, జగన్మోహన్‌రావుతో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో అద్దేపల్లి సోదరులతో కలసి జోగి రమేశ్, జోగి రాము మద్యం బిజినెస్ చేశారు. కొవిడ్ సమయంలోనూ జనార్దనరావు, జగన్మోహనరావు.. రమేశ్ సహకారంతో ఏఎన్నార్ బార్‌ను కొనసాగించారు. కొవిడ్ తర్వాత ఎన్డీపీఎల్ లిక్కర్ తెలంగాణ నుంచి తెచ్చి ఇబ్రహీంపట్నంలో జనార్దన్ బార్‌లో అమ్మారు. స్విమ్మింగ్ పూల్‌ను శుభ్రం చేయడానికి ఉపయోగించే రసాయనం, ఫినాయిల్ ముసుగులో తీసుకొచ్చేవారు. ఇందుకు జోగి సోదరులు సహకరించారు. ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీలో విక్రయాలను బట్టి రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకు జోగి బ్రదర్స్‌కు అద్దేపల్లి సోదరులు అందజేసేవారు. ఏఎన్ఆర్ బార్‌లో పనిచేసే పసుపులేటి మురళీకృష్ణ, దేవబత్తుల సాయిచైతన్యలు చేర్చేవారు. జనార్దనరావు రూ.8 లక్షలను బ్యాంకు నుంచి డ్రా చేసి రూ.4 లక్షలను జోగి రాముకు ఫెర్రీ ఘాట్‌లో అందజేశాడు. ఆ తర్వాత మరో రూ.5 లక్షలు జోగి రమేశ్ ఆదేశాల మేరకు రాముకు ఇచ్చాడు.

మద్యం స్కామ్‌లో మరో మలుపు!

మనీ లాండరింగ్ లింకు లాగిన 'సిట్'..

డొల్ల కంపెనీల ద్వారా నిధుల తరలింపు

- ముంబై వ్యాపారి అనిల్ చోఖ్రా సాయం.. ఆధారాలు సేకరించిన అధికారులు
- ఇప్పటికే రెండు కేసుల్లో అరెస్టు చేసిన ఈడీ
- అదే వ్యక్తిని ఆశ్రయించిన నాటి 'పెద్దలు'

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన వేల కోట్ల మద్యం స్కామ్ దర్యాప్తులో మరో కీలక అడుగు పడింది. కమీషన్ల రూపంలో పోగేసుకున్న నల్లధనాన్ని 'వైట్' చేసేందుకు వాడిన మనీ లాండరింగ్ మూలాల లింకును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గుర్తించింది. అక్రమ చలామణీలో చెయ్యి తిరిగిన ముంబై వ్యాపారి అనిల్ చోఖ్రా నుంచి కీలక వివరాలు రాబట్టింది. జగన్ చుట్టూ ఉండే ఎంపీ మిథున్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలకు బెయిలు రావడంతో... కేసు అక్కడితో ఆగిపోయిందని ఊపిరి పీల్చుకుంటున్న 'అంతిమ లబ్ధిదారు'కు చిక్కులు తప్పవని తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... రెండు రోజుల క్రితం విజయవాడ నుంచి ముంబై వెళ్లిన ప్రత్యేక బృందాలు అక్కడ అనిల్ చోఖ్రాను ప్రశ్నించాయి. అనిల్‌మనీలాండరింగ్ కేసుల్లో ఇప్పటికే రెండుసార్లు అరెస్టయ్యారు. డొల్ల కంపెనీలు సృష్టించి నల్ల డబ్బును తెలుపు చేయడంలో ఆయన సిద్ధహస్తుడు. బినామీల పేరుతో క్రిపటి ఎంటర్‌ప్రైజెస్, నైసనా మల్టీ వెంచర్స్, ట్రీఫర్ ఎంటర్‌ప్రైజెస్, విక్సో ఎంటర్‌ప్రైజెస్ అంటూ నాలుగు డొల్ల కంపెనీలు సృష్టించారు. ఎటువంటి వ్యాపారాలు చేయకుండానే వేల కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహించారు. వీటి ద్వారా ఆయన మనీ లాండరింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రెండు వేర్వేరు కేసుల్లో 2017లో, 2021లో అరెస్టు చేసి జైలుకు పంపింది. బెయిలుపై బయటికి వచ్చిన అనిల్ చోఖ్రాను గత ప్రభుత్వ ముఖ్యులు సంప్రదించారు. ఏపీలో నిరుపేదల రక్తాన్ని పీల్చి మరీ దోచుకున్న మద్యం డబ్బులను వైట్‌గా మార్చేందుకు సహకరించాలని కోరారు. ఆయన తన అనుచరుల పేరుతో ఉన్న డొల్ల కంపెనీల జాబితా ఇచ్చారు. అందులో నాలుగు కంపెనీల ఖాతాలు వాడుకుని వందల కోట్ల రూపాయల లావాదేవీలు జరిపారు. ఇలా చేసినందుకు కమీషన్ పుచ్చుకున్నారు. మద్యం ముడుపులు మార్పు చేసి గత ప్రభుత్వంలో ముఖ్యుల వాటాను వైట్ చేసి చెల్లించేవారు. కేసు దర్యాప్తులో భాగంగా 'సిట్' అధికారులు అనిల్ చోఖ్రా కార్యకలాపాలు, మద్యం ముడుపులను మార్చడంలో ఆయన పాత్రపై కీలక ఆధారాలు సేకరించారు. ఎవరెవరితో, ఎప్పుడెప్పుడు సంప్రదింపులు జరిపారనే సాంకేతిక ఆధారాలను గుర్తించారు. ముంబైకి వెళ్లి అనిల్ చోఖ్రా ముందు సంబంధిత ఆధారాలను పెట్టారు. దీంతో ఆయనకు నోరు తెరవక తప్పలేదు. జగన్ హయాంలో వందల కోట్ల రూపాయలను అక్రమంగా చలామణీ చేసినట్లు అంగీకరించారు. దీంతో లిక్కర్ స్కామ్‌లో మరో నిందితుడు చేరాడు. అనిల్ చోఖ్రాను 49వ నిందితుడిగా చేరుస్తూ సిట్ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేశారు. ఇప్పటికే 48మంది నిందితులున్న ఈ కేసులో 12మందికి పైగా అరెస్టయ్యారు. కొందరు బెయిలుపై విడుదల కాగా రాజ్ కసిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడు తదితరులు జైల్లోనే ఉన్నారు. అనిల్ చోఖ్రాను అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అధిష్ఠానం డైరెక్షన్ మేరకే మాట్లాడా..!

- బస్సు ప్రమాదంపై దుష్ప్రచారం కేసు విచారణలో శ్యామల


పోలీసుల విచారణకు వస్తున్న శ్యామల

కర్నూలు క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు సమీపంలో జరిగిన బస్సు ప్రమాద ఘటనపై దుష్ప్రచారం కేసులో వైసీపీ నాయకురాలు, యాంకర్ శ్యామలతో పాటు మరో నలుగురు సోమవారం పోలీసు విచారణకు హాజరయ్యారు. సోమవారం ఉదయం 11:30 గంటలకు కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ ఎదుట ఆమె హాజరయ్యారు. డీఎస్పీతోపాటు మరో పది మంది టెక్నికల్ బృందం ఈ విచారణలో పాల్గొన్నారు. 2 గంటల పాటు సాగిన విచారణలో పోలీసులు 60కి పైగా ప్రశ్నలు సంధించారు. శివశంకర్ అనే యువకుడు కల్తీ, బెల్టు షాపులో కొన్న మద్యం తాగి బైక్ నడపడం వల్లే బస్సు ప్రమాదం జరిగిందంటూ తాడేపల్లి మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలకు పోలీసులు శ్యామలను ఆధారాలు అడిగారు. దీనికి వైసీపీ అధిష్ఠానం తనకు ఇచ్చిన సమాచారం మేరకే ప్రెస్‌మీట్‌లో మాట్లాడినట్లు ఆమె సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అనంతరం శ్యామల బయటకొచ్చి మీడియాతో మాట్లాడారు. శివశంకర్ బెల్టు షాపులో మద్యం తాగినట్లు తమ పార్టీ వద్ద సమాచారం ఉందన్నారు. పోలీసు విచారణకు సీఎస్ రెడ్డి, నాగార్జున రెడ్డి, వెంకటరెడ్డి, నవీన్‌లు కూడా హాజరయ్యారు.

ఓటుకు నోటుపై సమగ్ర విచారణ అవసరం: సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసులో సమగ్ర విచారణ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. జనవరి రెండోవారంలో ఇరుపక్షాలకు సంబంధించిన సుదీర్ఘ వాదనలు వింటామని తెలిపింది. ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల నియామావళి కింద విచారణ చేపట్టాలని కోరుతూ 2021 జూలై 22న రేవంత్ రెడ్డి, ఈ కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ 2021 ఏప్రిల్ 13న సండ్ర వెంకట వీరయ్య వేర్వేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ రెండు పిటిషన్లపై సోమవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. రేవంత్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. 'ఓటుకు నోటు' వ్యవహారంలో రేవంత్ రెడ్డిపై దాఖలైన కేసు చెల్లుబాటు కాదని లూథ్రా వాదించారు.

హైకోర్టులో కసిరెడ్డి బెయిల్ పిటిషన్

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తాను ఐటీ సలహాదారుగా మాత్రమే పనిచేశానని, మద్యం పాలసీ రూపకల్పనతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని, తనకు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఇక, మద్యం కుంభకోణంలో రిమాండ్‌లో ఉన్న తనకు కుర్చీ, మంచం సదుపాయాలు కల్పించాలని బూనేటి చాణక్య దాఖలు చేసిన పిటిషన్‌పై ఏసీబీ కోర్టు ఈనెల ఐదో తేదీన తీర్పు ఇవ్వనున్నట్లు న్యాయాధికారి పి.భాస్కరరావు వెల్లడించారు.

చెవిరెడ్డి ఫిజియోథెరపీ పిటిషన్‌పై నేడు విచారణ

మంతెన ఆశ్రమంలో ఫిజియోథెరపీ చేయించుకోడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ మద్యం స్కాం నిందితుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ మంగళవారానికి వాయిదా పడింది. విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న తాను వెన్నుముక నొప్పితో బాధపడుతున్నందున ఫిజియోథెరపీ చేయించుకోడానికి అనుమతి ఇవ్వాలని కొద్ది రోజుల క్రితం చెవిరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. కాగా, చెవిరెడ్డి భాస్కరరెడ్డిని జైలు అధికారులు సోమవారం మంగళగిరిలోని ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పంటి నొప్పి ఎక్కువ కావడంతో మంగళవారం ఎయిమ్స్‌కు తీసుకురాగా వైద్య పరీక్షలు నిర్వహించారు.

'ఫేక్' చిచ్చుకు పోలీస్ ఉచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

విషం చిమ్ముతోంది. గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకూ వందల కొద్ది తప్పుడు పోస్టులు పెట్టారు. గడిచిన పదమూడు నెలలుగా సమాజంలో అశాంతికి బీజాలు నాటే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

సీఎం ఆదేశాలతో కదలిక..

ఇద్దరు వ్యక్తుల వివాదంలో జరిగిన హత్యకు కులం రంగు పులిమి నానాయాగీ చేయడంతో ప్రభుత్వ పెద్దలు భయపడి మృతుడి కుటుంబసభ్యులకు భూములు, లక్షలాది రూపాయల పరిహారం ప్రకటించారు. ఇటీవల ఒక మహిళ అప్పుల వాళ్ల వేధింపుల కారణంగా తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ హడావుడి చేసింది. ఇంకేముంది...ఆమెది ఉప ముఖ్యమంత్రి కులం.. వేధించిన వ్యక్తుల్లో ముఖ్యమంత్రి కులానికి చెందిన వ్యక్తి ఉన్నారంటూ వైసీపీ ప్రచారం మొదలు పెట్టింది. యూరియా విషయంలో రైతులను.. మెడికల్ కాలేజీల వ్యవహారంలో విద్యార్థులను రెచ్చగొట్టాలని చూశారు. రోజురోజుకూ శ్రుతి మించి జరుగుతున్న ఈ దుష్ప్రచారానికి ముగింపు పలకాలంటూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

పొరుగు రాష్ట్రాల్లో సృష్టి.. విదేశాల నుంచి పోస్టు..

ముఖ్యమంత్రి ఆదేశాలతో చర్యలకు ఉపక్రమించిన పోలీసులు, తమ ప్రణాళిక అమలుకు, వ్యాప్తికి సైకో బ్యాచ్ అనుసరిస్తున్న పద్ధతులను పసిగట్టారు. అధునాతన సాంకేతికతతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను కూడా ఉపయోగించి కీలక సమాచారాన్ని సేకరించారు. ప్రభుత్వంపై ఎలా విషం చిమ్మాలి.. ఏ సందర్భంలో ఎలాంటి ఫేక్ కంటెంట్ సృష్టించాలి..ఏ దేశం నుంచి మొదట పోస్టు చేయించాలి..వేగంగా వైరల్ చేసి మొదట్లో పోస్టు చేసిన వారి ఖాతా నుంచి ఎలా డిలీట్ చేయాలి.. అనే పక్కా ప్రణాళికతో సైకో బ్యాచ్ నిరంతరం పని చేస్తున్నట్లు కనుక్కున్నారు. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్‌ల్లో ఫేక్ కంటెంట్ క్రియేటర్లు ఉన్నట్లు ఆచూకీ లభించింది. కంటెంట్ సిద్ధం కాగానే బెల్జియం, అమెరికా, ఫ్రాన్స్, సింగపూర్, డెన్మార్క్, ఇండోనేసియా, నార్వే వంటి దేశాలకు పంపి అక్కడినుంచి సోషల్ మీడియాలో పోస్టు చేయిస్తున్నట్లు తేలింది.

అలా పసిగట్టి.. ఇలా శిక్షిస్తారు..

ఏపీతోపాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి ఉద్యోగాల కోసం ఇతర దేశాలకు వెళ్లినవారిని ఫేక్ ప్రచారానికి వాడుకొంటున్నట్లు మన పోలీసులు పసిగట్టారు. ప్రత్యేకంగా ఏఐ సహాయంతో తయారు చేయించిన యాప్ ద్వారా సేకరించిన సమాచారం మేరకు.. ఈ ఏడాది అక్టోబరు నాటికి విదేశాల్లో ఉంటున్నవారిలో 698 మంది అకౌంట్లను పోలీసులు గుర్తించారు. ఇప్పుడు ఈ అకౌంట్ల ద్వారా ఏది పోస్టు చేసినా క్షణాల్లోనే తెలిసిపోతోంది. ఆ వెంటనే వాస్తవం ఏమిటో (ఫ్యాక్ట్ చెక్) చెప్పేస్తారు.

అలర్ట్ నుంచి లోకేషన్ వరకూ..

అధికారం కోల్పోయినప్పటినుంచీ తీవ్ర అసహనానికి గురవుతున్న మాజీ సీఎం జగన్ 'మీ చేతిలో సెల్ ఫోనే మీ ఆయుధం కావాలి..ప్రతిఒక్కరూ ప్రశ్నిస్తూ పోస్టులు పెట్టాలి. వైసీపీ జెండా మోసిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం' అంటూ చేసిన సూచనతో సైకో ముఠా ఇష్టారీతిన రెచ్చిపోతోంది.విదేశాల నుంచి వచ్చే ఫేక్ కంటెంట్‌ను విపరీతంగా వ్యాప్తి చేస్తుండటంతో పోలీసులు విరుగుడు కనుక్కున్నారు. ఫేక్ కంటెంట్ ఎక్కడ పోస్టు చేసినా క్షణాల్లో అలర్ట్ వచ్చేలా ఏఐ సాయంతో యాప్ సిద్ధం చేశారు. అందులో అలర్ట్ మొదలుకొని ట్రాకింగ్, సీడీఆర్ ఆటోమేటిగ్గా తెలుస్తాయి. వెంటనే సైబర్ పోలీసులు సంబంధిత వ్యక్తి లొకేషన్‌ను గుర్తిస్తారు. అంతిమంగా ఐపీ అడ్రస్ తెలుసుకుని, బాధ్యులను అరెస్టు చేసి జైలుకు పంపుతారు.

కఠిన చర్యలు తప్పవు: డీజీపీ



కుల, మత, ప్రాంత విద్వేషాలు పెంచేందుకు ప్రయత్నించేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సోమవారం హెచ్చరించారు. "ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ, లేనిది ఉన్నట్లు కల్పితాలు సృష్టించి సమాజంలోకి వ్యాప్తిచేసి అలజడి సృష్టించేవారిని మాత్రం వదిలిపెట్టబోం. ఏ దేశంలో దాక్కున్నా పట్టుకుని కచ్చితంగా జైల్లో పెడతాం. ప్రపంచమంతా ఐటీ చట్టాలు మారుతున్నాయి. మనంకూడా కొత్త చట్టాన్ని తెచ్చే ప్రయత్నాల్లో ఉన్నాం. మూడునెలల్లో అంతా సరిదిద్దుతాం." అని పోలీస్ బాస్ హెచ్చరించారు.

భక్తితో రండి.. భద్రంగా వెళ్లండి..!

- క్యూలైన్లలో క్రమశిక్షణగా వ్యవహరించాలి
- భక్తుల భద్రత నిమిత్తం ప్రత్యేక మార్గదర్శకాలు

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల వరుస ప్రమాదాల నేపథ్యంలో.. ఆలయాల్లో భక్తుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. భక్తులకు సులువుగా దర్శనం కల్పించడంతో పాటు వారి సౌకర్యార్థం ఆలయాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక మార్గదర్శకాలు సిద్ధం చేసింది. ముఖ్యంగా కార్తీక మాసంలో వచ్చే ఆది, సోమవారాలు, పౌర్ణమి, ఏకాదశి వంటి పర్వదినాల్లో భక్తుల భద్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈవోలను ఆదేశించింది. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సర్క్యులర్ జారీచేశారు. కార్తీక మాసంలో ఆలయాల్లో పాటించాల్సిన నియమాలతో పాటు ముఖ్యమైన రోజుల్లో దేవాలయాల్లో భక్తులు, సిబ్బంది పాటించాల్సిన సూచనలను అందులో వివరించారు. దేవస్థానంలోని మైకుల ద్వారా భక్తులకు ఎప్పటికప్పుడు సమాచారమిచ్చేలా ప్రకటనలు చేయాలని అందులో స్పష్టం చేశారు. కాశీబుగ్గ సంఘటన సహా ఈ ఏడాది జరిగిన పలు దుర్ఘటనల్లో కొందరు భక్తులు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ మార్గదర్శకాలు విడుదల చేసింది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. భక్తులు కూడా దేవుడి పట్ల భక్తిభావంతో ఆలయానికి వచ్చి.. భద్రంగా తిరిగి వెళ్లాలని మార్గదర్శకాల్లో సూచించింది. ఈ మార్గదర్శకాలను వెంటనే అన్ని ఆలయాల్లోనూ అమలు చేసి, భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని పేర్కొంది.

భక్తులు చేయాల్సినవి..

- భక్తులు నిర్దేశించిన క్యూలైన్లలోనే దర్శనానికి వెళ్లాలి.
- దర్శన సమయాలను గుర్తించి తదనుగుణంగా క్రమశిక్షణగా వ్యవహరించాలి.
- దేవస్థాన సిబ్బంది సూచనలు పాటించాలి.
- రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు దర్శనం కోసం సహనంతో వేచి ఉండాలి.
- వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు ముందుగా దర్శనానికి వెళ్లేలా సహకరించాలి.
- తోటిభక్తులకు ఇబ్బందికలిగేలా ప్రవర్తించరాదు
- తొక్కిసలాట, పెద్దగా గుమిగూడిన పరిస్థితులు కనిపించిన వెంటనే దూరంగా వెళ్లాలి.
- ఏదైనా అత్యవసర, అనుమానాస్పద పరిస్థితిని గమనిస్తే వెంటనే సిబ్బందికి తెలియజేయాలి.
- దేవస్థానం ప్రాంగణంలో భక్తి, సహనం, క్రమశిక్షణతో మెలగవలెను.

భక్తులు చేయకూడనివి..

- క్యూలైన్లలోకి వ్యతిరేకదిశలో ప్రవేశించకూడదు.
- పరుగు తీయడం లేదా తోసుకోవడం చేయొద్దు
- ముందున్న భక్తులను నెట్టకూడదు.
- రైలింగ్‌లు, బారికేడ్లకు ఆనుకుని నిలవరాదు
- గుంపులుగా చేరరాదు.
- సిబ్బంది సూచనలను తప్పక పాటించాలి.

అధికారులు, సిబ్బందికి సూచనలు..

- ఆలయ ప్రాంగణంలో మైక్ ద్వారా నిరంతర ప్రకటనలు చేస్తూ భక్తులకు తగు సూచనలివ్వాలి.
- ప్రవేశం, నిష్క్రమణ మార్గాలను స్పష్టంగా గుర్తించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- బారికేడ్లు, రైలింగ్‌లు పటిష్ఠంగా ఉన్నాయో లేదో ముందుగానే తనిఖీ చేయాలి.
- ఆది, సోమవారాలు, పౌర్ణమి, ఏకాదశి రోజులు, ఇతర ముఖ్య పర్వదినాల్లో ఆయా దేవస్థానాల్లో తగిన సంఖ్యలో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలి.
- భద్రతా సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, వైద్యబృందాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.
- ఫస్ట్ ఎయిడ్, అంబులెన్సులు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి.
- ఎక్కువ రద్దీ ఉన్న సమయాల్లో బందోబస్తు నిమిత్తం పోలీస్ శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి.
- పోలీస్ సిబ్బంది, గార్డులతో రోప్ పార్టీలను ఏర్పాటు చేసుకోవాలి.

సోషల్ మీడియాను నియంత్రించాలి

దేవుడన్నా, ఆలయాలన్నా భక్తులకు కొంత సెంటిమెంట్ ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో పండుగలు, ప్రత్యేకమైన దినాల్లో సోషల్ మీడియాలో కొంతమంది లేనిపోని హైప్ క్రియేట్ చేస్తున్నారు. దీంతో భక్తులు మరింత ఉత్సాహంగా ఆలయాలకు క్యూ కడుతున్నారు. ఊహించిన దానికంటే భక్తులు భారీ సంఖ్యలో వస్తుండడంతో ఆలయ సిబ్బంది కూడా చేతులెత్తేస్తున్నారు. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే సోషల్ మీడియాలో అతిగా చూపించే వీడియోలను నియంత్రించాలనే డిమాండ్ వినిపిస్తోంది. ప్రభుత్వం కూడా సోషల్ మీడియాను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని, దీనికోసం ప్రత్యేక మార్గదర్శకాలు విడుదల చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.



అధికారులు ఏం చేయాలి?

- ఆలయాల్లో మైక్ ద్వారా ప్రకటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదు.
- భక్తులకు స్పష్టంగా అర్థమయ్యేలా సూచనలిస్తూ ఉండాలి.
- బారికేడ్లు, క్యూలైన్ మార్గాలను కిందస్థాయి సిబ్బంది అనధికారికంగా మార్చరాదు.
- అత్యవసర, నిష్క్రమణ మార్గాలను అడ్డుకోరాదు.
- ఏదైనా ఘటన జరిగిన వెంటనే తక్షణ చర్యలు తీసుకోవాలి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.